ఉప్పల్.. తిప్పల్

ఉప్పల్ కూడలి నుంచి వరంగల్ వైపు ప్రయాణమంటేనే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. పై వంతెన పనులు నత్తనడకన సాగుతుండటం.. నిర్మాణ సామగ్రి అడ్డంకిగా మారడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సమీపంలోనే బస్సులు నిలుపుతుండటంతో కదల్లేని పరిస్థితి.







అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత బేగంపేట రైల్వేస్టేషన్ (నమూనా చిత్రం)

11 స్టేషన్లు.. ₹514.49 కోట్లు

మారనున్న నగరంలోని పలు రైల్వే స్టేషన్ల రూపురేఖలు

ఈనాడు, హైదరాబాద్

రాజధాని పరిధిలో రైల్వేస్టేషన్ల రూపురేఖలు మారనున్నాయి. దక్షిణ మధ్య రైల్వే ఇందుకోసం రూ.514.49 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇప్పటికే చర్లపల్లి టెర్మినల్ పనులు పూర్తి కాగా.. ఏడాదిలో సికింద్రాబాద్ స్టేషన్ అందుబాటులోకి రానుంది. చర్లపల్లి కోసం రూ.430 కోట్లు, సికింద్రాబాద్ స్టేషన్‌కు రూ.720కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. సికింద్రాబాద్ కాకుండా మరో 11 స్టేషన్లను అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేస్తోంది.

12 రాజధాని పరిధిలోనివే..

మల్కాజిగిరి, బేగంపేట, యాకుత్‌పుర, ఉమ్దానగర్ స్టేషన్ల పనులు మరో 6 నెలల్లో పూర్తికానున్నాయని రైల్వే అధికారులు వెల్లడించారు. మరో ఏడు స్టేషన్ల పునరాభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా రూ.1830.4 కోట్లతో 38 స్టేషన్లను అభివృద్ధి చేస్తుండగా..రాజధాని పరిధిలోనే 12 స్టేషన్లు ఉండటం గమనార్హం. టెండరింగ్ ప్రక్రియ పూర్తయింది.

చేపడుతున్న అభివృద్ధి పనులివే..

● ముఖ ద్వారాల అభివృద్ధి, ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారాలు, స్టేషన్‌కు దారితీసే రోడ్ల వెడల్పు చేయడం ద్వారా రాకపోకలు సులభతరం చేయడం. ● ప్రయాణికుల సౌలభ్యానికి సైన్ బోర్డులు, పాదచారుల కోసం ప్రత్యేక మార్గాల అభివృద్ధి, వాహనాల కోసం పార్కింగ్ సదుపాయం, స్టేషన్‌లో విద్యుదీకరణ. ● ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పచ్చదనం, కళలు, సంస్కృతిని ప్రతిబింబించేలా చిత్రాలు, స్టాళ్ల ఏర్పాటు. ● సాధ్యాసాధ్యాలను పరిశీలించి స్టేషన్ భవన నిర్మాణం, ప్రాంగణానికి రెండో ప్రవేశాన్ని ఏర్పాటు చేయడం. ● ఎక్కువ ఎత్తులో ప్లాట్‌ఫాంల ఏర్పాటు, సరిపడా షెల్టర్ల నిర్మాణం. ● మరింత నాణ్యత గల పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, ఎల్ఈడీ స్టేషన్ నేమ్ బోర్డులు, అధునాతన వెయిటింగ్ హాళ్ల అభివృద్ధి. ● నగర కేంద్రాలుగా స్టేషన్లను అభివృద్ధి చేయడం, స్టేషన్ భవనాల అభివృద్ధి, పునరాభివృద్ధి, రద్దీకి ఆస్కారం లేకుండా ట్రాఫిక్ సర్క్యులేషన్, ఇంటర్ మోడల్ ఇంటిగ్రేషన్ వ్యవస్థ ఏర్పాటు.

నిధుల మంజూరు వివరాలివి.. (స్టేషన్ / నిధులు (రూ.కోట్లలో))

స్టేషన్	నిధులు
హైదరాబాద్	309.00
హఫీజ్‌పేట్	26.60
హైటెక్‌సిటీ	26.60
హుప్పుగూడ	26.81
మలక్‌పేట్	36.44
మల్కాజిగిరి	27.61
బేగంపేట	22.57
మేడ్చల్	8.37
షాద్‌నగర్	9.59
ఉమ్దానగర్	12.37
యాకుత్‌పుర	8.53

అక్రమాలను పట్టాలెక్కించారు

గండిపేట మండలంలో అక్రమార్కుల దందా

70 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా



ఈనాడు, హైదరాబాద్

హైదరాబాద్ ఐటీ కారిడార్ సమీపంలోని గండిపేట మండలంలో కొందరు 70 ఎకరాల ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా రికార్డుల్లో మార్చేసుకున్నారు. అయిదేళ్ల కిందట ధరణి పోర్టల్‌లోనూ వారి పేర్లు, కుటుంబ సభ్యుల పేర్లతో నమోదు చేయించారు. ప్రస్తుతం ఆ భూముల విలువ రూ.3,500 కోట్లు ఉంటుందని రెవెన్యూ అధికారుల అంచనా.

అనుమానం రాకుండా..

పోర్టల్‌లో నమోదు చేసే సమయంలో తెలివిగా వ్యవహరించి అప్పుడున్న కొందరు అధికారులు, కిందిస్థాయి సిబ్బంది సహకారంతో ఈ అక్రమాలకు పాల్పడ్డారు. ధరణి రికార్డుల్లో మార్పులు చేసుకున్నా, నిర్మాణాలు చేపట్టినా, ప్లాట్లుగా విభజించినా రెవెన్యూ అధికారులకు అనుమానం వస్తుందని ఖాళీగా ఉంచారు. ఐటీ కారిడార్‌లో భారీ నిర్మాణాలు చేపడుతున్న కంపెనీలు, బిల్డర్లు తమ కూలీల కోసం స్థలం కావాలంటూ కోరినప్పుడు అక్కడక్కడా తాత్కాలికంగా టెంట్లు వేసుకోనిస్తున్నారు. కొన్ని రోజుల కిందట ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ ఉన్నతాధికారికి అనుమానం వచ్చి అధికారులను విచారించగా ప్రభుత్వ స్థలమేనని నిర్ధారణ అయింది. రికార్డుల్లో పేర్లు ఎలా మార్చారు? ఎవరెవరి ప్రమేయం ఉంది ? అన్న అంశాలపై పరిశీలిస్తున్నారు.

సర్కారు భూముల సరిహద్దులోనే..

ఐటీ సంస్థలు..జంట జలాశయాలున్న మండలంలో రెండు గ్రామాల్లో వందల ఎకరాల్లో ప్రభుత్వ భూములున్నాయి. 30 ఏళ్ల కిందటి వరకూ అక్కడ ఎలాంటి అభివృద్ధి జరగకపోవడంతో ప్రభుత్వం కూడా అటువైపు కన్నెత్తిచూడలేదు. సైబర్ టవర్స్, విమానాశ్రయం వంటివి తెరపైకి రావడంతో ఆ మండలంలోని రెండు గ్రామాల్లో భూముల విలువ పెరుగుతుందని ముందే గ్రహించిన కొందరు ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని సర్కారు భూములకు సమీపంలోని రైతుల వద్ద 10 ఎకరాలు కొనుగోలు చేశారు. వీటికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూముల 12 సర్వే నంబర్లలో దశల వారీగా 70 ఎకరాలు ఆక్రమించారు. అనంతరం 20 ఏళ్ల కిందట పహాణి రికార్డులు వారి పేర్లపై సృష్టించారు.

మైనింగ్ అనుమతులు తీసుకొని...

కబ్జాదారులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. సరిహద్దులుగా ప్రహరీలు నిర్మిస్తే అధికారుల తనిఖీల్లో తెలిసిపోతుందని మట్టితో అక్కడక్కడా స్పీడ్‌బ్రేకర్లు వంటివి ఏర్పాటు చేశారు. భూముల ధరలు పెరగడం, పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో ప్రణాళికలో రెండో భాగాన్ని అమలు చేశారు. తమకున్న పట్టా భూమిలో మైనింగ్ చేసుకుంటామని గనుల శాఖ అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకున్నారు. మైనింగ్ పేరుతో ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు ప్రారంభించారు. రెవెన్యూ అధికారులు వచ్చినప్పుడు తవ్వకాలను నిలిపేసేవారు. పరిసర ప్రాంతాల్లో బహుళ అంతస్తులు నిర్మాణాలు అధికం కావడంతో వేగంగా మట్టి, రాళ్లను తవ్వి సమీపంలోని కంపెనీలకు ఇస్తున్నారు. కంపెనీల కాలుష్యంపై ఇటీవల స్థానికులు ఫిర్యాదు చేయగా అధికారులు కంపెనీని మూసివేయించారు. గనుల శాఖ అనుమతి పత్రాన్ని చూడగా.. ఆ సర్వే నంబరు ప్రభుత్వ భూమిగా తేలింది. దీంతో అంతర్గత విచారణ చేపట్టారు.

బుల్కాపూర్ నాలా పరిశీలన

షేక్‌పేట: షేక్‌పేట ప్రాంతంలో బుల్కాపూర్ నాలాను గురువారం హైడ్రా ఇంజినీరింగ్ అధికారి కోటేశ్వర్‌రావు నేతృత్వంలో అధికారుల బృందం పరిశీలించింది. రాయదుర్గం సరిహద్దు నుంచి షేక్‌పేట ఓయూ కాలనీ, సక్కుబాయి నగర్, మారుతీనగర్, అల్‌హమ్రా కాలనీ, వివేకాందనగర్ కాలనీ, షేక్‌పేట నాలా చౌరస్తా ప్రాంతాల్లో కాలువను సందర్శించారు. పలు ప్రాంతాల్లో కాలువలోనే నిర్మాణాలు చేపట్టడం, బఫర్‌జోన్‌ల ఆక్రమణలు గుర్తించారు. షేక్‌పేట నాలా చౌరస్తా సమీపంలో శ్మశాన వాటిక అవతల కాలువ, బఫర్ జోన్‌లో బహుళ అంతస్తుల భవనాలు రావడాన్ని గమనించారు.

నిజాంపేట పరిసరాల్లో ఘాటు గాలులు

నిజాంపేట, న్యూస్‌టుడే: ఘాటైన రసాయన వాయువులు వెలువడటంతో నిజాంపేట పరిసర ప్రజలు అవస్థలు పడ్డారు. ప్రగతినగర్ పరిధి ఎలీప్ పారిశ్రామికవాడ సమీపంలోని వాసవి లేఅవుట్, శిల్పా ప్యారడైజ్, కాకతీయహిల్స్ ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజామున 4 గంటలకు రసాయన గాలులు వీచాయి. బయటకు వచ్చిన స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. తిరిగి రాత్రి 7 గంటల సమయంలో గాలులు మరింత ఘాటుగా వీచాయి. ప్రగతినగర్‌తో పాటు నిజాంపేట, బాచుపల్లి పరిధిలోని కాలనీల ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. బయటకు వస్తే తల తిరగడం, వాంతులు వచ్చినట్లుగా అనిపించడం, కళ్ల మండటం వంటి రుగ్మతలతో ఇబ్బందులు పడ్డారు. కొందరైతే ఇళ్లనుంచి బయటకు రాకుండా లోపలే ఉండిపోయారు. రాత్రి 9 గంటల వరకూ అదే పరిస్థితి. గాలులు ఎక్కడి నుంచి వీస్తున్నాయనేది నిర్ధారణ కాలేదు. కారణాలు గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు స్థానికులు.. పీసీబీ అధికారులకు ఎక్స్ వేదికగా ట్వీట్లు చేశారు.

దానిమ్మ.. బాటసింగారం బాట



దానిమ్మపండ్లు గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్‌కి పోటెత్తుతున్నాయి. గురువారం ఒక్కరోజే బాటసింగారం మార్కెట్‌కు వివిధ ప్రాంతాల నుంచి 9వేల బాక్సుల దానిమ్మ అంటే సుమారు 944 క్వింటాళ్లు విక్రయానికి వచ్చాయి. ఈ సీజన్‌లో ఇదే అత్యధికమని వ్యాపారులు చెబుతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో దిగుబడులు పెరగడం.. ఇక్కడ గిట్టుబాటు ధర ఉండటంతో రైతులు ఇక్కడికి వస్తున్నారు. ప్రస్తుతం మేలు రకం కిలో రూ.160 – 170లు, ఇతర రకాలు అత్యల్పంగా రూ.40-50లు పలుకుతున్నాయి. – న్యూస్‌టుడే, అబ్దుల్లాపూర్‌మెట్

అమ్మో మయోనైజ్

● నిషేధానికి అనుమతివ్వాలంటూ సర్కారుకు జీహెచ్ఎంసీ లేఖ

● షవర్మ, మండి బిర్యానీ, పిజ్జాల్లో నాసిరకం వాడకం



ఈనాడు, హైదరాబాద్: ఆహార ప్రియులు ఎంతో ఇష్టంగా తినే మయోనైజ్‌పై నిషేధం విధించేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. దీన్ని మండి బిర్యానీ, కబాబ్‌లు, పిజ్జాలు, బర్గర్లు, శాండ్‌విచ్‌లు, ఇతరత్రా ఆహార పదార్థాల్లో చెట్నీలా వేసుకుని తింటారు. ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలతో బల్దియా ఆహార కల్తీ నియంత్రణ విభాగం అప్రమత్తమైంది. ఎన్నిసార్లు చెప్పినా హోటళ్లు తీరు మార్చుకోవట్లేదంటూ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆ పదార్థాన్ని నిషేధించేందుకు అనుమతి కోరడం గమనార్హం.

వరుస ఘటనలు.. ● అల్వాల్‌లోని గ్రిల్ హౌజ్ హోటల్‌లో నాసిరకం మయోనైజ్‌ను తిన్న కొందరు యువకులు ఇటీవల ఆసుపత్రిపాలయ్యారు. వారం కిందట ఐదుగురు వాంతులు, విరేచనాలతో స్థానిక ఆసుపత్రిలో చేరడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది జనవరి 10న కూడా ఇలాంటి ఘటనే జరిగింది. అదే హోటల్‌లో షవర్మ తిన్న 20 మందికిపైగా యువకులు 3, 4 రోజులయ్యాక ఆసుపత్రుల్లో చేరాల్సి వచ్చింది. కొంతమందికి రక్త పరీక్షలు చేయగా.. హానికర సాల్మనెల్లా బ్యాక్టీరియా ఉన్నట్లు వైద్యులు తేల్చారు. ఆ హోటల్‌లోని షవర్మ బాగోలేదని బల్దియాకు ఫిర్యాదులు అందాయి. ● సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్‌లోని ఓ హోటల్‌లో, టోలిచౌకి, చాంద్రాయణగుట్ట, కాటేదాన్, బంజారాహిల్స్‌లోని పలు హోటళ్లలోని షవర్మ, మండి బిర్యానీ, బర్గర్లపైనా బల్దియాకు వరుస ఫిర్యాదులు వస్తున్నాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ హోటళ్లు, పబ్బులు, బార్ అండ్ రెస్టారెంట్లలో జరిపిన తనిఖీల్లోనూ నాసిరకం మయోనైజ్‌ను గుర్తించారు. ● ఉడికించని పదార్థమైనందున .. మయోనైజ్‌లో హానికర బ్యాక్టీరియా విపరీతంగా వృద్ధి చెందుతుంది. ఆ పదార్థాన్ని నిషేధించి, శాఖాహార పదార్థాలతో చేసే మయోను ప్రోత్సహించాలని సర్కారుకు లేఖ రాసినట్లు ఓ అధికారి 'ఈనాడు'తో తెలిపారు.

తయారీ విధానంలో నిర్లక్ష్యం..

మయోనైజ్‌ను గుడ్డులోని పచ్చసొన, నిమ్మరసం, నూనె, ఉప్పుతో తయారు చేస్తారు. ఈ క్రమంలో చాలామంది శుభ్రతను పాటించడం లేదు. కొన్ని గుడ్లపై ఉండే పెంట వంట మనిషి చేతులకు అంటుకుంటుంది. అలాగే ఇతర ముడి పదార్థాలను తీసుకుని సొనలో కలుపుతారు. అలా తయారైన మయోనైజ్ చాలా ప్రమాదకరమని జీహెచ్ఎంసీ ఆరోగ్య విభాగం చెబుతోంది. ఈ తప్పులేవీ జరగకుండా పరిశుభ్రంగా తయారైన మయోనైజ్‌ను మాత్రమే తినేందుకు ఉపయోగించాలని స్పష్టం చేస్తున్నారు. తయారైన మూడు నుంచి నాలుగు గంటల్లోపు దాన్ని ఉపయోగించాలని సూచిస్తున్నారు.



● మూసీ నిర్వాసితులకు 800 ఎకరాలు

● ఓఆర్ఆర్ సమీపంలో పరిశీలించనున్న అధికారులు

● ఒక్కొక్కరికి 150 నుంచి 200 గజాలు ఇచ్చే యోచన

ఒప్పించి.. మెప్పించి.. తరలించాలని

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: మూసీ నిర్వాసితులకు న్యాయం చేయడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వారిని ఒప్పించాకే ఖాళీ చేయించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఒక్కొక్కరికి 150-200 గజాల స్థలాన్ని ఇవ్వాలని సర్కార్ యోచిస్తోంది.

పట్టుదలతో ప్రభుత్వం.. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుపై ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ఎలాగైన సరే మొదలుపెట్టాలని చూస్తోంది. ఇందుకు మూసీ గర్భంలో ఉంటున్న వారితో పాటు 50 మీటర్ల బఫర్ జోన్‌లోని వారినీ అక్కడి నుంచి ఖాళీ చేయించాల్సి ఉంది. మూసీ గర్భంలో ఉన్న 1600 మందిలో మూడొంతుల మంది ఖాళీ చేసి ప్రభుత్వం ఇస్తున్న రెండు పడకల ఇళ్లలోకి వెళ్లడానికి అంగీకరించారు. ఇప్పటికే 250 మంది వెళ్లిపోయారు. బఫర్ జోన్‌లోని వారు మాత్రం తమకు పూర్తిస్థాయి పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే మొత్తం చాలాదని ఖాళీ చేయడానికి ససేమిరా అంటున్నారు.

మంత్రికి త్వరలో నివేదిక..

ఈ మొత్తం వ్యవహారంపై కొద్ది రోజుల కిందట మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో సీఎం చర్చించారు. బఫర్ జోన్‌లోని నిర్వాసితులకు ఇళ్ల స్థలాలను కూడా ఇస్తేనే బాగుంటుందని చెప్పడంతో రేవంత్‌రెడ్డి కూడా సూత్రప్రాయంగా అంగీకరించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇళ్ల స్థలాలు కూడా ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు మంత్రి పొంగులేటి సియోల్ పర్యటనలో వెల్లడించారు. ఇందుకు 650 నుంచి 800 ఎకరాలు అవసరమని అధికారులు గుర్తించారు. ఇప్పుడు స్థలాలు ఎక్కడున్నాయనే దానిపై అన్వేషణ మొదలు పెట్టారు. ఓఆర్ఆర్ సమీపంలో ప్రభుత్వ భూములుండటంతో.. వాటి లెక్కలు తీస్తున్నారు. ఎక్కడ ఎన్ని ఎకరాలు ఉందో కొద్ది రోజుల్లోనే మంత్రికి నివేదిక సమర్పిస్తామని ఓ అధికారి తెలిపారు. రెండు, మూడుచోట్లనైనా సేకరించి లేఅవుట్లు వేసి సకల సదుపాయాలు కల్పించాలని భావిస్తోంది. అక్కడ గజం 50 వేలకు పైబడి ధర పలికే అవకాశం ఉండటంతో ఈ ప్రతిపాదనకు బఫర్ జోన్‌లోని నిర్వాసితులు అంగీకరిస్తారని అనుకుంటున్నారు.

మురుగుకు శాశ్వత పరిష్కారం చూపాలి: ఎండీ



పనులను తనిఖీ చేస్తున్న జలమండలి ఎండీ

ఈనాడు, హైదరాబాద్: నగరంలో మురుగు పొంగిపొర్లే ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా ఉన్న సీవరేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి ఆదేశించారు. మురుగు సమస్యలకు పరిష్కారంలో భాగంగా ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. నగరంలో సీవరేజీ ఓవర్‌ఫ్లో నివారణకు పాతనగరం, సికింద్రాబాద్ ప్రాంతాల్లో కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్ పనులను గురువారం ఎండీ పరిశీలించారు. మూసారాంబాగ్, యాకుత్‌పురాలోని మౌలానా చిల్లా ప్రాంతంలో పనులను తనిఖీ చేశారు. ఈ ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ, నాలా నిర్మాణం నేపథ్యంలో పూడిక పెరిగి కొన్ని రోజుల నుంచి మురుగు రోడ్లపైకి ప్రవహిస్తుండడంతో కొత్త సీవరేజ్ పైపులైన్ నిర్మాణం చేపట్టాలని ఎండీ ఆదేశించారు. తక్షణ చర్యగా పూడిక తీత పనులు చేయాలని చెప్పారు. అనంతరం సీతాఫల్‌మండిలోని మహ్మద్‌గూడ ప్రాంతంలో సీవరేజ్ పైపులైన్ అలైన్‌మెంట్ సరిగా లేక మురుగు నీటి సమస్యను పరిశీలించారు. ఇక్కడ కూడా కొత్త మురుగునీటి పైపులైన్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో డైరెక్టర్ ఆపరేషన్స్-1 విజయారావు, సీజీఎం నాగేందర్, జీఎం, డీజీఎం, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు. ఈ స్పెషల్‌డ్రైవ్ పనులు ఈ నెల ఒకటో తేదీన ప్రారంభం కాగా ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు కొనసాగనున్నాయి. జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ నాలుగో డివిజన్‌లోని సుల్తాన్‌బజార్, గన్‌ఫౌండ్రీ సెక్షన్‌లలో సీవరేజీ పనులను పరిశీలించారు. అనంతరం బొగ్గులకుంట రిజర్వాయర్‌ను తనిఖీ చేసి నీటి నాణ్యతను పరీక్షించారు.

కొంత కాలం వేచి చూద్దాం

● స్థలాల వేలంలో ఆచితూచి ముందుకు

● ఖాళీ భూములపై దృష్టిపెట్టిన హెచ్ఎండీఏ



ఈనాడు, హైదరాబాద్: ఎన్నికల ముందు భూములు, ప్లాట్ల వేలం ద్వారా రూ.వేల కోట్లు ఖాతాలో వేసుకున్న హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రస్తుతం వేచి చూసే ధోరణి అవలంబిస్తోంది. హెచ్ఎండీఏలోని ఏడు జిల్లాల పరిధిలో వేలాది ఎకరాల భూములు, స్థలాలు ఉన్నాయి. ఒకేచోట 100, 200 ఎకరాలు కూడా అందుబాటులో ఉన్నాయి. గతంలో దఫదఫాలుగా బహిరంగ వేలంలో విక్రయించి రూ.వేల కోట్లు ప్రభుత్వ ఖాతాకు జమ చేసింది. కోకాపేట, బుద్వేల్‌లో భూముల అమ్మకం ద్వారా ఆరేడు వేల కోట్లు సమకూరాయి. కోకాపేట్‌లో రికార్డు స్థాయిలో ఎకరం రూ.100 కోట్లు పలికింది. రాజేంద్రనగర్ బుద్వేల్‌లో 100 ఎకరాల వేలంతో రూ.3000 కోట్లపైనే సమకూరింది. మోకిలలో చదరపు గజానికి రికార్డు స్థాయిలో రూ.లక్ష పలికింది. బైరాగిగూడ, మంచిరేవుల, నల్లగండ్ల, చందానగర్, పీరంచెరువు, బాచుపల్లి, బౌరంపేట్, చెంగిచర్ల, సూరారం, వెలిమల, నందిగామ, అమీన్‌పూర్, కృష్ణారెడ్డిపేట్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన వేలానికి మంచి స్పందన వచ్చింది. ఆయా ప్రాంతాల్లో గజం రూ.12 వేల నుంచి రూ.65 వేలుగా నిర్ణయించినా అంతకుమించి ధర పలికింది.

తొలుత మిగిలిపోయిన ప్లాట్లు... గతంలో హెచ్ఎండీఏ రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో పలు లేఅవుట్లను అభివృద్ధి చేసింది. మోకిలలో 300 ప్లాట్లను వేలం వేయగా.. గజం రూ.లక్ష వరకు పలికింది. అయితే వేలంలో ఎక్కువకు కొనుగోలు చేసిన చాలామంది గడువు తేదీ ముగిసినా డబ్బులు చెల్లించలేదు. ఇలా ఒక్క మోకిలలోనే 50 శాతం వరకు ప్లాట్లు మిగిలిపోయినట్లు తెలుస్తోంది. తుర్కయాంజిల్ ఇతర లేఅవుట్లలోనూ అదే పరిస్థితి. స్థిరాస్తి మార్కెట్లో కొంత ఊపు వచ్చాక ఖాళీ ప్లాట్లను వేలం వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ లేఅవుట్లలో స్థలాలకు వచ్చిన స్పందన తర్వాత ముందుకు వెళ్లే అవకాశం ఉందని అంటున్నారు. గతంలో కొందరు ముందస్తు వ్యూహంతో వేలంలో పాల్గొని కృత్రిమంగా ధరలు పెంచారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సంబంధిత లేఅవుట్‌కు సమీపంలో తమ భూములు ఉండటంతో వాటి ధర పెంచడానికి ఇలా అధిక ధర కోడ్ చేసినట్లు విమర్శలు విన్పించాయి. అధిక ధరకు పాడుకున్న వారిలో కొందరు తర్వాత డబ్బులు చెల్లించక పోవడం.. మరికొందరు ఒకటి రెండు వాయిదాలు చెల్లించి మిగతా డబ్బులు జమ చేయకపోవడంతో తర్వాత హెచ్ఎండీఏ వాటిని రద్దు చేసింది. ఈ నేపథ్యంలో ప్లాట్ల వేలం వేసే ముందు కనీస ధర విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించి ముందుకు వెళ్లాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చలి మొదలు..



ఈనాడు- హైదరాబాద్: నగరంలో చలి మొదలైంది. గత కొన్నిరోజులుగా మారిన వాతావరణ పరిస్థితులతో రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గిపోయి చల్లగాలులు వీస్తున్నాయి. మరోవైపు పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటున్నాయి. ఉదయంపూట కొన్ని ప్రాంతాల్లో మంచు కురుస్తోంది. ఉష్ణోగ్రతలు 19 డిగ్రీలకు పడిపోయి చలిగాలులు వీస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గురువారం ఉదయం నగర శివారు హకీంపేటలో 19.4, దుండిగల్‌లో 18.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సీతాఫల్‌మండీలో పర్యటించిన జలమండలి ఎండీ



సికింద్రాబాద్: జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్, కార్పొరేటర్ సామల హేమ గురువారం సీతాఫల్‌మండీలో పర్యటించారు. కొద్దిరోజులుగా మహ్మద్‌గూడలోని జమ్ జమ్ ఫంక్షన్ హాల్ ఎదురుగా తరచుగా మురుగునీరు పొంగి రోడ్డుపైకి చేరుతోందని, దీన్ని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ జలమండలి ఎండీని కోరారు.. ఆయన సిబ్బందిని రప్పించి అక్కడి సమస్యను పరిష్కరించారు. పలు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారు. జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ ప్రభు గుప్త, జనరల్ మేనేజర్ వినోద్, మేనేజర్లు ప్రియాంక, నవ్య, భారాస నాయకుడు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్

• సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

ఓయూలో మాజీ ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం



గాదరి కిషోర్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి నాయకులు

లాలాపేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ దిష్టిబొమ్మను గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ మాట్లాడుతూ.. నల్గొండ అభివృద్ధి ప్రదాత కోమటిరెడ్డి, వేముల వీరేశంలపై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కొమ్మనబోయిన సైదులు యాదవ్, పల్లపు చందు, నోముల శేషు, బోనాల నగేష్, అభి, శంకర్, శివశంకర్, ప్రవీణ్, దిలీప్, అశోక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధి కోర్సుల్లో యువతకు శిక్షణ

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా టెక్ మహీంద్రా ఫౌండేషన్, మహీంద్రా అకాడమీ ఫర్ లాజిస్టిక్స్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ పువ్వుల దీప్తి తెలిపారు. సనత్‌నగర్‌లోని సెయింట్ థెరిసా చర్చి ప్రాంగణంలోని సంస్థ కార్యాలయంలో గురువారం శిక్షణ వివరాలను ఆమె వెల్లడించారు. ఆర్థికంగా వెనుకబడిన యువతకు సప్లై చైన్ మేనేజ్‌మెంట్, వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల్లో శిక్షణతో పాటు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ, డిగ్రీ, పీజీ చదివిన 19 నుంచి 28 ఏళ్ల మధ్య వయసు కలిగిన యువత కోర్సులో చేరవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 73373 32606 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

మజీద్ బస్తీలో సంక్షేమ సంఘం ఎన్నికల సందడి

సంజీవరెడ్డినగర్: బీకేగూడ మజీద్ బస్తీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో విజయం సాధిస్తానని సీనియర్ జర్నలిస్టు, 'మేమస్ సిటీ న్యూస్' ఎడిటర్ మహ్మద్ నసీరుద్దీన్ ఖాద్రీ ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 27న పోలింగ్ సందర్భంగా బస్తీలో మద్దతుదారులతో కలిసి ఆయన గురువారం బస్తీలో ప్రచారం నిర్వహించారు.

అడ్డుకోవద్దు.. ప్రత్యామ్నాయం చూపండి

కంటోన్మెంట్: వీధి వ్యాపారులను అడ్డుకోకుండా, సాధారణ వ్యాపారాలను కొనసాగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ భాజపా నాయకుడు, సామాజిక కార్యకర్త జెట్టి ఉమేశ్వర్‌రావు అన్నారు. బోర్డు పరిధిలోని రాజీవ్ రహదారిలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న వీధి వ్యాపారాలను తొలగిస్తున్న నేపథ్యంలో ఆయన, పలువురు వీధి వ్యాపారులతో పాటు బోర్డు సీఈవో మధుకర్‌నాయక్‌ను గురువారం కలిశారు. వీధి వ్యాపారులను తొలగిస్తే, వందల కుటుంబాలు రోడ్డున పడతాయని సీఈవోకు వివరించారు. వ్యాపారం చేసుకోవడానికి సరైన చోటును చూపించి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

టపాసుల పండగ వచ్చిందోచ్..

సనత్‌నగర్‌లో ఏర్పాటవుతున్న హోల్‌సేల్ మార్కెట్



సనత్‌నగర్‌లో ఏర్పాటైన ఓ బాణసంచా దుకాణం



పారిశ్రామికవాడ ప్రధాన రహదారిపై ఏర్పాటవుతున్న దుకాణాలు

సనత్‌నగర్, న్యూస్‌టుడే: దీపావళి అంటేనే దివ్వెల పండగ.. ఇటు దీపాల వెలుగులు, అటు టపాసుల మోతలు. పండగ రోజుల్లో చిన్నా, పెద్దా టపాసులు కాలుస్తూ ఆనందిస్తారు. ఈ సందర్భంగా బాణసంచా హోల్‌సేల్ మార్కెట్‌కు ప్రసిద్ధి చెందిన సనత్‌నగర్‌లో వ్యాపారులు టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. సనత్‌నగర్ ఫైర్‌వర్క్స్ అసోసియేషన్, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘంతో పాటు మరికొందరు సామూహికంగా బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు. సనత్‌నగర్ పారిశ్రామికవాడ పార్కు సమీపంలో సుమారు 40కి పైగా బాణసంచా హోల్‌సేల్ దుకాణాలు ఏర్పాటుకు పనులు కొనసాగుతున్నాయి. ఈ పాటికే కొందరు దుకాణాలను ఏర్పాటు చేశారు. బాణసంచా వ్యాపారం లాభసాటిగా మారడంతో ఏటా సనత్‌నగర్‌లోని వ్యాపారుల మధ్య తీవ్రంగా పోటీ నెలకొంటుంది. అగ్నిమాపక కేంద్రం, జీహెచ్ఎంసీ, పోలీస్‌స్టేషన్ల నుంచి బాణసంచా దుకాణాల ఏర్పాటుకు విధిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దుకాణాల ఏర్పాటులో అన్ని నిబంధనలు పాటిస్తున్నామని ఫైర్ వర్క్స్ అసోసియేషన్ ప్రతినిధి బాల్‌రాజ్‌రెడ్డి చెప్పారు.

• అత్యవసర సహాయం కోసం అగ్నిమాపక సర్వీసుల కంట్రోల్ రూం.101 లేదా సనత్‌నగర్ ఫైర్ స్టేషన్ నం.040-23442946 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

పాటించాల్సిన నిబంధనలివే..

◆ టపాకాయల దుకాణాల ఏర్పాటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వ్యాపారుల దుకాణాలను అధికారులు స్వయంగా వచ్చి పరిశీలిస్తారు. ◆ టపాకాయల దుకాణానికి, దుకాణానికి మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలి. ◆ దుకాణాలను రేకుల షెడ్లతో మాత్రమే ఏర్పాటు చేయాలి. దుకాణాల్లో ఎలక్ట్రిక్ వైరింగ్‌లను నాణ్యమైన పద్ధతుల్లోనే ఏర్పాటు చేసుకోవాలి. ◆ పేలుడు పదార్థాల నిబంధనల ప్రకారం రిటైల్ దుకాణంలో 100 కేజీలు, ఒక హోల్‌సేల్ దుకాణంలో కేవలం 500 కేజీల బాణసంచా మాత్రమే ఉంచాలి. ◆ అగ్నిమాపక నిబంధనలను, పొగ తాగవద్దనే సూచనను దుకాణం ముందు ప్రదర్శించాలి. ◆ ప్రతీ దుకాణదారుడు దుకాణం వద్ద రెండు డ్రమ్ముల్లో నీరు, ఇసుక, ఒకటో నెంబరు ఫైర్ ఎక్స్‌ట్వింగ్విషర్లు (అగ్నిమాపక సాధనాలు) రెండు అందుబాటులో ఉంచుకోవాలి. ◆ అనుభవజ్ఞులు మాత్రమే బాణసంచా దుకాణాలను నిర్వహించాలి. 18 సంవత్సరాల లోపు పిల్లలతో దుకాణాల్లో పని చేయించరాదు. ◆ కేంద్ర ఎక్స్‌ప్లోజివ్ విభాగం అనుమతి ఉన్నవారు తప్పనిసరిగా నో అబ్జక్షన్ పత్రాలను కూడా తమకు సమర్పించాలి. ◆ దుకాణాల అనుమతులు, నిబంధనలు పరిశీలించేందుకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో కొనసాగే ప్రత్యేక డ్రైవ్‌కు వ్యాపారులు సహకరించాలి.

ఆలయం వద్ద పోలీసు ఆంక్షల సడలింపు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయం వద్ద పోలీసుల భద్రత కొనసాగుతోంది. ఈనెల 14న దుండగుడు ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసినప్పటికీ నుంచి ఉత్తరమండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ పర్యవేక్షణలో భద్రతను కొనసాగిస్తున్నారు. తాజాగా ఆంక్షలను పోలీసులు సడలించారు. రెండు రోజుల నుంచి బస్తీవాసులు సజావుగా వచ్చి వెళుతున్నారు. ఈ ప్రాంతంలో వ్యాపారాలు, దుకాణాలు యథావిధిగా కొనసాగుతున్నాయి.

హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన లాఠీఛార్జి బాధితులు

నారాయణగూడ: సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం వద్ద లాఠీఛార్జి బాధితులు గురువారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. అమ్మవారి విగ్రహంపై దాడి జరిగిందని తెలుసుకొని, అక్కడికి వెళ్లామని.. అకారణంగా పోలీసులు తమపై లాఠీఛార్జి చేశారని బాధితులు వెంకటేష్, సాయిలు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి చేసినవారిని సస్పెండ్ చేయాలన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బౌద్ధనగర్: డివిజన్‌లోని అంబర్‌నగర్‌లో రూ.29 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన సీసీరోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ కంది శైలజ ప్రారంభించారు. భారాస నాయకులు రాజేష్, శ్రీకాంత్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

రెజిమెంటల్‌బజార్: పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30 వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి ఓ ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరానికి జిల్లాలోని వివిధ ప్రైవేట్ పారా మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు పొందటానికి దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్హతతో అభ్యర్థులు దరఖాస్తుతో పాటు విద్యార్హతకు సంబంధించిన అన్ని సర్టిఫికెట్ల నకళ్లు జతపరిచి రూ.100 నగదు చెల్లించి, సికింద్రాబాద్ హరిహరకళాభవన్ వద్ద ఉన్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని చెప్పారు. వివరాలను www.tgpmb.telangana.gov.in నుంచి పొందాలని సూచించారు.

చిరునవ్వే చిగురించే కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న రచయిత నందిని సిద్దారెడ్డి, సినీనటుడు షఫీ తదితరులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలోని స్వీకార్ మల్టీ స్పెషాలిటీ కేంద్రంలోని ఆడిటోరియంలో గురువారం షేక్ నసీమా బేగం రచించిన 'చిరునవ్వే చిగురించే' కవితా సంపుటిని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ రచయిత, సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిద్దారెడ్డి, సినీనటుడు షఫీ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కవితా సంపుటిలోని అంశాలన్నీ సమాజానికి ఉపయోగపడేలా ఉన్నాయని, ఇలాంటి రచనలు ఎందరికో స్ఫూర్తిని కలిగిస్తాయని అన్నారు. సినీ గేయ రచయిత డాక్టర్ వెనిగళ్ల రాంబాబు మాట్లాడుతూ... సమాజ సంస్కరణలో భాగంగా ఇటువంటి రచనలు రావాల్సిన అవసరం ఉందన్నారు. సినీనటుడు షఫీ మాట్లాడుతూ... ఎన్ని కష్టనష్టాలు వచ్చినా వాటిని దీటుగా ఎదుర్కొనేందుకు మోముపై చిరునవ్వు చిగురించాలన్న సందేశం ఉండటం అభినందనీయమని అన్నారు. సంస్థ వైస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ నిర్మలరావు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

ఈనాడు కథనానికి స్పందన



మురుగు నిలిచిన చోట పరిశీలిస్తున్న జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్ తదితరులు

సంజీవరెడ్డినగర్: 'మురుగుతో తప్పని తిప్పలు' శీర్షికతో 'ఈనాడు' సికింద్రాబాద్ క్లస్టర్ పేజీలో గురువారం ప్రచురితమైన కథనానికి జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్ స్పందించారు. సమస్య ఉన్న ప్రాంతాన్ని స్వయంగా ఆయన పరిశీలించారు. స్థానికంగా ఉన్న మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఎగువ ప్రాంతంలో ఉన్న నివాసాలు, హోటళ్ల, వాహనాల సర్వీస్ సెంటర్ల నుంచి ఎక్కువగా నీళ్లు వచ్చి బీకేగూడ పార్కు వద్ద ఆగుతున్నాయని చెప్పారు. అక్కడే వాహనాలు పార్కింగ్ చేయడంతో సమస్య వచ్చిందన్నారు. కొందరు మూత్రవిసర్జన చేయడం, చెత్త, వ్యర్థాలు పారబోయడంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారినట్లు గుర్తించామన్నారు. వృథాగా నీటిని రోడ్లపైకి వదిలితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సార్‌నగర్ సెక్షన్ మేనేజర్ వర్షిణి, సిబ్బంది కృపాకర్, శివకుమార్ తదితరులు వెంట ఉన్నారు.

మేమున్నాం..మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

సికింద్రాబాద్	:	8008573368
కంటోన్మెంట్	:	8008573361
సనత్‌నగర్	:	8008573356

అమీర్‌పేట, న్యూస్‌టుడే:

? సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రి నుంచి బీకేగూడకు వెళ్లే రోడ్డులో, హిందూ పబ్లిక్ స్కూల్ పక్క రోడ్డులో దీపాలు వెలగడం లేదు. నిర్మానుష్యంగా ఉండే ఈ రహదారుల్లో సాయంత్రమైందంటే నడిచేందుకు మహిళలు భయపడుతున్నారు. వీధి దీపాలు పునరుద్ధరించాలి.

–జె.ఎస్.టి.శాయి, మోడల్‌కాలనీ

✓ పరిశీలించి వీధి దీపాలు పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటాను.

–కిరణ్మయి, డీఈ, జీహెచ్ఎంసీ (వీధి దీపాల విభాగం)

స్పందనకు వందనం

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో ఉల్లిగడ్డలు ధర పెంచి విక్రయించకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. రూ.45గా ఉన్న ఉల్లిని కొందరు రూ.50కి విక్రయిస్తున్నారంటూ కబీర్‌నగర్‌కు చెందిన లోగిశెట్టి సునీత 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్య 'ఈనాడు'లో ప్రచురితం కావడంతో స్పందించిన ఎస్టేట్ అధికారి రమేష్ ఉల్లి స్టాళ్ల వద్ద రూ.45గా బోర్డు ఏర్పాటు చేయించారు.

సనత్‌నగర్: సనత్‌నగర్ డివిజన్‌లోని కేఎల్‌వై ఉద్యానం ముందు ఆదిత్యానగర్ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తకుప్పలు పెరిగిపోతున్నాయంటూ తులసీనగర్ నివాసి శంకరగౌడ్ 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్య 'ఈనాడు'లో ప్రచురితం కావడంతో స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తకుప్పలను తొలగించారు.

వీరహనుమాన్ షిరిడీ సాయిబాబా ఆలయ ఛైర్మన్ కన్నుమూత

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: బల్కంపేట వీరహనుమాన్ షిరిడీ సాయిబాబా దేవాలయం ఛైర్మన్ సోమా సాంబయ్య అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన వయసు 87 సంవత్సరాలు. భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అప్పటి ఏపీఐడీసీలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. అనంతరం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ విభాగానికి కన్సల్టెంట్‌గా పనిచేశారు. గత 40 సంవత్సరాలుగా ఛైర్మన్‌గా కొనసాగుతూ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పెద్ద కుమారుడితో కలిసి మాదాపూర్‌లో ఉంటున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు. ఎస్సార్‌నగర్‌లోని ఆయన సొంతింటికి స్థానికుల సందర్శనార్థం పార్థివ దేహాన్ని గురువారం తీసుకువచ్చారు. బల్కంపేట సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఆలయ సిబ్బంది, స్థానికులు తరలివచ్చి నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన బైక్: ఒకరి దుర్మరణం

శామీర్‌పేట, న్యూస్‌టుడే: శామీర్‌పేట-ఉద్దెమర్రి రహదారిపై బాబాగూడ గ్రామ పరిధిలో ఓ ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శామీర్‌పేట రాణా ఎస్సై హారిక తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బొల్లారం- రిసాలబజార్ ప్రాంతం, ప్రేమ్‌నగర్ కాలనీకి చెందిన బ్రహ్మయ్య (44), నర్సింహ(46) బైక్‌పై వెళుతూ రహదారి పక్కనే ఉన్న స్తంభాన్ని ప్రమాదవశాత్తూ ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బ్రహ్మయ్య మృత్యువాత పడగా నర్సింహకు గాయాలయ్యాయి.

మతిస్థిమితం సరిగాలేని యువకుడి అదృశ్యం

రెజిమెంటల్‌బజార్: మతిస్థిమితం సరిగాలేని ఓ యువకుడు అదృశ్యం అయ్యాడని రాంగోపాల్‌పేట్ పోలీసులు తెలిపారు. బిహార్ రాష్ట్రం బాబుపుర్ సబోర్ వాసి లవకుష్‌కుమార్ (22) నగరంలోని పంజాగుట్టలో ఉంటున్న సోదరుడి వద్దకు కొన్నాళ్ల కిందట వచ్చాడు. రసూల్‌పురాలో స్నేహితులతో కలిసి ఉంటూ హోటల్ సురభిలో సర్వర్‌గా పనిచేస్తున్నారు. మానసిక స్థితి బాగా లేకపోవడంతో కుటుంబసభ్యులు వైద్య పరీక్షలు చేయించినా.. మందులు సరిగా వాడకపోవడంతో మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ఈనెల 5 వరకు హోటల్‌లో పనికి వెళ్లిన అతడు మరుసటి రోజు నుంచి రాకపోవటంతో విషయాన్ని అతడి సోదరుడు దిల్‌కుష్‌కుమార్‌కు తెలియజేశారు. అతడు వచ్చి ఆరా తీసినా ఆచూకీ తెలియకపోవటంతో రాంగోపాల్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తైక్వాండోలో పతక విజేతలకు అభినందన



పతకాలు సాధించిన విద్యార్థులతో పీడీ ఉమారావు తదితరులు

మారేడుపల్లి: క్రీడలు దేశ ఔన్నత్యాన్ని చాటుతాయని వెస్ట్ మారేడుపల్లి కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చారుమతి దేవి, పీడీ డాక్టర్ ఉమారావ్ పేర్కొన్నారు. 68వ ఎస్‌జీఎఫ్ ఇంటర్ జూనియర్ కాలేజ్ జిల్లా స్థాయి తైక్వాండో టోర్నమెంట్ పోటీలు అండర్ 19 విభాగంలో ఈనెల 23న నారాయణగూడ వైఎంసీఏ హాల్లో జరిగాయి. దీనిలో కళాశాల విద్యార్థినులు మూడు స్వర్ణ, ఐదు రజత, మూడు కాంస్య పతకాలు సాధించారు. విజేతలను కళాశాల కమిటీ ప్రతినిధులు అభినందించారు.

ఎమ్మెల్సీని కలిసిన కాంగ్రెస్ నేతలు

బేగంపేట: బేగంపేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు షేక్ గౌస్ ఆధ్వర్యంలో పలువురు నేతలు ఎమ్మెల్సీ, సీనియర్ పాత్రికేయులు అమీర్ అలీఖాన్‌ను కలిశారు. మైనారిటీలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం రాబోయే కౌన్సిల్ సమావేశాల్లో గళం వినిపించాలని ఆయనను కోరారు. కాంగ్రెస్ నాయకులు సిద్ధిఖ్ ఖాన్, నసీర్, అడ్డు తదితరులు ఉన్నారు.

వేర్వేరు రైళ్లలో ప్రయాణికుల నగలు, నగదు చోరీ


రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: వేర్వేరు రైళ్లలో ప్రయాణికుల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. వారాసిగూడకు చెందిన వెంకటేష్ కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 5న ద్వారకకు వెళ్లడానికి కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి ఓఖా స్పెషల్ రైల్లో ఎక్కారు. రైలు మేడ్చల్‌కు వెళ్లిన సమయంలో ప్రయాణంలో నిద్రపోయిన వెంకటేష్ మెలకువ వచ్చి చూడగా.. సామాన్ల బ్యాగులో ఉన్న 77.5 తులాల బంగారు నగలు, రూ.20 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు కనిపించలేదు. దీంతో బాధితుడు నిజామాబాద్‌లోని ఉన్న స్నేహితుడు శివసందీప్‌కు ఫోన్ చేసి విషయం తెలియజేయడంతో అతడు వెళ్లి అక్కడి జీఆర్పీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకుని బుధవారం సికింద్రాబాద్‌కు పంపటంతో దర్యాప్తు చేపట్టారు.

● కుటుంబసభ్యులతో కలిసి రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళ మెడలోని మంగళసూత్రం గొలుసు అపహరణకు గురైంది. యూసుఫ్‌గూడకు చెందిన గృహిణి సురేఖ సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌కు కుటుంబసభ్యులతో కలిసి వెళ్లి సికింద్రాబాద్‌కు బయలుదేరింది. ప్రయాణ సమయంలో అందరూ విశ్రాంతి తీసుకుంటున్నారు. రైలు పగడిపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చిన సమయంలో బోగీకి వచ్చిన ఆగంతకుడు ఆమె మెడలోని బంగారు 20 గ్రాముల మంగళసూత్రం గొలుసును లాక్కుని ఉడాయించాడు. రైలు సికింద్రాబాద్‌కు చేరుకున్న అనంతరం బాధితురాలు జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసును నల్గొండకు బదిలీ చేస్తున్నారు.

● సంగారెడ్డి జిల్లా బీరంగూడ అమీన్‌పూర్‌కు చెందిన సియాద్రి జ్యోతి బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు నర్సీపట్నం వెళ్లింది. ఈనెల 22న గరీబ్‌రథ్ రైల్లో సికింద్రాబాద్‌కు బయలుదేరింది. ప్రయాణంలో నిద్రపోయింది. 23న రైలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. రైలు దిగి ఇంటికి వెళ్లాక హ్యాండ్‌బ్యాగులో చూసుకోగా.. అందులోని 85 గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. దీంతో సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. కేసును అమీన్‌పూర్ పోలీసులకు బదిలీ చేస్తున్నారు.

● షిర్డి సాయినగర్- సికింద్రాబాద్ రైల్లో ప్రయాణికురాలి నగలు ఉన్న బ్యాగు చోరీకి గురైంది. ప్రకాశం జిల్లా ఒంగోలు గాంధీనగర్‌కు చెందిన వెంకట్‌రావు హెచ్‌పీ గ్యాస్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన కుటుంబసభ్యులతో కలిసి సాయిబాబా దర్శనానికి వెళ్లారు. తిరిగి సికింద్రాబాద్‌కు రైల్లో బయలుదేరి వస్తూ ప్రయాణంలో నిద్రపోతుండగా రైలు గురువారం తెల్లవారు జామున నాందేడ్ రైల్వేస్టేషన్‌కు వచ్చిన సమయంలో ఆగంతకుడు బోగీలోకి వచ్చి వెంకట్‌రావు భార్య హ్యాండ్‌బ్యాగును తీసుకుని ఉడాయించాడు. అందులో 40 గ్రాముల బంగారు నగలు, రూ.2 వేల నగదు, సెల్‌ఫోన్ ఉండటంతో బాధితులు జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆధునిక సాంకేతికతతో యువత ముందడుగు వేయాలి



సదస్సులో మాట్లాడుతున్న వీసీ ప్రొ.కుమార్

లాలాపేట, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతికతతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగా విద్యార్థులు, యువత ముందడుగు వేయాలని ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ అన్నారు. 79వ ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మారక లైబ్రరీలో గురువారం 'సుస్థిర అభివృద్ధిలో యువత- డిజిటల్ మార్గాలు' అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత శక్తిమంతం అయ్యేందుకు, సవాళ్లను అధిగమించేందుకు, సమగ్ర పరిష్కారాల సాధనకు డిజిటల్ వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. లైబ్రరీని వినియోగించుకుని పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా విద్యార్థులు ఓయూకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు తీసుకురావాలన్నారు. ఓయూ లైబ్రరీని డిజిటల్‌గా ఆధునీకరించేందుకు అవసరమైన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ జి. మల్లేశం మాట్లాడుతూ విద్యార్థులు తమ కెరీర్‌ను తీర్చిదిద్దుకోవటానికి డిజిటల్ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కన్వీనర్‌గా లైబ్రేరియన్ డాక్టర్ అచల వ్యవహరించారు. సదస్సులో ప్రొఫెసర్ ఎస్ యాదగిరి, ప్రొఫెసర్ ఎ.చక్రవర్తి ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, డీన్లు, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పట్టించుకోవడం లేదు



రహదారిపై చేరిన మురుగును పరిశీలిస్తున్న నేతలు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్‌లో భాజపా నేతలు గురువారం పర్యటించారు. మహ్మద్ గూడలో డ్రైనేజీ నీరు వరదలా పారుతోందని స్థానికులు ఫిర్యాదు చేయగా అక్కడకు చేరి పరిశీలించారు. ఈ సందర్భంగా భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నా.. స్థానిక ఎమ్మెల్యే, అధికారులుగాని పట్టించుకోవటం లేదని ఆరోపించారు. మురుగు నీరు తాగునీటి పైపులైన్లలో కలవడం వల్ల అనేకమంది అనారోగ్యం పాలవుతున్నారన్నారు. వాటర్ వర్క్స్ ఎండీకి ఫోన్‌చేసి సమస్య చెప్పడం వల్ల అధికారులు వచ్చారనీ.. సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని సూచించామన్నారు. తాత్కాలికంగా పరిష్కరించకుండా పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. భాజపా ఎస్సీ మోర్చా నాయకులు కుమార్ ఈఎల్ ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (గురువారం నాటివి..కిలో రూ.లో) టమాటా 35, వంగ 40, బెండ 65, పచ్చిమిర్చి 35, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 23, క్యారెట్ 45, దొండ 35, ఆలు 37, ఉల్లి 39, సొర 17, పొట్ల 13, బీన్స్ 105, గోరుచిక్కుడు 50, చిక్కుడు 80, దోస 35, బీర 55, కాకర 38, చామగడ్డ 40, కీర 45, క్యాప్సికం 70, బీట్‌రూట్ 31, కందగడ్డ 65, చిలకడదుంప 28, మామిడి 45, మునగ 65, ముల్లంగి 6(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ: టమాటా కిలో రూ.39, వంగ 40, బెండ 65, పచ్చిమిర్చి 35, కాకర 38, బీర 55, క్యాబేజీ 23, బీన్స్ 105, క్యారెట్ 47, దొండ 40, చిక్కుడు 80, క్యాప్సికం 70, ఆలు 37, కీర 24, దోస 35, చామగడ్డ 40, అరటి 9, బీట్‌రూట్ 31, సొర 17, గోకర 50, చిలకడదుంప 30, మామిడి 46, మునగ 65.

విద్యారంగంలో వ్యాపార ధోరణి బాధాకరం: ఎంపీ



భవన ప్రారంభోత్సవంలో ఈటల రాజేందర్

బోడుప్పల్, న్యూస్‌టుడే: విద్యను వ్యాపార దృష్టితో చూడొద్దని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. చెంగిచర్లలో టెక్నిక్ ఎఫ్ఎంసీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఎమ్మెల్యే మల్లారెడ్డి, బోడుప్పల్ మేయర్ అజయ్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్య పూర్తిగా వ్యాపార ధోరణిలోకి వెళుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల విద్యాతృష్ణను తీర్చేందుకు టెక్నిక్ ఎఫ్ఎంసీ ముందుకు రావడం అభినందనీయమని మల్లారెడ్డి పేర్కొన్నారు.

ఉపాధి కోర్సుల్లో శిక్షణ

సనత్‌నగర్: కార్పొరేటర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా టెక్ మహీంద్రా ఫౌండేషన్, మహీంద్రా అకాడమీ ఫర్ లాజిస్టిక్స్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ పువ్వుల దీప్తి తెలిపారు. సనత్‌నగర్‌లోని సెయింట్ థెరెసా చర్చి ప్రాంగణంలోని సంస్థ కార్యాలయంలో గురువారం శిక్షణ వివరాలను ఆమె వెల్లడించారు. ఆర్థికంగా వెనుకబడిన యువతకు సప్లై చైన్ మేనేజ్‌మెంట్, వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల్లో శిక్షణతో పాటు ఉపకార వేతనాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ, గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన 19 నుంచి 28 ఏళ్ల మధ్య వయసు కలిగిన యువత కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 7337332606 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి కృషి

అల్వాల్: మచ్చబొల్లారంలో ప్రధాన సమస్యగా ఉన్న మురుగుకు శాశ్వత పరిష్కారం లభించేలా కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ జితేంద్రనాథ్ తెలిపారు. గురువారం శ్మశాన వాటిక పరిధిలో చేపడుతున్న డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.10లక్షలతో ఏకలవ్యనగర్- మహాత్మ గాంధీనగర్ మార్గంలో భూగర్భకాలువ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కాలనీ నేతలు నరహరి, రాజయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

వాణిజ్య కేటగిరిలో అక్రమాలు

జలమండలి సిబ్బంది తీరుతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి



సాయినాథపురం జలమండలి కార్యాలయం

మౌలాలి, న్యూస్‌టుడే: జలమండలిలో కొందరు అక్రమార్కుల తీరుతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. నల్లా కనెక్షన్ల కేటగిరి పేరుతో అక్రమాల దందా నడుస్తోంది. క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు అధికారులు, సిబ్బంది కుమ్మక్కై బోర్డు ఆదాయానికి టోకరా వేస్తున్నారు. ప్రతి ఏటా వాణిజ్య భవనాల సంఖ్య పెరుగుతున్నా ఆ స్థాయిలో వాణిజ్య తాగునీటి కనెక్షన్ల సంఖ్య పెరగకుండా చేస్తూ స్వాహాకు పాల్పడుతున్నారు.

మొత్తం కనెక్షన్లలో ఒక శాతమూ లేని..

సాయినాథపురం సెక్షన్ పరిధిలో మౌలాలి, గాయత్రినగర్, తిరుమలనగర్, సాయినాథపురం రిజర్వాయర్లు ఉన్నాయి. మౌలాలి డివిజన్‌లోని అన్ని ప్రాంతాలతో పాటు తూర్పు ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాలు, వినాయకనగర్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలు కలిపి మొత్తం పది వేల తాగునీటి కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 4125 డొమెస్టిక్, 85 కమర్షియల్‌వి కాగా.. మిగతావి రూపాయి కనెక్షన్లు ఉన్నాయి. నాలుగేళ్లుగా వాణిజ్య కేటగిరీలో 27 కనెక్షన్లు మాత్రమే పెరగడం గమనార్హం. 2019 నుంచి 2024 వరకు వందల సంఖ్యలో వాణిజ్య భవనాలు పెరగ్గా.. కనెక్షన్లు మాత్రం 58 నుంచి 85కు మాత్రమే పెరిగాయి.

సాయినాథపురం సెక్షన్ పరిధిలో..

● మొత్తం నీటి కనెక్షన్లు	10 వేలు
● వాటిలో డొమెస్టిక్	4125
● వాణిజ్య విభాగంలో	85
● మిగతావి	రూ.కనెక్షన్లు

వాణిజ్య నల్లాలు..గృహ విభాగంలో..

గృహ, వాణిజ్య కేటగిరి బిల్లింగ్‌లో చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. గృహ నల్లాకు 1,000 లీటర్లు రూ.10కి ఇస్తున్నారు. అదే వాణిజ్య నల్లాకు 1000 లీటర్లకు రూ.40 నుంచి మొదలై నీటి వాడకాన్ని బట్టి బిల్లు పెరుగుతుంది. కొందరు సిబ్బంది వినియోగదారులతో కుమ్మక్కై కేటగిరిని మారుస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. వాణిజ్య నల్లాలకు గృహ కేటగిరిలో బిల్లులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల నూతనంగా వచ్చిన మేనేజర్ ఓ 15 కనెక్షన్లను పరిశీలించగా అందులో 4 వాణిజ్య కేటగిరీవి దొరకడం గమనార్హం. ఇలా మొత్తం తనిఖీ చేస్తే వందల సంఖ్యలో దొరికే అవకాశం ఉంది.

ముమ్మరంగా తనిఖీ చేస్తాం..: ఉదయ్, జలమండలి మేనేజర్

నేను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. కొన్నిచోట్ల నిబంధనలకు వ్యతిరేకంగా తీసుకున్న కనెక్షన్లు బయటపడ్డాయి. తనిఖీలు ముమ్మరం చేసి అలాంటి వాటిని సరి చేస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

మల్కాజిగిరి, గౌతంనగర్, డిఫెన్స్‌కాలనీ, అల్వాల్, న్యూస్‌టుడే:

? మల్కాజిగిరి డివిజన్ ఆనంద్‌బాగ్‌లోని ఏడీఆర్ ఆస్పత్రి సమీపంలో ఇటీవల రోడ్డు నిర్మాణం నిమిత్తం ఇళ్లముందు తవ్వి వదిలేశారు. రహదారి నిర్మాణం చేయలేదు. రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
– సీతామహాలక్ష్మి, కాలనీవాసి

✓ మీ ప్రాంతంలో రహదారి నిర్మాణం త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం. – లక్ష్మణ్, సర్కిల్ ఈఈ, మల్కాజిగిరి

? గౌతంనగర్ డివిజన్ రాజాశ్రీనివాసనగర్‌లో నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. సంబంధిత అధికారులకు తెలిపినా ఫలితం లేదు. – ప్రకాశరావు, కాలనీ సంఘం ప్రధాన కార్యదర్శి

✓ వీధి దీపాలకు మరమ్మతులు నిర్వహిస్తాం.
– వెంకటేశ్, ఏఈ, వీధి దీపాల నిర్వహణ

? నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి ఎంప్లాయిస్ కానీ ప్రధాన మార్గంలో రోడ్డు గుంతలు పడి ఉంది. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేయండి. – నారాయణరెడ్డి, ఎంప్లాయిస్ కాలనీ

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. – సృజన, ఏఈ

? సర్వేసన్‌గుట్ట రోడ్డు మార్గంలో మురుగు కొన్ని నెలలుగా లీకవుతూ రోడ్డుపై పారుతోంది. దీంతో వాహనదారులకు ఇబ్బందిగా ఉంది.
– సురేశ్, స్థానికుడు

✓ సమస్యకు కారణాలు తెలుసుకొని చర్యలు తీసుకుంటాం.
– సుజయ్, మేనేజర్, జలమండలి

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

యాదమ్మనగర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి కిరణ్‌కుమార్

అల్వాల్, న్యూస్‌టుడే: అసంఘటిత కార్మికుల చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం యాదమ్మనగర్ బస్తీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రతి కార్మికుడు కార్మిక శాఖ నుంచి గుర్తింపు పొందితే ప్రభుత్వ సహకారం పొందవచ్చని చెప్పారు. కార్మిక చట్టాల వల్ల అసంఘటిత కార్మికులు అనేక విధాల లబ్ధి పొందవచ్చని వివరించారు. ప్రమాద బీమా సదుపాయం ఉంటుందన్నారు. పలువురు భవన నిర్మాణ కార్మికులు సందేహాలను నివృత్తి చేశారు.

పోగొట్టుకున్న రూ.11.55 లక్షలు అందజేత

నారాయణగూడ: నగరానికి చెందిన ఓ వ్యక్తి అనధికార లావాదేవీ కారణంగా రూ.11.55 లక్షలు నష్టపోయాడు. హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ ఠాణాకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. సైబర్ పోలీసులు వెంటనే బాధితుడితో మాట్లాడి, బ్యాంకు అధికారులతో మాట్లాడాలని చెప్పారు. ఈలోగా దర్యాప్తు మొదలుపెట్టిన సైబర్ పోలీసులు బాధితుడి బ్యాంకు ఖాతా నుంచి వెళ్లిన నగదును ఫ్రీజింగ్ చేయించారు. కోర్టు ఉత్తర్వు అవసరం లేకుండా బాధితుడి ఖాతాకు జమ చేయించారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



డిఫెన్స్‌కాలనీ: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని గురువారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి దేవీనగర్ రామాలయంలో సీతారామ కల్యాణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకం, అర్చన చేశారు. కల్యాణం అనంతరం ఊయల సేవ నిర్వహించారు. పరిసర కాలనీల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వృద్ధ కళాకారులకు పింఛన్ ఇప్పించండి



మాట్లాడుతున్న పీఎన్ మూర్తి.. చిత్రంలో అనూహ్యరెడ్డి, శ్రీరామ్‌దత్తి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: అరవై ఏళ్లు దాటిన వృద్ధ కళాకారులందరికి పింఛన్ ఇవ్వాలని చినుక కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రచయిత పీఎన్ మూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సుందరయ్య కళానిలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆధీనంలో పని చేస్తున్న కళా సంస్థలకు గుర్తింపు కల్పించడంతోపాటు ప్రముఖ వేదికల్లో కళాకారుల నృత్య ప్రదర్శనల ఉచిత ఏర్పాటుకూ అనుమతి ఇప్పించాలన్నారు. కళలను పరిరక్షణకు కృషి చేస్తున్న గురువులకు నెలకు రూ.15 వేల చొప్పున పారితోషికాన్ని అందించాలని సూచించారు. టీవీ నిర్మాత డా.జి.అనూహ్యరెడ్డి మాట్లాడుతూ. కళారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలన్నారు. త్వరలోనే కళాకారుల శోభాయాత్రను నగరంలో నిర్వహిస్తామని తెలిపారు. వెలుగు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌దత్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి అడ్డుకట్ట

ఈనాడు కథనానికి స్పందన



ఏర్పాటు చేసిన మూత

అల్వాల్, న్యూస్‌టుడే: ఓల్డ్‌అల్వాల్‌లోని హర్ష ఆసుపత్రి మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు చేశారు. 'ఈనాడు' ఈ నెల 20న 'నాణ్యత లేమి.. ఎవరికీ పట్టదేమి' శీర్షికతో వార్తను ప్రచురించింది. స్పందించిన అధికారులు శిథిలమైన మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఈనాడుకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి, న్యూస్‌టుడే: స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్న సాదుల్లానగర్ మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ గున్నాల సునీత యాదవ్ అన్నారు. మౌలాలి సాదుల్లానగర్‌లోని మురుగు సమస్య తలెత్తిన ప్రాంతానికి ఏఈ మధురిమతో కలిసి వెళ్లారు. స్థానికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జలమండలి, ఇంజినీరింగ్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తే ఈ సమస్యలు తలెత్తవన్నారు. త్వరలో సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొంటామన్నారు.

డిజిటల్ అరెస్టు అంటూ.. రూ.24 లక్షల మోసం

నారాయణగూడ, న్యూస్‌టుడే: బెదిరించి నగదు కాజేశారని బాధితుడు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన పరిశోధకుడి(74)కి 'ట్రాయ్' అధికారులమని ఫోన్ చేశారు. మనీలాండరింగ్‌లో మీరు నిందితుడిగా ఉన్నారని, ముంబయి సీబీఐ అధికారులు మాట్లాడతారని ఫోన్ కలిపాడు. అవతలి వ్యక్తి మీ ఆధార్ కార్డు ఉపయోగించి ముంబయిలో బ్యాంకు ఖాతా తెరిచారని.. రూ.కోట్లు లావాదేవీలు జరిగాయన్నాడు. ఇది మనీలాండరింగ్‌లో భాగమని హెచ్చరించాడు. మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేశామని బెదిరించాడు. ఇంటి నుంచి బయటకు రావడానికి, ఇతరులతో మాట్లాడటానికి వీలులేదని చెప్పాడు. కొద్దిసేపటికే బాధితుడికి వీడియోకాల్ వచ్చింది. అందులో పోలీసు దుస్తుల్లో ఓ వ్యక్తి కనిపించాడు. అరెస్ట్ వారెంట్ చూపించాడు. మిమ్మల్ని మీరు కాపాడుకోవాలంటే జరిగిన మోసంలో 25 శాతం అంటే కనీసం రూ.24 లక్షలు సీబీఐ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుందన్నాడు. కేసు దర్యాప్తు పూర్తి కాగానే తిరిగి మీ ఖాతాలో జమ చేస్తామన్నాడు. నిజమని నమ్మిన ఆయన నేరస్థుడు చెప్పిన ఖాతాకు నగదు బదిలీ చేశారు. ఆ తరువాత మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.

వ్యాపారానికి రుణం ఇప్పిస్తామని.. రూ.3.17 లక్షల మోసం

వ్యాపారానికి రుణం ఇప్పిస్తామని నమ్మించి నగదు స్వాహా చేశారంటూ బాధితుడు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన వ్యాపారికి వాట్సాప్ కాల్ వచ్చింది. మీ వ్యాపారాన్ని మరింత విస్తరించుకోవాలనే ఆలోచన ఉంటే అందుకు అవసరమైన రుణం ఇప్పిస్తామని అవతలి వ్యక్తి చెప్పాడు. నిజమేనని నమ్మిన వ్యాపారి రుణానికి అవసరమైన పత్రాలు నేరస్థుడి వాట్సాప్ నంబరుకు పంపించారు. కొద్దిసేపటికి రుణం, ఈఎంఐ వివరాలు పంపించాడు. ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ, ఇన్సూరెన్స్, డిమాండ్ డ్రాఫ్ట్, ఇతర అవసరాలకు రూ.3.17 లక్షలు పంపించాల్సి ఉంటుందని సూచించాడు. వ్యాపారి నేరస్థుడు చెప్పిన ఖాతాకు పంపించారు. ఆ తరువాత అందుబాటులో లేకుండా పోయాడు.

'మ్యాన్‌హోల్'కు మరమ్మతులు



మ్యాన్‌హోల్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

గౌతంనగర్, న్యూస్‌టుడే: గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్ ప్రధాన మార్గంలో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారడంతో ఈనెల 20న 'నాణ్యత లేమి.. ఎవరికీ పట్టదేమి' శీర్షికతో ఈనాడులో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మ్యాన్‌హోల్ వద్ద ఎటువంటి ప్రమాదం జరగకుండా జలమండలి అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. త్వరలోనే పూర్తి స్థాయిలో మరమ్మతులు చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

మల్కాజిగిరి: తూర్పుఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, బ్యాంకు కాలనీ, కల్యాణ్‌నగర్ ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగటం లేదని ఈనాడు మీతోడులో గురువారం ప్రచురించిన సమస్యలకు అధికారులు స్పందించారు. ఆయా కాలనీలలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వ్యతిరేకించడం తగదు

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: పార్లమెంటులో ఆమోదించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై కొంతమంది ఆక్రోశం వెళ్లగక్కడం మంచి పద్ధతి కాదని, రిజర్వేషన్లను వ్యతిరేకించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఓసీ సంక్షేమ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన బషీర్‌బాగ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇతర సామాజిక వర్గాలకు నష్టం కలగకుండా అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లను కల్పిస్తే ఎందుకు జీర్ణించుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. రిజర్వేషన్లను సుప్రీంకోర్టు సమర్థించిందని గుర్తు చేశారు.

అసంపూర్తి పనులు పూర్తిచేయాలని వినతి



కమిషనర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కార్పొరేటర్ జితేంద్రనాథ్, కాలనీ వాసులు

అల్వాల్, న్యూస్‌టుడే: మచ్చబొల్లారంలో అసంపూర్తిగా ఉన్న వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ జితేంద్రనాథ్ జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. గురువారం కూకట్‌పల్లిలోని ఆయన కార్యాలయంలో పలు కాలనీల వాసులతో కలిసి కమిషనర్‌తో భేటీ అయ్యారు. వర్షాలకు పాడైన రోడ్ల మరమ్మతులు, వరదనీరు నిల్వ ఉండే ప్రాంతాలు, గ్రంథాలయం భవనం మరమ్మతుల పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాలనీ వాసులతో కలిసి చౌహాన్‌కు జ్ఞాపిక అందజేశారు.

బాక్స్ డ్రెయిన్ పనులు ప్రారంభించండి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయశాంతి

అల్వాల్, న్యూస్‌టుడే: బాక్స్ డ్రెయిన్ పనుల్లో జాప్యం వద్దని కార్పొరేటర్ విజయశాంతి గుత్తేదారులకు సూచించారు. గురువారం ఆదర్శ్‌నగర్‌లో పాదయాత్ర చేశారు. డ్రెయిన్ పనుల్లో జరుగుతున్న జాప్యానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టు పొందిన గుత్తేదారుడు పనుల ప్రారంభంలో జాప్యం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కాలనీలో వీధి దీపాల మరమ్మతులో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సర్కిల్ ఏఈ అభిషేక్, స్థానిక నేతలు మల్లేశ్‌గౌడ్, గిరి, సాజిద్, బాలమణి పాల్గొన్నారు.

రసవత్తరంగా డీఆర్డీవో సౌత్ జోన్ క్రికెట్ టోర్నీ

కంచన్‌బాగ్: డీఆర్డీవో టౌన్‌షిప్‌లో సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నీ రసవత్తరంగా సాగుతోంది. శుక్రవారం ఏఎస్ఎల్ (తెలంగాణ), పీఎక్స్ఈ (ఒడిశా) జట్ల మధ్య ఫైనల్ జరగనుంది. గురువారం సెమీ-ఫైనల్స్‌లో ఆర్సీఐ (తెలంగాణ), పీఎక్స్ఈ (ఒడిశా) మధ్య, మరోమ్యాచ్ ఏఎస్ఎల్ (తెలంగాణ), డీఆర్డీఎల్ మధ్య జరిగాయి. ఏఎస్ఎల్‌కు చెందిన కమలేశ్ సాహు 3 ఓవర్లలో 4 వికెట్లు తీసుకున్నాడు. అతడిని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

శ్రీమన్నారాయణ మరణం కళా రంగానికి తీరని లోటు

గౌతంనగర్: ఆజాదికా అమృత మహోత్సవ్ అవార్డు గ్రహీత, ప్రముఖ కూచిపూడి కళాకారుడు మహంకాళి శ్రీమన్నారాయణ మృతి కళా రంగానికి తీరని లోటని కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమి సభ్యురాలు, కూచిపూడి నాట్య గురువు డాక్టర్ ఎస్పీ భారతి గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

గ్రామస్థాయిలో బీసీ సంఘాల బలోపేతంపై దృష్టి

నల్లకుంట: తెలుగు రాష్ట్రాల్లో గ్రామస్థాయి నుంచి కమిటీలను నియమించి బీసీ సంఘాలను బలోపేతం చేసి ఉద్యమాలను ఉద్ధృతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ర్యాగ అరుణ్ పిలుపునిచ్చారు. బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

25 నుంచి క్యారమ్స్ టోర్నీ

అంబర్‌పేట: తెలంగాణ రాష్ట్ర సీనియర్ ఓపెన్ ర్యాంకింగ్ క్యారమ్స్ టోర్నమెంట్-2024-25ను ఈ నెల 25 నుంచి 28 వరకు రంగారెడ్డి జిల్లా గొల్లూర్ సీబీఆర్ ఫార్మ్స్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ క్యారమ్స్ అసోసియేషన్ తెలిపింది. అంబర్‌పేటలో అసోసియేషన్ సలహాదారు సీబీఆర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మదన్‌రాజ్ మాట్లాడారు.

ప్రశాంతంగా గ్రూప్-I పోటీ పరీక్ష

గౌతంనగర్: మల్కాజిగిరి పరిధిలోని ప్రోబెల్ పాఠశాలలోని రెండు కేంద్రాల వద్ద గురువారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మల్కాజిగిరి సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటి కేంద్రానికి సంబంధించి 507 మందికిగాను 377, రెండో కేంద్రంలో 887 మందికి 542 మంది పరీక్షకు హాజరయ్యారు.

అవినీతి నిర్మూలన అందరి బాధ్యత

ఘట్‌కేసర్: దేశంలో అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్ హెచ్‌పీసీఎల్ అధికారులు పేర్కొన్నారు. గురువారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

'గో-సంజీవని' పుస్తకావిష్కరణ 28న

పంజాగుట్ట, న్యూస్‌టుడే: డా.ములగేటి శివరాం రచించిన గో-సంజీవని పుస్తకాన్ని ఈ నెల 28న ఆవిష్కరించనున్నట్లు ఖైరతాబాద్‌లోని రైతు నేస్తం పబ్లికేషన్స్ అధినేత యడ్లపల్లి వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. రవీంద్రభారతి ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

'స్ఫూర్తి సభ'ను విజయవంతం చేయాలి: పీడీఎస్‌యూ

నల్లకుంట: ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా ఆవిర్భవించిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) 50 ఏళ్ల పోరాట స్ఫూర్తితో.. ఈ నెల 25న వరంగల్‌లోని కాకతీయ వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జరగనున్న 'స్ఫూర్తి సభ'ను విజయవంతం చేయాలని సంఘం హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి గణేష్ పిలుపునిచ్చారు. గురువారం విద్యానగర్‌లో ఆయన మాట్లాడారు.

'పింఛన్ పెంపునకు చర్యలు చేపట్టాలి'

కాచిగూడ: విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల పింఛన్ పెంపునకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అఖిల భారత విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు కేవీ ఆచార్య డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టామన్నారు. గురువారం రోహిణిరావు, డా.అనంతకృష్ణారావులతో కలిసి మాట్లాడారు.

వచన కవిత శిబిరం వచ్చే నెల 24న

నారాయణగూడ, న్యూస్‌టుడే: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో వచ్చే నెల 24న వచన కవిత్వ అధ్యయన శిబిరం నిర్వహించనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. కవులు ఇప్పటివరకు వెలువరించిన కవితల వివరాలతో పాటు ఒక కవితను చరవాణి 96037 27234కి వాట్సాప్ చేయాలని సూచించారు.

కుమ్మరి బస్తీల్లో దీపావళి కాంతులు

కులవృత్తులపై మక్కువ చూపుతున్న యువత



దీపావళి బొమ్మల నమూనాలతో విక్రయదారుడు



విక్రయానికి ముందు ఆరబెట్టిన ప్రమిదలు

అల్వాల్, న్యూస్‌టుడే: అల్వాల్‌లోని కుమ్మరి బస్తీలు దీపావళి సందడితో కళకళలాడుతున్నాయి. పూజలకు వాడే ప్రమిదలు, దొంతులు, బొమ్మల తయారీలో ఇక్కడి కులవృత్తుదారులు నిమగ్నమయ్యారు. నెల రోజుల నుంచే ఆయా బస్తీల్లో సందడి ఉంటుంది. వివిధ సమస్యలతో కులవృత్తుదారులు తగ్గిపోయినా ఇటీవల కాలంలో తిరిగి యువకులు మక్కువ చూపుతున్నారు. ముఖ్యంగా దీపావళికి కొత్త కొత్త బొమ్మల తయారీలో తమ నైపుణ్యాన్ని ఉపయోగిస్తున్నారు. ఇందుకు అందుబాటులోకి వచ్చిన యంత్రాలు వీరికి ఎంతో దోహదపడుతున్నాయి.

తక్కువ ధరల్లో విక్రయాలు: అల్వాల్ ఒకప్పటి గ్రామాల సమూహం. కానాజిగూడ, లోతుకుంట, ఓల్డ్‌అల్వాల్, కౌకూర్, తుర్కపల్లి, మచ్చబొల్లారంలో కుమ్మరబస్తీలు ఉన్నాయి. ఇందులో ఓల్డ్‌అల్వాల్, లోతుకుంట బస్తీల్లో కులవృత్తుదారులు అధికంగా ఉన్నారు. ఇక్కడికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చి దీపావళి పూజ బొమ్మలు, ప్రమిదల్ని కొంటారు. నాణ్యమైన మట్టిపాత్రలు, బొమ్మలకు జీవం పోస్తూ ఆకట్టుకుంటున్నారు. ఉన్నత చదువులు చదివిన యువత కూడా తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ సరికొత్తగా చేస్తున్నారు. మార్కెట్ కంటే తక్కువ ధరల్లో విక్రయిస్తున్నారు.

బస్తీల వారీగా వృత్తిదారులు

ఓల్డ్‌అల్వాల్ పరిధిలో	170
వెంకటాపురం, కానాజిగూడ, లోతుకుంట	30
కౌకూర్	10
మచ్చబొల్లారం	25
తుర్కపల్లి	8



యంత్రం సాయంతో..

ఆధునిక యంత్రాలతో..

ఒకప్పుడు ఇళ్ల ముందు గిర్రున తిరిగే సారెతో బొమ్మలు తయారు చేసేవారు. ప్రస్తుతం మట్టిని తొక్కడం, సారెను ఉపయోగించడం వంటి పనులను యంత్రాలు చేస్తున్నాయి. వీటితోనే అనేక ఆకృతుల్లో బొమ్మలు, మట్టిపాత్రలు సిద్ధం చేస్తున్నారు. ధరలు అధికంగా ఉండటంతో యంత్రాలు కొనుగోలు కొన్ని కుటుంబాలకు భారమయ్యాయి. ఇలాంటి కుటుంబాలకు విశ్వకర్మయోజన ద్వారా లబ్ధి చేకూర్చేందుకు జిల్లా కుమ్మర సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. బంకమట్టి కొరత తీవ్రంగా ఉందని.. దూర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తుందని నరసింహ అనే వృత్తిదారుడు వాపోయాడు. స్థానిక చెరువులను పరిరక్షించి బంకమట్టి సేకరణకు అనుమతి ఇవ్వాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ముషీరాబాద్

• ముషీరాబాద్ • అంబర్‌పేట

సంక్షిప్త సమాచారం

25 నుంచి క్యారమ్స్ టోర్నీ

అంబర్‌పేట: తెలంగాణ రాష్ట్ర సీనియర్ ఓపెన్ ర్యాకింగ్ క్యారమ్స్ టోర్నీ-2024-25ను ఈ నెల 25 నుంచి 28 వరకు రంగారెడ్డి జిల్లాలోని సీబీఆర్ పార్క్స్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ క్యారమ్స్ అసోసియేషన్ తెలిపింది. గురువారం అంబర్‌పేటలో అసోసియేషన్ సలహాదారు సీబీఆర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మదన్‌రాజ్, ఉపాధ్యక్షుడు ఉప్పు సుధాకర్ మాట్లాడారు. అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాలకు చొరవచూపండి

గోల్నాక: సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని జైస్వాల్‌గార్డెన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ కోరారు. కాలనీ ముఖద్వారం నిర్మాణానికి కృషిచేసిన కాలనీ ఛైర్మన్ రామాగౌడ్, మైసమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్, న్యాయవాది ప్రసన్నాంజనేయులు సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధికి పాటుపడుతున్న వారికి స్థానికుల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

తిలక్‌నగర్, న్యూస్‌టుడే: **(గురువారం నాటివి... కిలోకు రూపాయల్లో)** టమాట 30, ఆలుగడ్డ 40, వంకాయ 40, బెండ 50, దొండ 45, దోసకాయ 40, కాకర 70, బీర 60, సొర 25, క్యాబేజి 30, క్యాప్సికం 60, బీన్స్ 80, చిక్కుడు 60, క్యారెట్ 45, బీట్‌రూట్ 45, ఉల్లిగడ్డ 40, పచ్చిమిర్చి 40, వెల్లుల్లి 340, అల్లం 80.

ఓటర్ల జాబితాపై సమీక్ష



హాజరైన మారుతీదివాకర్, అఖిలపక్ష నేతలు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఓటర్ల జాబితాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గురువారం జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ ఉప కమిషనర్ మారుతీదివాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి మహమ్మద్ అబ్దుల్ ఫరీద్, ఎండీ హుస్సేన్(కాంగ్రెస్), మహేందర్(సీపీఎం), అఖిల్‌బాబా ఖాద్రీ, మహమ్మద్(ఎంఐఎం) తదితరులు హాజరయ్యారు. ఏఎంసీ పి.రవీందర్, ఐలయ్య, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు



దశరథ్

అంబర్‌పేట: తెదేపా సభ్యత్వ నమోదు ప్రక్రియ ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతుందని ఆ పార్టీ మాజీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి జె.దశరథ్ తెలిపారు. అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదును పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలన్నారు. గురువారం అంబర్‌పేటలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వం పొందిన ప్రతిఒక్కరికీ ప్రమాద బీమా ఉంటుందని తెలిపారు.

'స్ఫూర్తి సభ'ను విజయవంతం చేయాలి: పీడీఎస్‌యూ



కందుకూరి గణేష్

నల్లకుంట, న్యూస్‌టుడే: ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా ఆవిర్భవించిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) 50 ఏళ్ల పోరాట స్ఫూర్తితో.. ఈ నెల 25న వరంగల్‌లోని కాకతీయ వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జరగనున్న 'స్ఫూర్తి సభ'ను విజయవంతం చేయాలని సంఘం హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి గణేష్ పిలుపునిచ్చారు. గురువారం విద్యానగర్‌లో ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ విద్యాసాధనకు, సమసమాజ స్థాపనే ధ్యేయంగా పీడీఎస్‌యూ ఉద్యమిస్తోందని తెలిపారు.

'ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వ్యతిరేకించడం తగదు'

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: పార్లమెంటులో ఆమోదించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై కొంత మంది ఆక్రోశం వెళ్లగక్కడం మంచి పద్ధతి కాదని, రిజర్వేషన్లను వ్యతిరేకించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఓసీ సంక్షేమ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన బషీర్‌బాగ్‌లో విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఓసీలు విద్యా, ఉద్యోగ రంగాల్లో అనేక అవకాశాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

'ఫాగింగ్'ను సక్రమంగా చేపట్టండి

గోల్నాక: దోమల నివారణకు జీహెచ్ఎంసీ మలేరియా విభాగం చేపట్టిన ఫాగింగ్ ప్రక్రియ అంబర్‌పేట, ముషీరాబాద్ సర్కిళ్లలో సక్రమంగా జరుగడం లేదని శివసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌటె గణేష్ ఆరోపించారు. ఫాగింగ్ యంత్రాల్లో వినియోగించే డీజిల్, పెట్రోల్‌ను కొందరు సిబ్బంది నల్లబజార్‌లో విక్రయిస్తున్నారని.. దీనిపై విచారణ జరిపించాలని బల్దియా కమిషనర్ ఇలంబర్తిని కోరారు. గురువారం గోల్నాకలో ఆయన మాట్లాడారు. ఆయా డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో ఫాగింగ్ సక్రమంగా చేపట్టకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

వృద్ధ కళాకారులకు పింఛన్ ఇవ్వాలని విజ్ఞప్తి



మాట్లాడుతున్న పీఎస్ మూర్తి, చిత్రంలో అనూహ్యారెడ్డి, శ్రీరామ్‌దత్తి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: అర్హత వయసు దాటిన వృద్ధ కళాకారులందరికీ పింఛన్ ఇవ్వాలని చినుక కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రచయిత పీఎస్ మూర్తి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం సుందరయ్య కళానిలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న కళాసంస్థలకు గుర్తింపు కల్పించడంతోపాటు ప్రముఖ వేదికల్లో కళాకారుల నృత్య ప్రదర్శనల ఉచిత ఏర్పాటుకూ అనుమతి ఇప్పించాలన్నారు. కళలను పరిరక్షణకు కృషి చేస్తున్న గురువులకు నెలకు రూ.15 వేల చొప్పున పారితోషికాన్ని అందించాలని సూచించారు. టీవీ నిర్మాత డా.జి.అనూహ్యారెడ్డి మాట్లాడుతూ. కళారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలన్నారు. త్వరలోనే కళాకారుల శోభాయాత్రను నగరంలో నిర్వహిస్తామని తెలిపారు. వెలుగు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌దత్తి తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుల్లేక.. రాకపోకలు సాగించలేక



భగత్‌సింగ్ నగర్ బస్తీ-లంబాడీబస్తీ మధ్య మట్టి దారి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు రోడ్లపై వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. స్థానికంగా ప్రధాన రహదారులతోపాటు బస్తీలు, కాలనీల్లోని అంతర్గతదారులన్నీ ఇటీవల కురిసిన వర్షాలకు పోటెత్తిన వరదతో అధ్వానంగా మారాయి. వాటికి తక్షణం మరమ్మతులు చేపట్టాల్సిన జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో సంబంధిత మార్గాలపై ప్రయాణించే టప్పుడు ప్రమాదాల బారినపడుతున్నామని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. వానలకు దెబ్బతిన్న రహదారులను బాగు చేయించడంతోపాటు అవసరమైన ప్రాంతాల్లో సత్వరమే కొత్త రోడ్లు నిర్మించాలని వారంతా కోరుతున్నారు.

వివిధ ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి: • బాగ్‌లింగంపల్లిలోని భగత్‌సింగ్‌నగర్ మురికివాడ బస్తీ మీదుగా లంబాడీతండాలోని రెండు పడకగదుల ఇళ్ల సముదాయానికి వెళ్లేందుకు పిల్లలు, వృద్ధులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతవాసులకు ఏళ్లుగా మట్టిదారే దిక్కు. స్థానికంగా సీసీ రోడ్డు నిర్మాణానికి నిధుల విడుదల కోసం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు గతంలోనే అంచనాలు రూపొందించినా.. అర్ధంతరంగా వదిలేశారు. అనంతరం రోడ్డు నిర్మాణంలో పురోగతి లేకపోవడంతో.. ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందన కరవైందని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు.

• పద్మకాలనీ నుంచి నల్లకుంట మూన్‌కేఫ్ చౌరస్తా నుంచి ఫీవర్ ఆసుపత్రి వెనకభాగంలోని లెప్రసీ ఆసుపత్రి వరకు.. రూ.50 కోట్లతో నాలా విస్తరణ అభివృద్ధి



ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్ చౌరస్తా వద్ద రోడ్డు దుస్థితి



నల్లకుంట మూన్‌కేఫ్ చౌరస్తా సమీపంలో..

పనులను మూడేళ్ల క్రితం చేపట్టారు. ఈ నేపథ్యంలో స్థానికంగా బాగున్న రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేశారు. నాలా పనుల్లో భాగంగా భూగర్భంలో విద్యుత్తు తీగలనూ అమర్చారు. సంబంధిత పనులను ఇప్పటికే పూర్తిచేసినా తవ్విన రోడ్లను బాగు చేయకపోవడంతో ప్రతిరోజూ అవస్థలు పడుతున్నామని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• బాగ్‌లింగంపల్లి ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్ చౌరస్తా సమీపంలోని రోడ్లపై ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలు పడ్డాయి. ఆయా మార్గాలు నేటికీ మరమ్మతులకు నోచుకోకపోవడంతో రాకపోకల వేళ వాహనదారులు నరకయాతన పడుతున్నారు.

నల్లకుంట, ముషీరాబాద్, న్యూస్‌టుడే:

? న్యూనల్లకుంట సెయింట్ ఆగస్టిన్ లేన్‌లో రోడ్ల వెంట ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు ఇళ్లలోకి చొచ్చుకొస్తున్నాయి. ఎప్పటికప్పుడు వాటిని నరికించేలా చర్యలు చేపట్టండి. -శ్రీనివాస్, న్యూనల్లకుంట

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించాక చెట్లకొమ్మలను తొలగించే ఏర్పాటు చేయిస్తాను. - ఫయాజ్, ఉద్యానశాఖ పర్యవేక్షకుడు

? ముషీరాబాద్ డివిజన్ వైఎస్సార్ పార్కు వీధిలో రోడ్డుపై అక్రమ వాహనాల పార్కింగ్‌తో నిత్యం ట్రాఫిక్ జాం నెలకొంటోంది. రాకపోకల వేళ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. -జయకుమార్, స్థానికుడు

✓ పరిశీలించి నివారణ చర్యలు తీసుకుంటాం. -వీరేశం, చిక్కడపల్లి, ట్రాఫిక్ సీఐ

? ముషీరాబాద్ బాపూజీనగర్‌లో దోమల వ్యాప్తి అధికమైంది. నివారణ చర్యలు చేపట్టండి. -శంకర్, బాపూజీనగర్

✓ సిబ్బందిని పంపించి దోమలమందు పిచికారీ చేయిస్తాం. -యాదగిరి, జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం సూపర్‌వైజర్

విజయవంతంగా సభ్యత్వ నమోదు: భాజపా



సమావేశంలో అమృత, యశ్వంత్, చంద్రశేఖర్, నర్సింగ్‌రావు, సుమన్

నల్లకుంట, న్యూస్‌టుడే: భాజపా చేపట్టిన సభ్యత్వ నమోదుకు అన్నివర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని నల్లకుంట కార్పొరేటర్ అమృత తెలిపారు. దీనిలోభాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి చేపడుతున్న సంబంధిత కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని చెప్పారు. సభ్యత్వ నమోదుపై గురువారం డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అర్హులందరికీ అవగాహన కల్పించాలని బూత్ స్థాయి నాయకులకు సూచించారు. నేతలు వీరెల్లి చంద్రశేఖర్, నర్సింగ్‌రావు, యశ్వంత్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధిలో..



విద్యానగర్: సభ్యత్వ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోందని భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ చెప్పారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ అయ్యప్ప దేవాలయం వద్ద మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి గరిగబోయిన మల్లేశ్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. నేతలు శ్యామ్‌రాజు, అచ్చిని రమేశ్, జగన్, ఆర్.రాంరెడ్డి, సురేశ్, రోహిత్‌గౌడ్ పాల్గొన్నారు.

వరదనీటి పైప్‌లైన్ల ఆధునికీకరణకు కృషి: ఎమ్మెల్యే



పనులు ప్రారంభిస్తున్న ముఠా గోపాల్, గౌసుద్దీన్

ముషీరాబాద్, న్యూస్‌టుడే: భోలక్‌పూర్ డివిజన్‌లో వరదనీరు ప్రవహించే పైప్‌లైన్ల వ్యవస్థ ఆధునికీకరణకు కృషి చేస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్, పద్మశాలికాలనీల మధ్య రూ.62 లక్షలతో నిర్మించనున్న బాక్స్‌డ్రైన్ పనులను కార్పొరేటర్ గౌసుద్దీన్, జీహెచ్ఎంసీ డీఈ సన్ని, ఏఈ సుభాష్‌లతో కలిసి గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సుమారు 40 ఏళ్ల క్రితం నాటి వరదనీటి పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరడంతో స్థానికంగా పలుప్రాంతాల్లో మురుగు, వరదనీటి సమస్యలు నెలకొంటున్నాయన్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా రోడ్లపై వరదనీటి ప్రవాహం నియంత్రణకు శాశ్వత పరిష్కారం చేపడుతున్నామని, రెణ్నెల్లలోపు సంబంధిత పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. భారాస నేతలు వై.శ్రీనివాస్‌రావు, ఎండీ.షరీఫుద్దీన్, శంకర్‌గౌడ్, రహీం, మక్బుల్, గుల్షన్‌నగర్ చాంద్‌పాషా, ఎంఐఎం నేతలు షరీఫ్‌హుస్సేన్, ఖాజీ అజీజుల్లా ఉస్మాని తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యలు సత్వరం పరిష్కరించండి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రజల విద్యుత్తు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. గురువారం తులసీనగర్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో.. సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లకుంట గాంధీనగర్ లంకవాసులకు విద్యుత్ మీటర్ల పంపిణీ సహా కరెంటు కనెక్షన్ పనులనూ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆజామాబాద్ డీఈ కమల్‌కుమార్, ఏడీఈలు శీనయ్య, శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఏఈలు శ్రీనివాస్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ముఠా జైసింహ



రాంనగర్: మాజీ ముఖ్యమంత్రి, భారాస అధినేత కేసీఆర్‌ను ముషీరాబాద్ నియోజకవర్గ భారాస యువ నేత ముఠా జైసింహ గురువారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన పుట్టిన రోజు సందర్భంగా కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నట్లు తెలిపారు.

గాంధీనగర్: ముఠా జైసింహ జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ శ్రేణులు, అభిమానులు ఆయన్ను ఆంధ్రాకేఫ్ సమీపంలో పల్లకీలో మోస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. తొలుత వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి జైసింహ ప్రత్యేక పూజలు చేశారు. భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్‌లోని భారాస కార్యాలయంలో ప్రో కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని జైసింహ ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టీఐని సందర్శించిన జమ్మూకశ్మీర్ బృందం



విద్యానగర్, న్యూస్ టుడే: జమ్మూకశ్మీర్‌కు చెందిన పాత్రికేయుల బృందం విద్యానగర్ శివం రోడ్డులోని నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్ఎస్‌టీఐ)ను గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా వారికి వృత్తిపరమైన కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధి సహా తదితర అంశాల్లో ఇస్తున్న శిక్షణ వివరాలను ఎన్ఎస్‌టీఐ డిప్యూటీ డైరెక్టర్ ప్రియాశ్రీనివాసన్ వివరించారు. సేద్యంలో వినియోగించే డ్రోన్‌లకు సంబంధించిన టెక్నీషియన్‌లకు అందిస్తున్న శిక్షణపైనా అవగాహన కల్పించారు. అనంతరం ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, కాస్మెటాలజీ, ఆర్కిటెక్చరల్ డ్రాఫ్ట్స్‌మన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రయోగశాలలను బృందం సభ్యులు సందర్శించారు. అధ్యాపకులను, విద్యార్థులను కలిసి వివిధ అంశాలపై చర్చించారు. జమ్మూకశ్మీర్ పాత్రికేయుల బృందానికి పీఐబీ శ్రీనగర్ డిప్యూటీ డైరెక్టర్ తారిక్ రాథర్ నేతృత్వం వహించగా.. నగరానికి చెందిన పీఐబీ మీడియా కమ్యూనికేషన్ అధికారి గాయత్రి సారథ్యం వహించారు.

జాతిని జాగృతం చేసిన బోయి భీమన్న రచనలు



వోలేటి పార్వతీశానికి జ్ఞాపిక అందజేస్తున్న గౌరీశంకర్, నిత్యానందరావు, సత్యనారాయణ

గాంధీనగర్: మహాకవి బోయి భీమన్న.. తన సాహిత్య ప్రతిభతో పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారని తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. జాతిని జాగృతం చేసిన ఆయన రచనలు సమాజానికి దర్పణాలని పేర్కొన్నారు. భీమన్న సాహితీ నిధి, కళానిలయం సాంస్కృతిక సంస్థల సంయుక్తాధ్వర్యంలో.. బోయి భీమన్న జయంతి కార్యక్రమాన్ని గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రముఖ సాహితీవేత్త వోలేటి పార్వతీశానికి భీమన్న పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖులు టి.గౌరీశంకర్, హైమవతి భీమన్న, శోభాపేరిందేవి, సుంకర సత్యనారాయణ, సురేందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు

నేటి 'మహాధర్నా' జయప్రదం చేయాలి



కరపత్రాలను ప్రదర్శిస్తున్న బస్తీవాసులు

గాంధీనగర్: మూసీ నది సుందరీకరణ పేరిట పేదల ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేయడం హేయమైన చర్య అని భాజపా సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ అన్నారు. బాధితులకు అండగా నిలిచేందుకు ఈ నెల 25న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిపార్కు వద్ద చేపట్టనున్న మహాధర్నాలో నేతలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం అరుంధతినగర్, సబర్మతినగర్‌లలో కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. నేతలు రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఉమేష్, ఆనంద్‌రావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ బాధితులకు అండగా నిలుస్తాం..

అంబర్‌పేట: మూసీ బాధితులకు అండగా ధర్నాచౌక్ వద్ద భాజపా నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నాగభూషణంచారి కోరారు. గురువారం బాపూనగర్‌లో ఆయన మాట్లాడుతూ... మూసీ పరివాహక ప్రాంతంలో ఏళ్లుగా నివసిస్తున్న పేదల ఇళ్ల కూల్చివేత తగదని పేర్కొన్నారు.

వీధి దీపాల నిర్వహణపై సమీక్ష

కాచిగూడ: కాలనీలు, బస్తీల్లోని వీధి దీపాలన్నీ సక్రమంగా వెలిగేలా చర్యలు చేపట్టాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి కోరారు. గురువారం నింబోలిఅడ్డాలోని కార్యాలయంలో.. వీధి దీపాల నిర్వహణపై జీహెచ్ఎంసీ డీఈ అశోక్, ఏఈ సౌమ్యలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రాత్రివేళ్ల స్ట్రీట్ లైట్లు వెలగక అనేక ప్రాంతాల్లో అంధకారం నెలకొంటోందని తెలిపారు. అవసరమైన ప్రాంతాలలో కొత్తవాటి ఏర్పాటు సహా ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

'పింఛన్ పెంపునకు చర్యలు చేపట్టాలి'



సంఘం నేతలు కేవీ ఆచార్య, రోహిణిరావు, అనంతరామకృష్ణారావు

కాచిగూడ, న్యూస్‌టుడే: విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల పింఛన్ పెంపునకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అఖిల భారత విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు కేవీ ఆచార్య డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా కూడా చేపట్టామన్నారు. గురువారం ఆయన స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రోహిణిరావు, ముఖ్య సలహాదారు డా.అనంతకృష్ణారావులతో కలిసి మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా తమ పింఛన్లు పెరగలేదని వాపోయారు. ఇప్పటికైనా ఆరోగ్య బీమా సదుపాయాన్ని వర్తింపజేయాలని కోరారు.

గ్రామస్థాయిలో బీసీ సంఘాల బలోపేతంపై దృష్టి

నల్లకుంట, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో గ్రామస్థాయి నుంచి కమిటీలను నియమించి బీసీ సంఘాలను బలోపేతం చేసి ఉద్యమాలను ఉద్ధృతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ర్యాగ అరుణ్ పిలుపునిచ్చారు. బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, ఫీజు రీయింబర్సుమెంటు నిధులు విడుదలచేయాలని, జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు ఏళ్లుగా సాగిస్తున్న ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేయాలన్నారు. బీసీ జాగృతి సేన తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ మాట్లాడుతూ.. పూర్తిస్థాయిలో కమిటీలను నియమించాక జిల్లా కేంద్రాల్లో చైతన్య సదస్సులు, హైదరాబాద్‌లో బహిరంగ సభ ఏర్పాటుపై దృష్టి సారించామని తెలిపారు. నాయకులు వేణు, కిశోర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో బూర్గుపల్లి కృష్ణయాదవ్, ర్యాగ అరుణ్, వేణు తదితరులు

'కేంద్రం విధానాలతో సమాఖ్య స్ఫూర్తికి విఘాతం'



మాట్లాడుతున్న కిషన్ కన్నయ్యపాల్

బాగ్‌లింగంపల్లి: దేశంలో పేదరిక నిర్మూలనకు రాజ్యాంగాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అడ్వకేట్ ఫోరం జాతీయ అధ్యక్షుడు కిషన్ కన్నయ్యపాల్ పాలకులను కోరారు. గురువారం సుందరయ్య కళానిలయంలో ఆ పార్టీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 'రాజ్యాంగం-పౌరుల సాధికారత' అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని పక్కాగా అమలు చేయడంలో కేంద్రంలోని భాజపా సర్కారు విఫలమైందని ఆరోపించారు. సమాఖ్య స్ఫూర్తిని సైతం దెబ్బతీస్తోందన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతిపై దృష్టిసారించకుండా.. బడాబాబులకు దోచిపెట్టేలా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. జాతి సంపద పేదలకు దక్కాలని ఆకాంక్షించారు. ప్రొ.సింహాద్రి మాట్లాడుతూ.. రాజ్యాంగంలో ప్రస్తావించిన సమానత్వం, సౌభ్రాతృత్వం, పౌర స్వేచ్ఛను పరిరక్షించాలని కోరారు. విద్యాకమిషన్ సభ్యుడు ప్రొ.పీఎల్ విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ.. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రంలోని భాజపా సర్కారు నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. పోరాడి హక్కులను సాధించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సదస్సులో సమాజ్‌వాదీ పార్టీ నేతలు వెంకటరాజయ్య, డా.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇరుకు మార్గం.. స్వచ్ఛవాహనాలతో ఆటంకం



అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని బతుకమ్మకుంట ప్రాంతంలో రహదారి చెంతనే.. చెత్తాచెదారాన్ని తరలించే స్వచ్ఛ వాహనాలను ప్రతిరోజూ నిలుపుతున్నారు. దీంతో ఈ మార్గం ఇరుకుగా మారి రాకపోకల సమయంలో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ వేళల్లో ట్రాఫిక్ కూడా స్తంభిస్తోందని.. సంబంధిత వాహనాలను నిలిపేందుకు మరోచోట ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించాలని బల్దియా అధికారులకు వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

కాచిగూడ, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, అడ్మిన్ ఎస్సై సుభాష్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(50) మృతదేహాన్ని గురువారం కాచిగూడలోని డీ మార్ట్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఇండోర్ స్టేడియం.. అరకొర వినియోగం

• పూర్తిస్థాయిలో అందుబాటులోకిరాని కోర్టులు.. వెలగని లైట్లు • చిన్నపాటి వర్షానికీ కురుస్తుండటంతో క్రీడాకారులకు అవస్థలు





మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు • వాన నీటిని పట్టేందుకు ఏర్పాటు చేసిన డబ్బా

రాంనగర్, న్యూస్‌టుడే: ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని అడిక్‌మెట్ ప్రాంతంలో నిర్మించిన మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్(ఇండోర్ స్టేడియం) సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా స్టేడియం కురుస్తుండడంతో.. క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిలోపల సుమారు 120 ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేశారు. వాటిల్లో 30 లైట్లు మాత్రమే ప్రస్తుతం పనిచేస్తుండడంతో.. ఎక్కువభాగం అంధకారం ఆవరించి ఉంటోంది. నాలుగు షటిల్ కోర్టులతోపాటు టేబుల్ టెన్నిస్, యోగా, జిమ్, కరాటే తదితర వాటిల్లో సాధన కోసం ఇండోర్ స్టేడియాన్ని అందుబాటులోకి తెచ్చారు. భారాస సర్కారు హయాంలో సుమారు రూ.4 కోట్లతో నిర్మించిన ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అప్పటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ప్రస్తుతం నాలుగు షటిల్ కోర్టులు మాత్రమే వినియోగంలో ఉండగా.. మిగతా కోర్టులు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. వాటిని కూడా వినియోగంలోకి తెచ్చేలా ఆర్థిక సాయం అందించేందుకు కొందరు దాతలు ముందుకు వచ్చినా జీహెచ్ఎంసీ క్రీడా విభాగం అధికారులు మాత్రం శ్రద్ధ చూపించకపోవడం గమనార్హం. ఈ ఇండోర్ స్టేడియంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కలిపి సుమారు 120 నుంచి 150 మంది వరకు షటిల్ ఆడుతుంటారు. దీంతో వారంతా అసోసియేషన్‌గా ఏర్పడి.. సొంత నిధులు వెచ్చించి మరమ్మతులు సహా ఇతరత్రా సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. ఈ విషయం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి... క్రీడాకారులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు పలుమార్లు లేఖ రాసినా స్పందన కరవైందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం కూడా క్రీడాకారులంతా భారాస యువ నాయకుడు ముఠా జైసింహతో కలిసి వెళ్లి 'ప్రజావాణి'లో కార్యక్రమంభాగంగా రవికిరణ్‌ను కలిశారు. మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని సమస్యలను పరిష్కరించేలా సత్వరం చొరవచూపాలని కోరుతూ వినతిపత్రం కూడా అందజేశారు.

వచన కవిత అధ్యయన శిబిరం వచ్చే నెల 24న

నారాయణగూడ, న్యూస్‌టుడే: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో వచ్చే నెల 24న వచన కవిత్వ అధ్యయన శిబిరం నిర్వహించనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. కవులు ఇప్పటివరకు వెలువరించిన కవితల వివరాలతో పాటు ఒక కవితను చరవాణి 96037 27234కి వాట్సాప్ చేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలి: భాజపా

ఘట్‌కేసర్: రైతులకు మద్దతు ధర ఇచ్చి వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని రాష్ట్ర భాజపా కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఘట్‌కేసర్ మండలం మాదారం, ఎదులాబాద్‌లోని కొనుగోలు కేంద్రాలను పార్టీ నాయకుడు ఎం. మచ్చేందర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. అనంతరం రైతులతో కలిసి మాట్లాడారు. 15 రోజుల క్రితం కొనుగోలు ప్రారంభిస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఆ ఊసే లేదన్నారు. కేంద్రాల వద్ద కనీస వసతులు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఎప్పుడు వర్షం వస్తుందోనని భయంతో రోజులు గడుపుతున్నారని ఆయన పేర్కొన్నారు.


మాదారంలో రైతులతో కలిసి మాట్లాడుతున్న ఏనుగు సుదర్శన్‌రెడ్డి

ఉప్పల్

•ఉప్పల్ •మేడ్చల్

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కీసర, న్యూస్‌టుడే: కీసర అంబేడ్కర్‌నగర్‌లో నిర్మించిన ఆలయంలో గురువారం పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. విగ్రహాల ఊరేగింపు అనంతరం వేద మంత్రోచ్ఛారణల మధ్య హోమం, కల్యాణం చేశారు. విగ్రహ దాతలు బండారు శంకర్‌గౌడ్‌తో పాటు ఆలయ నిర్మాణానికి సహకరించిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బి.రమేష్‌గుప్తా, మాజీ సర్పంచి మాధురి, శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ఛైర్మన్ ఎన్.వెంకటేశ్‌ముదిరాజు, మాజీ ఎంపీటీసీ ఎం.జంగయ్యయాదవ్‌లను సత్కరించారు.


హోమంలో పాల్గొన్న దాతలు, ఆలయ కమిటీ సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట వరకు

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం)

మేడ్చల్, కీసర, కాప్రా, న్యూస్‌టుడే:

? మేడ్చల్ డిపో నుంచి కిస్టాపూర్ వెళ్లేదారి కల్యాణ మండపాల సమీపంలో రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. – మహేశ్, మేడ్చల్

● మరమ్మతులు చేపడతాం. – నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్

? కీసరలోని మల్లికార్జుననగర్‌లో అరుంధతి పాఠశాల వెనక మ్యాన్‌హోల్ పైకప్పు ప్రమాదకరంగా ఉంది. రాత్రి వేళ ద్విచక్ర వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదు. – శ్రీనివాస్, మల్లికార్జుననగర్‌కాలనీ, కీసర

● సిబ్బందిని పంపి మరమ్మతులు చేయిస్తాం. – బాలనర్సింహ, బిల్ కలెక్టర్ కీసర

? హెచ్‌బీకాలనీ డివిజన్‌లో ఉన్న పోస్టాఫీసు తొలగించారు. దూరంగా మౌలాలీలో ఉన్న పోస్టాఫీసుకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నాం. – పి.ప్రకాష్‌రావు, మంగాపురం

● హెచ్‌బీకాలనీలో పోస్టాఫీసు అవసరమని ప్రజల నుంచి విజ్ఞప్తులు అందాయి. ఆ ప్రాంతాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. – సంతోష్, సీనియర్ సూపరింటెండెంట్, పోస్టల్ శాఖ

? పేదల బస్తీల్లో గతంలో ఏర్పాటు చేసిన వీధి నల్లాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. వాటిని అందుబాటులోని తీసుకురావాలి. – గగన్, బీజేఆర్ కాలనీ

● బస్తీలను సందర్శించి.. అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపడతాం. – సతీష్, డీజీఎం, జలమండలి

ఉన్నవారు సరిపోక..
నియామకాలు లేక..

- అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ
- ఉద్యోగ విరమణలతో తగ్గిపోతున్న సిబ్బంది
- పెరుగుతున్న కాలనీలు, జనాభా
- ఉప్పల్ నియోజకవర్గంలో ఇదీ తీరు



న్యూస్‌టుడే, ఉప్పల్, కాప్రా: ఉప్పల్ నియోజకవర్గంలో రోజురోజుకు కాలనీలు విస్తరిస్తున్నాయి. జనాభా పెరిగిపోతోంది. ఇందుకు అనుగుణంగా పారిశుద్ధ్య సిబ్బంది సంఖ్య పెరగాల్సి ఉండగా.. ఏళ్ల తరబడి కొత్త నియామకాలు లేవు. మరోవైపు ఉద్యోగ విరమణలతో క్రమంగా వారి సంఖ్య తగ్గిపోతోంది. ఉప్పల్, కాప్రా రెండు సర్కిళ్లల్లో ఇదే పరిస్థితి. కాలనీలకు సరిపడా సిబ్బంది లేక ఉన్నవారిపైనే పని భారం పడుతోంది. ఉప్పల్ సర్కిల్‌లోని ఉప్పల్ భగాయత్, రామంతాపూర్ భగాయత్‌లలో అనేక కొత్త కాలనీలు వచ్చాయి. వీటిలో రోజూ రోడ్లను శుభ్రం చేసే పరిస్థితీ లేదు.

30 ఏళ్లుగా శాశ్వత నియామకాలు లేవు..

ఉప్పల్, కాప్రా ప్రాంతాలు మున్సిపాలిటీలుగా ఉన్నప్పుడు అంటే 1994లో మాత్రమే శాశ్వత పారిశుద్ధ్య సిబ్బంది నియామకం జరిగింది. తర్వాత 2007లో గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం తర్వాత పొరుగు సేవల సిబ్బందిని నియమించారు. అనంతరం కాంట్రాక్టు, పొరుగు సిబ్బంది నియామకాలూ చేపట్టడం లేదు. ఈ నేపథ్యంలో కొరతతో ఉత్పత్తి అవుతున్న చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. ఉన్న అవుట్ సోర్సింగ్ కార్మికులతోనే నెట్టుకొస్తున్నారు. తొలుత గ్రామపంచాయితీ, తర్వాత మున్సిపాలిటీల్లో చేసిన సిబ్బందిలో 1994 వరకు ఉన్నవారు మాత్రమే పర్మినెంట్ అయ్యారు. 1995 నుంచి పొదుపు సంఘాలకు చెత్త తొలగింపు బాధ్యతలు అప్పగించారు. 2012లో పర్యవేక్షణకు శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్(ఎస్‌ఎఫ్ఏ)లను నియమించారు. తదుపరి నేటి వరకు పారిశుద్ధ్య విభాగంలో నియామకాల ఊసే లేదు.

ఉన్న వారిపైనే పని భారం..

క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందే కాకుండా అధికారుల పోస్టులూ ఖాళీగానే ఉన్నాయి. ప్రతి సర్కిల్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్లు ఉండాలి. ప్రతి మూడు వార్డులకు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఎస్ఎఫ్ఏలకు ఒక జవాన్ ఉండాలి. కానీ ఇన్‌స్పెక్టర్ పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. వాస్తవానికి 1.7 కిలోమీటర్లకు ఒక కార్మికుడి చొప్పున అవసరం కాగా.. లేకపోవడంతో పని భారం రెట్టింపు పెరిగింది. ఉన్న సిబ్బందిలోనూ కొందరిని అధికారులు ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో పని చేసే వారి సంఖ్య మరింత తగ్గిపోయి పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది.

నియోజకవర్గంలో నిర్వహణ ఇలా..

వివరాలు	కాప్రా సర్కిల్	ఉప్పల్ సర్కిల్
డివిజన్లు	6	4
కాలనీలు	375	250
మురికివాడలు	51	28
గృహాలు	1.20 లక్షలు	62,152
వాణిజ్య భవనాలు	17,000	6,304
జనాభా	7 లక్షలు	6 లక్షలు
విస్తీర్ణం	70 చ. కి.మీ.	20 చ. కి.మీ.
రోజు చెత్త ఉత్పత్తి	250 టన్నులు	185 టన్నులు
రోడ్ల పొడవు	250 కి.మీ.	180 కి.మీ.
అవుట్ సోర్సింగ్ సిబ్బంది	595	476
శాశ్వత సిబ్బంది	65	50
జవాన్‌లు	11	8
ఎస్ఎఫ్ఏలు	28	22
స్వచ్ఛ ఆటోలు	167	108
స్వచ్ఛ ఆటోలు (ప్రైవేటు)	10	10
చెత్త రిక్షాలు	85	65
తరలింపు వాహనాలు	12	12


ప్రతిపాదనలు పంపుతున్నాం

– ఆంజనేయులు, ఉప కమిషనర్, ఉప్పల్

ఉప్పల్, రామంతాపూర్ భగాయత్‌లలో కొత్తగా ఏర్పడిన కాలనీల్లో పారిశుద్ధ్య పనులకు అదనపు సిబ్బంది కోసం త్వరలో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించనున్నాం. ఈ రెండు ప్రాంతాలకు కలిపి సుమారు 40 మంది కావాలి. ఇక మిగిలిన చోట్లా జనాభా సంఖ్యకు అనుగుణంగా నూతన నియామకాల అవసరం ఉంది.


విద్యారంగంలో వ్యాపార ధోరణి బాధాకరం: ఎంపీ

బోడుప్పల్, న్యూస్‌టుడే: విద్యను వ్యాపార దృష్టితో చూడొద్దని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. చెంగిచర్లలో టెక్నిక్ ఎఫ్ఎంసీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఎమ్మెల్యే మల్లారెడ్డి, బోడుప్పల్ మేయర్ అజయ్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్య పూర్తిగా వ్యాపార ధోరణిలోకి వెళుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల విద్యాతృష్ణను తీర్చేందుకు టెక్నిక్ ఎఫ్ఎంసీ ముందుకు రావడం అభినందనీయమని మల్లారెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులకు వసతుల కోసం కృషి చేస్తున్న సంస్థ తీరును ప్రశంసించారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి, టెక్నిక్ ఎఫ్ఎంసీ ప్రతినిధులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో ఈటల రాజేందర్, మల్లారెడ్డి, అజయ్ యాదవ్ తదితరులు

వైద్య విద్యార్థులకు బీఎల్ఆర్ ట్రస్టు ఆర్థిక సహాయం

నాచారం, న్యూస్‌టుడే: ఉప్పల్ నియోజకవర్గంలోని వైద్య విద్యార్థులకు బీఎల్ఆర్ ట్రస్టు అండగా ఉంటుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. మల్లాపూర్ అశోక్‌నగర్‌కు చెందిన కావ్య, న్యూభవానీనగర్‌కు చెందిన అఖిల, విశ్వరేతన్‌రెడ్డి ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించారు. వారి చదువులకు ఫీజు ఖర్చు చెక్కులను గురువారం కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో పలువురు భారాస నాయకులు పాల్గొన్నారు.


మల్లాపూర్‌లో ఓ విద్యార్థినికి చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

వాహనం డీజిల్ పైపు పగిలి మంటలు

కీసర, న్యూస్‌టుడే: చీర్యాల చౌరస్తాలో గురువారం ఓ ట్యాంకరు లారీకి మంటలు అంటుకోగా స్థానికుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. గచ్చిబౌలి నుంచి చర్లపల్లికి ఆయిల్ లోడుతో వచ్చిన ట్యాంకరు లారీ ఖాళీ చేసి తిరిగి వెళుతోంది. చీర్యాల చౌరస్తాకు రాగానే డీజిల్ పైప్ పగిలి ముందు చక్రం వద్ద మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్, క్లీనర్ రోడ్డు పక్కకు నిలిపారు. అటుగా వెళుతున్న వాహనదారులు భయంతో దూరంగా వెళ్లారు. కొందరు ధైర్యం చేసి మంటలను ఆర్పారు. లేదంటే లారీకి మొత్తం మంటలు వ్యాపించి ట్యాంకరు పేలి పోయేదని స్థానికులు తెలిపారు.

పోలియో నిర్మూలనపై అవగాహన ప్రదర్శన

కాప్రా, న్యూస్‌టుడే: కాప్రాలోని సైనిక్‌పురి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పోలియో వ్యాధి నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు అనామికా పానియా, సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలల విద్యార్థులతో అవగాహన ప్రదర్శన ఏర్పాటు చేశారు. కాప్రాలోని రాధికా చౌరస్తా నుంచి సైనిక్‌పురి వరకు 'పోలియోను నిర్మూలిద్దాం', 'బాధితులను ఆదుకుందాం' నినాదంతో ర్యాలీ కొనసాగింది.

SRINIDHI COLLEGE OF EDUCATION
Kondapur Village, Ghatkesar Mandal, Medchal Dist. Ph: 9866257555

SPOT ADMISSION – 2024

The following candidates have been allotted seats by the convener but they did not take admissions in the college, they should take admissions in the college on or before **30-10-2024**. falling which their admission will be treated as cancelled and seats will be filled in the spot admissions by the qualified candidates.

Rank	Name of the student	H.T.No.	Method	Category
14984	Perambudur Aindhavi	2416504026	Biological	REG_BCE_UNR_FEMALE
20453	Banoth Lavanya	2415701294	Biological	REG_ST_OU_GEN
20687	Pawar Supriya	2425303059	Biological	REG_BCB_OU_FEMALE
22508	Thatikonda Rajeshwari	2426101007	Biological	REG_BCA_OU_GEN
23488	Boina amrutha	2415403016	Biological	REG_BCB_OU_GEN
23963	Bommadandi Sreni	2425201309	Biological	REG_BCB_OU_FEMALE
11896	Mukirala roja	2425102152	Mathematics	REG_SC_OU_GEN
21443	Gouriveni Shirisha	2416603129	Mathematics	REG_SC_OU_GEN
21463	Vangala Sukanya	2416605156	Mathematics	REG_SC_OU_FEMALE
17300	Kadthal Chandrakala	2416001024	Social	REG_OPEN_OU_GEN
27575	Gummadi Ravali	2416008110	Social	REG_BCB_OU_FEMALE

Eligibility: pass in degree and qualified in EDCET 2024 Examination. Interested candidates may attend for spot admission on **04-11-2024.** Sd/- Correspondent

అవినీతి నిర్మూలన అందరి బాధ్యత

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: దేశంలో అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్ హెచ్‌పీసీఎల్ అధికారులు పేర్కొన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా గురువారం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో వారు మాట్లాడారు. అవినీతి ఏ రూపంలో ఉన్నా సహించ కూడదన్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. అవినీతి నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ ప్రతినిధి నాగఅయ్యప్ప, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ వైభవం.. భక్తజన పారవశ్యం

నాచారం: నాచారం హెచ్‌ఎంటీనగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం ఉదయం సూర్యప్రభ వాహనోత్సవం నేత్రపర్వంగా సాగింది. తిరుమలేశుని నామస్మరణతో వీధులు మార్మోగాయి. అంతకు ముందు ప్రధానార్చకులు వేంకటేశ్వరాచార్యులు... శ్రీవారికి నిత్యారాధన, ద్వాదశారాధన, శాత్తుమొర తదితర పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయ మాడవీధులు, కాలనీ వీధుల్లో చంద్రప్రభ వాహనంపై ఊరేగింపుగా వచ్చిన స్వామికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. ధర్మాధికారి డా.టి.దుర్గాప్రసాద్, అధ్యక్షుడు రామచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి శేషారెడ్డి, జనార్దన్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

అంగన్‌వాడీల అభివృద్ధికి మెలిండా ఫౌండేషన్ తోడ్పాటు

నాచారం, న్యూస్‌టుడే: నాచారం ఇందిరానగర్-1 అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం బిల్ అండ్ మెలిండా (గేట్స్) ఫౌండేషన్, ఎన్ఐఎన్ ప్రతినిధులు సందర్శించారు. చిన్నారులకు అందజేస్తున్న పోషకాహారం, పూర్వ ప్రాథమిక విద్యకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గురించి ఐసీడీఎస్ అధికారులు ఫౌండేషన్ ప్రతినిధులకు వివరించారు. అంగన్‌వాడీల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించనున్నట్లు ఫౌండేషన్ గ్లోబల్ న్యూట్రిషియన్ డైరెక్టర్ మీటూ కపూర్ తెలిపారు. కార్యక్రమంలో జొనాథన్ గోర్‌స్టెయిన్, రుచిక సచ్‌దేవ, అర్లప్ప, నర్సింహులు, అల్వాల్ ప్రాజెక్టు సీడీపీవో స్వాతి తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులతో ఫౌండేషన్, ఎన్ఐఎన్ ప్రతినిధులు

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

మేడ్చల్, న్యూస్‌టుడే: ప్రజలు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని, వైఆర్‌జీ కేర్ సంస్థ జోనల్ సూపర్‌వైజర్ టి.యశోద సూచించారు. మేడ్చల్ జిల్లా గ్రంథాలయంలో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎయిడ్స్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

నాచారం, న్యూస్‌టుడే: నాచారం వీరారెడ్డి కాలనీలో వరద ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.10 లక్షల వ్యయంతో ప్రత్యేక పైపులైను ఏర్పాటు చేస్తున్నట్లు కార్పొరేటర్ శాంతిసాయిజెన్ తెలిపారు. గురువారం కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పనులను ఆమె ప్రారంభించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, భారాస నేతలు సాయిజెన్‌శేఖర్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మురుగు తిష్ఠ



కొన్నేళ్లుగా మురుగుతో అవస్థలు పడుతున్నాం. డ్రైనేజీ నీరంతా ఇళ్ల చెంతనే పొంగిపొర్లుతోంది. ముక్కు మూసుకొని ఉండాల్సి వస్తోంది. చెంగిచర్ల ప్రతాప్ ఎన్‌క్లేవ్, ఎంఎల్‌ఆర్ కాలనీ పరిసర ప్రాంతాల వారు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. మురుగంతా ఇళ్లమధ్య చేరడంతో తటాకంలా మారింది. వ్యాధులు సోకుతున్నాయి. గాలి, భూగర్భ జలం కలుషితం అవుతున్నాయి. శ్వాస సమస్యలు వస్తున్నాయి. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. –న్యూస్‌టుడే, చెంగిచర్ల(బోడుప్పల్)

మూడుసార్లు జైలుకెళ్లినా బుద్ధి మారలే

పాత నేరస్థుడి రిమాండ్

పోచారం(ఘట్‌కేసర్), న్యూస్‌టుడే: జల్సాలకు అలవాటుపడిన ఓ యువకుడు దొంగతనాలకు పాల్పడి మూడుసార్లు జైలుకు వెళ్లినా బుద్ధిలో మార్పురాలేదు. మళ్లీ చోరీ చేసి పోలీసులకు చిక్కాడు. పోచారం ఐటీకారిడార్ సీఐ బి.రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన బత్తుల రవీందర్(26) జల్సాలకు డబ్బుల కోసం చోరీలు చేసి జైలుకు వెళ్లాడు. బయటకొచ్చిన తర్వాత గత నెలలో పోచారం ఐటీకారిడార్ పోలీసు స్టేషన్ పరిధిలోని చౌదరిగూడలో రెండు ఇళ్లలో దొంగతనాలు చేశాడు. సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించి. గురువారం అన్నోజిగూడ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రవీందర్‌ను ఎస్సై శివకృష్ణ పట్టుకున్నారు. విచారణలో మేడిపల్లి, ఉప్పల్ ఠాణా పరిధిలో ద్విచక్ర వాహనాలతో పాటు ఇళ్ల తాళం పగలుగొట్టి చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. రెండు బైక్‌లు స్వాధీనం చేసుకుని, గురువారం రిమాండ్ పంపినట్లు సీఐ తెలిపారు. కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

స్తంభాన్ని ఢీ కొట్టిన బైక్ ఒకరి మృతి

శామీర్‌పేట: శామీర్‌పేట - ఉద్దెమర్రి రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పిన సంఘటనలో ఒకరు మృతి చెందారు. ఎస్సై హరిక కథనం ప్రకారం.. బొల్లారం-రిసాల్‌బజార్ ప్రాంతం, ప్రేమ్‌నగర్‌కు చెందిన బ్రహ్మయ్య (44), నర్సింహ (46) బైక్‌పై వెళుతూ బాబాగూడ వద్ద రహదారి పక్కనన్ను విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టారు. బ్రహ్మయ్య మృత్యువాత పడగా నర్సింహకు తీవ్ర గాయాలయ్యాయి.

మూసీలో తేలిన మృతదేహం

ఉప్పల్, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మూసీలో తేలిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కేటీఆర్ కాలనీ సమీపంలోని నదిలో బుధవారం రాత్రి ఓ వ్యక్తి(50) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. శరీరంపై దుస్తులు లేవు. ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకొచ్చి ఉండొచ్చని భావిస్తున్నారు.

దాయరకుంట... గుర్రపుడెక్కతో తంటా

న్యూస్‌టుడే, నాగారం

పరిసర కాలనీల్లో దుర్వాసనతో అవస్థలు



నాగారంలో జనావాసాల మధ్య ఉన్న దాయరకుంట గుర్రపు డెక్కతో నిండిపోవడంతో చుట్టుపక్కల కాలనీలవారు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు మట్టి కట్టపై నుంచి ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా వాహనదారులు పట్టణానికి దగ్గరి దారి అనే ఉద్దేశంతో దీని పైనుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఒకప్పుడు ఈ జలవనరు గ్రామానికి తాగునీటిని అందించడంతోపాటుగా సాగు అవసరాలకు ఉపయోగపడేది. తర్వాత కాలంలో కుంట చుట్టూ కాలనీలు ఏర్పడి మురుగు చేరి దుర్వాసన, దోమలు వృద్ధి చెందుతున్నాయి. గతంలో గుర్రపు డెక్కను తొలగించినా.. మళ్లీ పెరిగింది. పూర్తిస్థాయిలో తొలగించి తిరిగి పెరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నీటిపారుదల శాఖ అనుమతి కోరాం..

పురపాలిక నిధులతో కట్టను విస్తరించి రోడ్డు వేసి రక్షణ గోడలు నిర్మిస్తామని నీటిపారుదల శాఖ అధికారులకు పలుమార్లు లేఖలిచ్చామని, వారు అనుమతిస్తే పనులు చేపడతామని మున్సిపల్ డీఈ రఘు పేర్కొన్నారు. ఈ రహదారి ద్వారా పలు కాలనీలకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు.

కట్టను విస్తరించి రోడ్డు వేస్తే మేలు



కుంట కట్ట పొడవు 150 మీటర్ల ఉంటుంది. ఈ కట్టను విస్తరించి రోడ్డు వేయడంతోపాటుగా పక్కన రక్షణ గోడల నిర్మాణానికి రూ.50 లక్షల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. రోడ్డును నిర్మిస్తే పలు కాలనీల వారికి ఉపయుక్తంగా ఉంటుంది. ప్రస్తుతం ఏమాత్రం ఏమరపాటుగా ఈ కట్టపై ప్రయాణించినా ప్రమాదాలను ఆహ్వానించినట్లే.

ఉద్యానం.. కబ్జాయణం


ప్రహరీ కూల్చి నిర్మించిన దుకాణాలు


పాత సామగ్రి కొనుగోలు దుకాణం


గదుల నిర్మాణం


ప్రహరీ దాటి కట్టిన గది

ఇది పేరుకే పార్కు. కానీ ఆహ్లాదం మచ్చుకైనా కానరాదు. పచ్చదనం కరవైంది. దీంతో సందర్శకులు వచ్చే వీలే లేకుండా పోయింది. గచ్చిబౌలి బయోడైవర్సిటీ కూడలిలోని ఎన్‌క్లేవ్ ట్రీ పార్కు పరిస్థితి ఇది. ఈ పార్కు ప్రహరీని కూల్చి లోపల కొందరు గదుల నిర్మాణాలు చేపట్టారు. అటు రహదారిని, ఇటు పార్కులోపల స్థలాన్ని ఆక్రమించి చిరు వ్యాపారాల దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు అందినా స్పందన లేదు. ఆక్రమణలను తొలగించి పార్కును అందుబాటులో తేవాలని స్థానికులు కోరుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టుల గేట్లపై నిత్య పర్యవేక్షణ ముఖ్యం


సదస్సును ప్రారంభిస్తున్న విశ్రాంత ఇంజినీర్ కన్నయ్యనాయుడు తదితరులు

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: సాగునీటి ప్రాజెక్టుల గేట్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని విశ్రాంత ఇంజినీర్, పలు ఇంజినీరింగ్ సంబంధిత సంస్థలకు సాంకేతిక సలహాదారుగా వ్యవహరిస్తున్న నాగినేని కన్నయ్యనాయుడు అన్నారు. వరద ప్రమాదాలను ఎదుర్కోవడానికి ప్రతి డ్యామ్ స్పిల్‌వేకు ఉండే గేట్లు కీలకమన్నారు. గురువారం గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో 'సాగునీటి ప్రాజెక్టు గేట్లు విఫలమైనప్పుడు తీసుకోవాల్సిన తక్షణ చర్యలు' అనే అంశంపై కార్యశాల నిర్వహించారు. గేట్లకు మరమ్మతులు అవసరమున్నాయి. ఇటీవల తుంగభద్ర గేటు కొట్టుకుపోవడం అందరినీ కలచివేసిందన్నారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జి.రామేశ్వర్‌రావు, వాటర్ రిసోర్స్ డెవలప్‌మెంట్ అధికారులు డాక్టర్ ఆదినారాయణ, నరేశ్, కవిత, తమిళనాడులోని కావేరి ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు, తిరువనంతపురం చీఫ్ ఇంజినీరింగ్ అధికారులు, కర్ణాటక, చండీగఢ్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పోకిరీలతో కిరికిరి

- బయటకెళ్లాలంటే మహిళలకు వణుకు
- బైక్‌లతో హల్‌చల్.. సెల్‌ఫోన్లతో వీడియోలు



ఈనాడు, హైదరాబాద్

పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా.. న్యాయస్థానం శిక్షలు విధిస్తున్నా పోకిరీలు మారట్లేదు. రద్దీ ప్రాంతాల్లో విచ్చలవిడి చేష్టలకు అడ్డుకట్ట పడట్లేదు. షీటీమ్స్ నిఘా ఉన్నా ఆకతాయిలు చెలరేగుతూనే ఉన్నారు. పర్యాటక ప్రాంతాలు, మార్కెట్లు, రద్దీ ప్రదేశాలు, మెట్రోస్టేషన్ల వద్ద హల్‌చల్ చేస్తున్నారు. కొందరు మాత్రమే పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. డయల్ 100కు ఫోన్‌చేసినా సకాలంలో రావడం లేదంటున్నారు. తమ వద్దకు రాలేదంటూ.. పోలీసు అధికారులు తేలిగ్గా కొట్టేస్తున్నారు. గుడిమల్కాపూర్‌లోని మార్కెట్‌కు వెళ్లిన మహిళతో ఓ యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇదేమని అడిగేందుకు ప్రయత్నించిన ఆమె సోదరుడిపై దాడికి పాల్పడ్డాడు. చార్మినార్ అందాలను వీక్షించేందుకు దేశ, విదేశాల నుంచి ఎంతోమంది సందర్శకులు వస్తుంటారు. రద్దీలో కలిసిపోయిన కొందరు యువకులు.. యువతులు, మహిళలను తాకేందుకు ప్రయత్నిస్తుంటారు. అశ్లీల పదజాలంతో కామెంట్ చేస్తున్నారు. గోల్కొండ కోటకు నడుచుకుంటూ వెళ్తే అమ్మాయిల వైపు బైక్‌లతో వేగంగా దూసుకొచ్చి కుర్రాళ్లు తలపై కొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. భయంతో ఆడపిల్లలు కేకలు వేస్తే సెల్‌ఫోన్లో చిత్రీకరిస్తున్నారు.

అబ్బే.. అలాంటివి లేవే

తమకు ఎంత ఇబ్బంది అనిపించినా విషయం బయటకు చెప్పలేక బాధితులు మౌనం వహిస్తున్నారు. ఫిర్యాదు లేకుండా తామేం చేయలేమంటూ పోలీసులూ చేతులెత్తేస్తున్నారు. బాధితులు ఫిర్యాదు చేయకపోవడంతో విషయం కలిసొస్తున్నారు.

మార్ఫింగ్ వీడియోలు

పర్యాటక ప్రదేశాలు, రైతుబజార్లు, షాపింగ్‌మాల్స్, మెట్రో స్టేషన్లు, బస్టాపుల వద్ద ఆకతాయిలు వేధింపులకు పాల్పడుతున్నారు. సెల్‌ఫోన్లతో యువతులు, మహిళల ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు. వాటిని మార్ఫింగ్ చేసి మిత్రులకు షేర్ చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు, సంఘీ ఆలయం, కీసరగుట్ట, దుర్గం చెరువు, హిమాయత్‌సాగర్ ప్రాంతాలకు వెళ్లిన జంటలను లక్ష్యంగా చేసుకున్న ముఠాలు దారుణంగా ప్రవర్తిస్తున్నాయి. జంటల నగదు, నగలు కొట్టేస్తున్నారు.

ఎంతకూ పూర్తికాని నిజాం కాలం నాటి
ముంతకబ్‌ల తర్జుమా

దేవాలయాల భూముల వివాదాల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. నకిలీ పత్రాలు సృష్టిస్తున్న కబ్జాదారులు రూ. కోట్ల భూములను చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ భూములు రాజధాని పరిధిలోనే అత్యధికంగా ఉన్నాయి. సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్‌కు సంబంధించి గోత్రనామాలు, ఫౌండర్ ట్రస్టీలు, తక్కువ విస్తీర్ణంలోని భూవివాదాలు ఉండగా రంగారెడ్డి జిల్లాలో ఎక్కువ ఉన్నాయి. దేవుళ్ల నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారు. వివాదాలు ట్రైబ్యునల్‌కు, కోర్టుల వరకు వెళ్తుండటంతో కేసు సాక్ష్యాలుగా నిలిచే నిజాం కాలంనాటి ముంతకబ్ రికార్డులు అవసరమవుతున్నాయి. వందల ఏళ్లనాటి పత్రాలు కావడంతో వాటిని గుర్తించడానికి తలలు పట్టుకుంటున్నారు. గుర్తించినా శిథిలావస్థలో ఉన్నాయి. దీంతో లోకాయుక్త ఆదేశాలతో ఉర్దూలో ఉన్న ముంతకబ్ రికార్డులను ఆంగ్లంలోకి అనువదించే ప్రక్రియ మొదలుపెట్టింది. అవి పూర్తి కావడం లేదు.

ఈనాడు, హైదరాబాద్



రాజధానిలోనే ఎక్కువ ఎండోమెంట్ పెండింగ్ కేసులు

ఎండోమెంట్ ట్రైబ్యునల్‌లో 2010 నుంచి ఇప్పటివరకు..
రాష్ట్రవ్యాప్తంగా నమోదైన కేసులు.. 2100
పరిష్కారమైనవి.. 1365
ఇంకా పెండింగ్‌లో ఉన్నవి.. 735

హైదరాబాద్‌లో.. 188
చర్చిలు, శ్మశానాలు.. 30

ఇప్పటి వరకు తర్జుమా అయిన ముంతకబ్‌లు.. 1013 దస్త్రాలు
సికింద్రాబాద్ పరిధిలో.. 825

ఇతర ప్రదేశాల ప్రక్రియ.. 30
అనువాదం పూర్తికాని దస్త్రాలు.. 1000 కుపైగా
(వీటి అనువాద ప్రక్రియ పూర్తయితే ఆలయ భూములు ఎన్ని ఉన్నాయో తెలిసే అవకాశం ఉంది.)

రూ.వేల కోట్ల భూములు వివాదాల్లో..

రాజధాని పరిధిలో కొందరు ఈవోలకు ఆలయాల భూముల వివాదాలపై అవగాహన లేదు. దీంతో అనేక కేసులు వీగిపోతున్నాయి. భూముల సరిహద్దులపై అవగాహన లేకపోవడం, ఏళ్ల క్రితం నమోదైన కేసులు కావడం, ఒకే ఆలయానికి చెందిన భూములపై వేర్వేరు వివాదాలు ఉండటంతో వివాద సమయంలో గందరగోళానికి గురవుతున్నారు.

పెండింగ్ కేసులు

హైదరాబాద్	సికింద్రాబాద్	రంగారెడ్డి
140	66	249

'పరస్పరం రెచ్చగొట్టే చర్యలొద్దు'

ఈనాడు, హైదరాబాద్: ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, నాంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఫిరోజ్‌ఖాన్ వర్గాలు పరస్పరం రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని నగర సీపీ, హైదరాబాద్ జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సీవీ ఆనంద్ హెచ్చరించారు. హుమాయున్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో ఇటీవల సీసీ రోడ్డు పనుల్ని పరిశీలించే క్రమంలో మాజిద్ హుస్సేన్, ఫిరోజ్‌ఖాన్ ఇద్దరూ ఒకేసారి ఎదురుపడడం, ఇరువర్గాలు వాగ్వాదం, దాడులు, రాళ్లు విసురుకోవడంతో స్థానికంగా కలకలం రేపింది. 194 బీఎన్ఎస్ చట్టం కింద రెండు వర్గాలపై కేసులు నమోదయ్యాయి. దీనిపై దృష్టి సారించిన అదనపు మేజిస్ట్రేట్ హోదాలో సీపీ.. బంజారాహిల్స్‌లోని కమాండ్ కేంద్రంలో గురువారం కోర్టు నిర్వహించారు. ఇద్దరి మధ్య వైరం రాజకీయంగా, శాంతిభద్రతలపరంగా సున్నితమైన వ్యవహారం కావడంతో మాజిద్ హుస్సేన్ ఆయన అనుచరులు 10 మంది, ఫిరోజ్‌ఖాన్‌తో పాటు 9 మంది అనుచరుల్ని పిలిపించి విచారించారు. హుమాయున్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదేశ్వర్ పరిస్థితిని అదనపు మేజిస్ట్రేట్‌కు వివరించారు. ఆ తర్వాత మాజిద్ హుస్సేన్, ఫిరోజ్ ఖాన్ వర్గాల వాదనలు సీవీ ఆనంద్ విన్నారు. తదుపరి విచారణకు కేసు వాయిదా వేశారు.


వాదనలు వింటున్న కొత్వాల్ సీవీ ఆనంద్. చిత్రంలో ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, కాంగ్రెస్ నేత ఫిరోజ్‌ఖాన్

విగ్రహ ధ్వంసం కేసు సీసీఎస్‌కు

రెజిమెంటల్‌బజార్: సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహం ధ్వంసం కేసును ఉత్తర మండలం పోలీసులు నగర సీసీఎస్‌కు బదిలీ చేయనున్నారు. ఈనెల 14న దుండగుడు ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయగా, స్థానికులు నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించగా అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటన అనంతర పరిణామాలు తీవ్ర ఆందోళనలకు దారి తీశాయి. కేసును సీసీఎస్‌కు బదిలీ చేయనున్నట్లు తెలిసింది. మెట్రోపోలిస్ హోటల్‌లో వ్యక్తిత్వ వికాస తరగతుల ముసుగులో యువతలో విద్వేషాన్ని నింపేందుకు తరగతులను నిర్వహించారని గుర్తించిన పోలీసులు నిర్వాహకుడు మున్వర్‌జమా, హోటల్ యజమాని రషీద్, మేనేజర్ రహ్మాన్ అహ్మద్‌పై కేసులు నమోదు చేశారు. హోటల్ నిర్వాహకులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. మున్వర్ జమా పరారీలో ఉన్నాడు.

ఇంటికెప్పుడెళ్లాలో..


నగరంలో ఏ ప్రాంతమైనా నిత్యం ట్రాఫిక్‌తో నరకమే. షేక్‌పేట వంతెన నుంచి టోలిచౌకి ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో భారీగా నిలిచిన ట్రాఫిక్ ఇది

తోడుదొంగలు

కొలిక్కివచ్చిన బత్తలపల్లి మండలం రామాపురం కాల్పుల ఘటన కేసు

ధర్మవరం, బత్తలపల్లి: గుప్తనిధుల తవ్వకాల్లో బంగారం దొరికిందని, 2 కిలోలు రూ.5 లక్షలకే ఇస్తామని ఒక ముఠా రెండో ముఠాకు ఎరవేసింది. ఆ బంగారాన్ని నకిలీనోట్లు ఇచ్చి కొట్టేయాలని రెండో ముఠా పన్నాగం పన్నింది. చివరికి రెండు ముఠాల్లోని 12 మంది పోలీసులకు పట్టుబడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద ఈనెల 20న ఆదివారం పట్టపగలే తుపాకీ కాల్పుల ఘటన కలకలం రేపింది. అన్నమయ్య జిల్లా షికారీపాలెం ముఠా.. గుప్తనిధుల తవ్వకాల్లో 2 కిలోల బంగారం దొరికిందని, తక్కువ ధరకే ఇస్తామని హైదరాబాద్‌కు చెందిన నరేష్‌కు ఎరవేశారు. ఇత్తడికి బంగారు పూత వేయించి పరీక్షించుకోవాలన్నారు. అది నిజమైన బంగారంగానే భావించిన నరేష్.. అరవింద్ నాగరాజు, రితీష్‌కు విషయం చెప్పాడు. యూట్యూబర్ అయిన అరవింద్ సైబర్ పోలీసులతో సన్నిహితంగా మెలిగేవాడు. మొత్తం బంగారాన్ని కాజేయాలని పథకం వేశారు. బత్తలపల్లి మండలం రామాపురం వద్దకు రావాలని ఫోన్ రావడంతో ఓ కారులో నరేష్, మరికొందరు, మరో కారులో అరవింద్, నాగరాజు, రితీష్ మరికొందరు వచ్చారు. నరేష్‌కు షికారీపాలెం ముఠా నకిలీ బంగారాన్ని ఇచ్చే సమయంలో అరవింద్ బృందం గాల్లో కాల్పులు జరిపింది. దీంతో పోలీసులు వచ్చారని షికారీపాలెం ముఠా పరారైంది. బత్తలపల్లి పోలీసులకు షికారీపాలెం ముఠా వ్యక్తి పట్టుబడగా కేసు కొలిక్కి వచ్చింది.

కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలు




నాచారం, న్యూస్‌టుడే: నాచారం రాఘవేంద్రనగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న ఆరుగురు చిన్నారులపై వీధికుక్కలు దాడిచేసి గాయపరిచాయి. స్థానికుల కథనం ప్రకారం... రాత్రి 7 గంటల సమయంలో అబ్దుల్ రెహ్మాన్(6), విజయ్(7) మరో నలుగురి చిన్నారులను కరవడంతో వారి కాళ్లు, చేతులపై గాయాలయ్యాయి. తల్లిదండ్రులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు.

కులగణన యజ్ఞంలా జరగాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ఖైరతాబాద్: రాష్ట్రంలో సమగ్ర కులగణన సర్వే యజ్ఞంలా నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్‌ను కోరారు. గురువారం ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో బీసీ సంఘాలు, కుల సంఘాలతో సమావేశం నిర్వహించారు. తొలి కులగణన శాస్త్రీయంగా, హేతుబద్ధంగా నిర్వహించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని బీసీ కమిషన్‌కు సూచించారు. గణనకు అవసరమైన ప్రశ్నావళిని రూపొందించి మార్గదర్శకాలు విడుదల చేయాలని, ఆలాగే ఊరురా దండోరా వేయించి శిక్షణ పొందిన ఉద్యోగులను నియమించి, కులాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను లెక్కించాలన్నారు.

కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టు స్వాధీనం



ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న కేంద్రంపై సౌత్ వెస్ట్ టాస్క్‌ఫోర్స్, లంగర్‌హౌస్ పోలీసులు దాడి చేసి పెద్ద ఎత్తున కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్ జేబాబాగ్ ప్రాంతానికి చెందిన సయ్యద్ సలీం(42) లంగర్‌హౌస్‌లోని డిఫెన్స్‌కాలనీలో హీనా బ్రాండ్ పేరుతో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారుచేసి విక్రయిస్తున్నాడు. పేస్ట్ తయారీకి నాసిరకం అల్లం, వెల్లుల్లి, సిట్రిక్ యాసిడ్ ఉపయోగిస్తున్నాడు. పోలీసులు దాడి చేశారు. 835.5 కిలోల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్, నిమ్మఉప్పు, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న అల్లం, వెల్లుల్లి ఖరీదు రూ.4,45,380 ఉంటుందన్నారు.

మూసీ బాధితులకు అండగా భాజపా: ఈటల


బాధితులతో మాట్లాడుతున్న రాజేందర్

అత్తాపూర్, న్యూస్‌టుడే: మూసీ బాధితులకు అండగా భాజపా నిలుస్తుందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం రాజేంద్రనగర్‌లోని మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ప్రభుత్వం ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తోందన్నారు.

కార్వాన్, గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ఉసురు పోసుకుంటోందని భాజపా శాసనసభా పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. కార్వాన్ మూసీ తీరంలోని దరియాబాగ్‌లో ఇటీవల సర్వే జరిగిన ప్రాంతం, గోల్కొండ పరిధి రామ్‌దేవ్‌గుడాలోని పద్మానగర్‌కాలనీ, లంగర్‌హౌస్‌లలోని మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలను ఆయన కలిశారు. ఎంపీ అరవింద్ పద్మానగర్‌లో బాధితులతో మాట్లాడారు.

మూసారాంబాగ్, న్యూస్‌టుడే: మూసీ సుందరీకరణ, హైడ్రా చర్యలనేవి కాంగ్రెస్ ప్రభుత్వ నాటకాలని కామారెడ్డి భాజపా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆరోపించారు. 'మూసీ బాధితులకు భాజపా భరోసా' కార్యక్రమంలో ఆయనతో పాటు నేతలు బంగారు శ్రుతి, సుభాష్‌చందర్జీ, సందడి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు గురువారం మూసారాంబాగ్‌లోని మూసీ పరీవాహక ప్రాంతాలను సందర్శించారు. కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రహదారి వెంట వ్యభిచారం.. 35 మంది అరెస్టు

మఫ్టీలో సైబరాబాద్ పోలీసుల దాడులు

ఈనాడు, హైదరాబాద్: వ్యభిచార ముఠాలపై సైబరాబాద్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి మెరుపుదాడులు చేశారు. కూకట్‌పల్లి డివిజన్‌తో పాటు షీటీమ్స్, మానవ అక్రమ రవాణా నిరోధక బృందం (ఏహెచ్‌టీయూ) విభాగానికి చెందిన దాదాపు 50మంది మఫ్టీలో దాడి చేసి 31 మంది మహిళలు, నలుగురు హిజ్రాలను అదుపులోకి తీసుకున్నారు. వీరిని కూకట్‌పల్లి ఎమ్మార్వో ముందు హాజరుపర్చి బైండోవర్ చేశారు. మరోసారి పునరావృతమైతే కఠిన చర్యలుంటాయని హెచ్చరించి వదిలేశారు. అక్టోబరులోనూ ఈ తరహా ఆపరేషన్ చేపట్టి 22 మందిని అదుపులోకి తీసుకున్నారు.

సామాజిక మాధ్యమాల్లో వైరల్: కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి మెట్రోస్టేషన్లు, జాతీయ రహదారి వెంబడి, భాగ్యనగర్‌కాలనీ బస్టాపు, కైత్లాపూర్ నాలుగోఫేజ్, లోధా టవర్స్ మార్గాల్లో కొందరు రాత్రిపూట దారిన వెళ్లేవారితో సైగలు చేస్తూ ఇబ్బందులు పెట్టే వీడియోలు సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారాయి. సెప్టెంబరు 30న లోధా టవర్స్ సమీపంలోని పొదల్లో వ్యభిచార వృత్తిలో మొదలైన గొడవతో ఓ మహిళ మరో మహిళను హత్య చేసినట్లు తేలింది. దీంతో సీపీ అవినాశ్ మహంతి, బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ దృష్టిసారించారు. కూకట్‌పల్లి ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్లు ముత్తు, వెంకటేశ్వరరావు, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు, వివిధ విభాగాల పోలీసులు 50మంది నాలుగు బృందాలుగా ఏర్పడ్డాయి. కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి మెట్రోస్టేషన్లు, భాగ్యనగర్ బస్టాపు దగ్గర సాయంత్రం 8-11 గంటల మధ్య మఫ్టీ పోలీసులు రంగంలోకి దిగారు. మహిళలు, హిజ్రాలను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు.

ఇంటి ధ్రువపత్రం ఇవ్వలేదని.. పురుగు మందు తాగిన యువకుడు

యాచారం, న్యూస్‌టుడే: ఇంటి ధ్రువపత్రం రాకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. యాచారం మండలం చౌదరిపల్లికి చెందిన ముక్కెరి మధుసూదన్(42).. గ్రామకంఠం భూమి 120 గజాల స్థలంలో పంచాయతీ అనుమతితో ఇల్లు నిర్మించుకున్నాడు. భార్య సునీత పేరున రిజిస్ట్రేషన్ చేసి బ్యాంకు రుణం తీసుకోవాలనుకున్నాడు. అందుకు పంచాయతీ ఆన్‌లైన్ ఇంటి నిర్మాణ ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేశాడు. గ్రామ కార్యదర్శి జోత్స్న ధ్రువపత్రం ఇవ్వడం లేదని ఆరోపించాడు. గురువారం మరోసారి అడిగి అక్కడే పురుగు మందు తాగగా గ్రామస్థులు యాచారం ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం గాంధీ తరలించారు. సెట్‌బ్యాక్స్ లేని కారణంగా ధ్రువపత్రం ఇవ్వలేదని జ్యోత్స్న వివరణ ఇచ్చారు.

భాజపా ఫాసిస్టు విధానాలపై పోరాడేలా చేద్దాం



లాలాపేట, న్యూస్‌టుడే: ఉత్తరాది రాష్ట్రాల్లో ఫాసిజం నాట్యం చేస్తోందని, ఈ ఆలోచనల సంఘర్షణలు అనేకచోట్ల కనబడుతున్నాయని శాస్త్రవేత్త, కవి గౌహర్ రజా అన్నారు. పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా గురువారం ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల నుంచి ఠాగూర్ ఆడిటోరియం వరకు సాంస్కృతిక కార్యక్రమాలతో ర్యాలీ నిర్వహించారు. సంస్థ జెండాను మొదటి అధ్యక్షుడు గురువారెడ్డి ఎగురవేశారు. ప్రొ.హరగోపాల్, ప్రొ.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా, ఆరెస్సెస్ దేశ ప్రజలను విభజించి విద్వేష రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.

పరివర్తన పేరుతో ఇదేం ప్రవర్తన?

- పునరావాస కేంద్రాల్లో బాధితులపై దారుణాలు
- మార్పు కోసమంటూ బెల్టు దెబ్బలు, చిత్రహింసలు



ఈనాడు, హైదరాబాద్

మద్యం, మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయటపడేస్తామంటూ నగరంలోని కొన్ని రిహాబిలిటేషన్ (పునరావాస) సెంటర్లు, వ్యసన విముక్తి కేంద్రాలు దారుణాలకు పాల్పడుతున్నాయి. మార్పు పేరుతో బాధితులను తాళ్లతో కట్టేసి బెల్టు, కర్రలతో కొడుతూ చిత్రహింసలు పెడుతున్నాయి. ఆహారం పెట్టకుండా నరకం చూపిస్తున్నాయి. అప్పటికే వ్యసనాల బారినపడి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులు దెబ్బలకు తాళలేక ప్రాణాలు వదిలేస్తున్నారు. తాజాగా జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడలోని ఓ పునరావాస కేంద్రంలో చేరిన బాధితుడిని బెల్టుతో కొట్టడంతో అతను మరణించడం చర్చనీయాంశంగా మారింది. గతంలో కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కేంద్రంలో చేర్పించిన బాధితుడు మరణించడం, ఒంటిమీద దెబ్బలు ఉండడం కలకలం రేపింది. ఇలాంటి ఘటనలు వెలుగు చూసినప్పుడు వ్యసన విముక్తి పేరుతో నిర్వాహకులు చేసే దారుణాలు బయటపడుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వందలాది కేంద్రాలున్నాయి.

కఠిన నిబంధనలున్నా.. : ● ఈ కేంద్రాలు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో సొసైటీ చట్టం కింద నమోదవ్వాలి. కేవలం ఆదాయం కోసం కాకుండా మానసిక పరివర్తన కోసం నిర్వహించే స్వచ్ఛంద సంస్థలా కొనసాగించాలి. ● బాధితుల్లో పరివర్తన తెచ్చేందుకు ప్రాథమికంగా 30 రోజుల కింద చేర్చుకోవచ్చు. అవసరమైతే దీన్ని 60 రోజులకు పెంచొచ్చు ● బాధితుడి, మానసిక పరిస్థితి ఆధారంగా చికిత్స అందించాలి. నిపుణులతో కౌన్సెలింగ్ ఇస్తుండాలి. ● బాధితులతో స్నేహపూర్వకంగా మెలగాలి.

డబ్బు కోసం..

● వాస్తవానికి వ్యసన విముక్తి కేంద్రాల నిర్వహణ పరిమితి అయిదేళ్లు అయినా కొన్ని అనుమతి లేకుండా అడ్డగోలుగా కొనసాగుతున్నాయి. తాజాగా దమ్మాయిగూడలో వ్యక్తి మరణించిన పునరావాస కేంద్రం లైసెన్సు గత ఏడాది జూన్‌లోనే ముగిసినా యథేచ్ఛగా కొనసాగడమే ఇందుకు నిదర్శనం.● వ్యసనానికి అలవాటుపడిన బాధితులు పునరావాస కేంద్రంలో పరిస్థితులను జీర్ణించుకోలేరు. నిర్వాహకులు వారి మానసిక పరిస్థితిని పట్టించుకోకుండా చిత్రహింసకు గురిచేస్తున్నారు. మాట వినకపోయినా, ఆహారం తీసుకోకపోయినా కొట్టడం రివాజుగా మారింది. ● వీటిని నిర్వహిస్తున్నట్లు స్థానిక మున్సిపాలిటీ నుంచి అనుమతితీసుకోవాల్సి ఉన్నా అలా జరగడం లేదు.

కుటుంబసభ్యులు పట్టించుకోక..

మత్తుకు బానిసగా మారిన వారి కుటుంబ సభ్యులు క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలు బాధితులకు శాపంగా మారుతున్నాయి. వారిని పునరావాస కేంద్రాల్లో వదిలేసి కొన్ని నెలలపాటు పరామర్శించడం లేదు. ఇదే అవకాశంగా నిర్వాహకులు బాధితులకు నరకాన్ని చూపిస్తున్నారు. కొన్నిసార్లు మత్తుమందు ఇచ్చి వాహనాల్లో ఇంటి నుంచి తీసుకెళ్లి బంధిస్తున్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ రోజుల తరబడి వేధిస్తున్నారు.

నిపుణుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇవ్వాలి

బాధితులకు నిపుణుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇవ్వాలి. శిక్షించడం సరికాదు. అవగాహన, పరిస్థితిని వివరిస్తూ వారి మానసిక పరిస్థితికి అనుగుణంగా అన్ని కోణాల్లో మార్పు తీసుకురావాలి. నైపుణ్యం లేనివారు నిర్వహించకుండా చూడాలి.

– దేవికారాణి, అమృత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు

రూ.500 కోసం హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవం



రంగారెడ్డి జిల్లా కోర్టులు: రూ.500 కోసం ఓ మహిళను హత్య చేసిన నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు, రూ.10,000 జరిమానా విధించింది. అదనపు పీపీ రఘు కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన షేక్ బడేమియా(25) 2021 నవంబరు 12న హయత్‌నగర్‌లోని ఓ మద్యం దుకాణం ముందు ఒంటరిగా ఉన్న మహిళ (35) దగ్గర కొంత నగదు ఉన్నట్లు గుర్తించి ఆమెకు మద్యం ఆశ చూపి పెద్దఅంబర్‌పేట సమీపంలోని నిర్జన ప్రదేశంలోని కాలువ దగ్గరకు తీసుకెళ్లి మద్యం తాగించి హత్య చేశాడు. రూ.500 దొంగిలించి శవాన్ని కాలువలోకి తోసేసి పారిపోయాడు. చివరికి నిందితుడు 2021 డిసెంబరులో నల్గొండజిల్లా చింతపల్లి పోలీసులకు చిక్కాడు.

'సాంకేతికత ఉత్ప్రేరకం'పై ఇండో-ఫ్రెంచ్ సదస్సు



ప్రసంగిస్తున్న రక్ష్ వీర్‌జస్రా

శామీర్‌పేట, న్యూస్‌టుడే: సాంకేతికత ఉత్ప్రేరకంలో భవిష్యత్తు సవాళ్లను అధిగమించేందుకు ఇండో-ఫ్రెంచ్ సదస్సు దోహదపడుతుందని రిలయన్స్ ఇండస్ట్రీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఆర్ అండ్ డి) డాక్టర్ రక్ష్ వీర్ జస్రా అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్‌లో 'అకాడమియా ఇండస్ట్రీ క్రాస్ ఫెర్టిలైజేషన్- సురక్షిత సమర్థమంతమైన ఉత్ప్రేరక ప్రక్రియలు' అంశంపై సదస్సును ఆయన ప్రారంభించారు. హైదరాబాద్ క్యాంపస్ ప్రొఫెసర్ సౌనక్ రాయ్, డి లిల్లే యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ పాస్కల్ గ్రాంజర్ ఫ్రాన్స్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు లైసెన్సు తప్పనిసరి

ఈనాడు, హైదరాబాద్: బాణసంచా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసే యజమానులు జీహెచ్‌ఎంసీ నుంచి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి కోరారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయాల్లోని పౌర సేవా కేంద్రాల్లో(సీఎస్‌సీ), జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్ www.ghmc.gov.inలో తాత్కాలిక ట్రేడ్ లైసెన్సు పొందవచ్చని తెలిపారు.

300 కిలోమీటర్ల బ్యాక్ స్కేటింగ్



బ్యాక్ స్కేటింగ్‌ను ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: ప్రపంచ రికార్డులో భాగంగా నగరానికి చెందిన ఇద్దరు సోదరులు కలకోట రాజేష్ గుప్తా, ఉమేష్‌గుప్తా అబ్దుల్లాపూర్‌మెట్ (రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రధాన ద్వారం) నుంచి భద్రాచలం వరకు 300 కిటోమీటర్ల మేర బ్యాక్ స్కేటింగ్ చేపట్టారు. గురువారం రాత్రి ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ప్రారంభించారు. కోచ్ శరత్, బాలల తండ్రి నవీన్‌కుమార్, నాగేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా రవాణాకు పరిష్కారం.. మెట్రో రైల్



ఈనాడు, హైదరాబాద్: మెట్రో నగరాల్లో పెరుగుతున్న ప్రజా రవాణా అవసరాలకు మెట్రోరైల్ పరిష్కారం అంటున్నారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పట్టణ, పర్యావరణ ప్రాంతీయ కేంద్రం పరిశోధకులు. విదేశీ నగరాల్లో ప్రతి 50లక్షల జనాభాకు 200 కిలోమీటర్ల మెట్రోరైల్ నెట్‌వర్క్ ఉందని.. సామాజిక.. ఆర్థిక పరిస్థితుల ఆధారంగా మన మెట్రో నగరాల్లోనూ మెట్రోరైల్ వ్యవస్థను విస్తరించాలంటూ చెబుతున్నారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే షాంఘై, లండన్, న్యూయార్క్, సింగపూర్ నగరాల్లో మెట్రోరైల్ వ్యవస్థ.. దిల్లీ, ముంబయి, బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాల్లో మెట్రోరైల్ వ్యవస్థను పోల్చుతూ ఇటీవల ఒక అధ్యయనం చేశారు.

- లండన్‌లో మెట్రోరైల్ నెట్‌వర్క్ ఆక్టోపస్‌లా విస్తరించి ఉంటుంది. నగరంలో నివసిస్తున్న 97లక్షల మంది ప్రజలకు ప్రతి రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో మెట్రోరైల్ స్టేషన్లు అందుబాటులో ఉన్నాయి. అక్కడ రోజుకు 60లక్షల మంది మెట్రోరైల్‌లో రాకపోకలు కొనసాగిస్తున్నారు.
- సింగపూర్ జనాభా 56లక్షలు.. అక్కడ 203 కిలోమీటర్ల మెట్రోరైల్ నెట్‌వర్క్ అందుబాటులో ఉంది. రోజుకు సగటున 34లక్షల మంది మెట్రో రైల్‌లో ప్రయాణిస్తున్నారు.

విమానాశ్రయానికి అనుసంధానం

ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఉపకులపతి, ఉస్మానియా విశ్వవిద్యాలయం

హైదరాబాద్‌లో ఇటీవలే విమానాశ్రయానికి మెట్రోరైల్ నెట్‌వర్క్ నిర్మాణాన్ని ప్రారంభించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో కోటి జనాభా ఉండడంతో మెట్రోరైల్‌ను విస్తరించడం, స్టేషన్లకు సమీపంలోనే కార్యాలయాలు, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు ఉండేలా చర్యలు తీసుకుంటే ద్విచక్ర వాహనాల వినియోగం తగ్గేందుకు అవకాశాలున్నాయి.

అంకుర సంస్థలను మరింత ప్రోత్సహిద్దాం

ఈనాడు, హైదరాబాద్: వినూత్న ఆలోచనలకుతోడు నూతన విధానాలను కార్యరూపంలోకి తీసుకువస్తున్న అంకుర సంస్థలను మరింతగా ప్రోత్సహిద్దామని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశంలో పరిశోధకులు, వ్యాపారవేత్తలు నిర్ణయించారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్(హైదరాబాద్) గ్యారిత్ వ్యాన్ ఓవెన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పర్యావరణానికి హానిచేయని ఉత్పత్తులు తయారుచేసే పరిశ్రమలకు సాంకేతిక సహకారమందిస్తున్న అంకుర సంస్థలకు మద్దతివ్వాలని పరిశ్రమలు, కార్పొరేటు ప్రతినిధులు సూచించారు.

ఆస్టియో ఆర్థరైటిస్‌కు సూపర్ పీఆర్పీతో ఉపశమనం



కిట్ చూపుతున్న డాక్టర్ సుధీర్‌ధార, మినాల్ చంద్ర

ఈనాడు, హైదరాబాద్: నాలుగో దశ ఆస్టియో ఆర్థరైటీస్‌తో బాధపడే రోగులకు సూపర్ ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీ(పీఆర్‌పీ)తో ఉపశమనం లభిస్తుందని ఎపియోన్ సెంటర్ ఫర్ పెయిన్ రిలీఫ్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ డాక్టర్ సుధీర్ ధార తెలిపారు. సాధారణ ప్లాస్మా పునరుత్పత్తి విధానం కంటే సూపర్ ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీ ద్వారా 25 రెట్లు గ్రోత్ ఫ్యాక్టర్లు వ్యాధిని నయం చేసేలా పనిచేస్తాయని వివరించారు. దీంతో రోగి మోకీళ్ల నొప్పుల నుంచి త్వరితగతిన కోలుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రోగులకు నాణ్యమైన, సమర్థంగా చికిత్సలు అందించే ఉద్దేశంతో సూపర్ పీఆర్‌పీ విధానాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు డాక్టర్ సుధీర్ దారా వివరించారు. ఎపియోన్ సెంటర్ కో-ఫౌండర్ డాక్టర్ మినాల్‌చంద్రతో కలిసి సూపర్ పీఆర్‌పీ చికిత్స కిట్లు ప్రదర్శించారు.

రూ.1.31కోట్ల బంగారు తాపడ నగల వితరణ





చందానగర్ వేంకటేశ్వర దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులకు పుష్పాలంకరణ చేశారు. మూలవిరాట్ వేంకటేశ్వస్వామి, పద్మావతి, గోదాదేవి అమ్మవార్లకు భక్తుడు పులిపాటి రాజేందర్ బంగారు తాపడం చేసిన నగలు సమర్పించారు. రూ.1.31కోట్లతో కిరీటాలు, కర్ణపత్రాలు, వక్షస్థలం, పంచ, కండువా, పావడ తదితర 15 రకాల బంగారు తాపడం చేయించిన నగలు అందజేశారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. –న్యూస్‌టుడే, చందానగర్

శ్రీధర్‌బాబుకు 'హ్యాక్ 2.0' సదస్సుకు ఆహ్వానం



మంత్రికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న సీవీ ఆనంద్, శేఖర్‌రెడ్డి, భరణి

ఈనాడు, హైదరాబాద్: "హ్యాక్ 2.0" పేరుతో నిర్వహిస్తున్న సైబర్ సెక్యూరిటీ సదస్సుకు హాజరు కావాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆహ్వానించారు. నవంబరు 6న జరగనున్న సదస్సును హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(హెచ్‌సీఎస్‌సీ) నిర్వహిస్తోంది. మంత్రిని ఆహ్వానించిన వారిలో హెచ్‌సీఎస్‌సీ సెక్రెటరీ జనరల్ శేఖర్‌రెడ్డి, హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్(హైసియా) ప్రతినిధి భరణి తదితరులున్నారు.

ఎలివేటెడ్ కారిడార్ పనులు వెంటనే చేపట్టండి



అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: – ఉప్పల్, న్యూస్‌టుడే: ఉప్పల్‌లో ఆగిపోయిన ఎలివేటెడ్ కారిడార్ పనులను వెంటనే చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులకు సూచించారు. గురువారం హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ప్రాజెక్టు విభాగం చీఫ్ ఇంజినీర్ దేవానంద్‌లతో కలిసి కారిడార్‌ను పరిశీలించారు. ఉప్పల్ సర్కిల్ ఉప కమిషనర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌డీపీ పెండింగ్ పనుల పరిశీలన

ఎస్‌ఆర్‌డీపీ ద్వారా చేపట్టిన ఫలక్‌నుమా ఆర్వోబీ నల్గొండ క్రాస్‌రోడ్డు పై ఓవర్ పనులను వెంటనే పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదేశించారు. రైల్వేశాఖ చేపట్టాల్సిన ఫలక్‌నుమా ఆర్వోబీ వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, ఎల్బీనగర్ జోన్ ప్రాజెక్టు ఈఈ రోహిణి, ఫలక్‌నుమా, సంతోష్‌నగర్, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్లు అరుణ కుమారి, శైలజ పాల్గొన్నారు.

ప్రకృతి ప్రేమికులుగా జీవించేలా పిల్లల్ని తీర్చిదిద్దాలి

- చెరువుల పరిరక్షణకు రేవంత్‌రెడ్డి చేస్తున్నది మంచి పని: వెంకయ్యనాయుడు





డాక్టర్ కాకర్ల సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వెంకయ్యనాయుడు. చిత్రంలో లక్ష్మి, శోభారాణి, సుశ్రుత్, డాక్టర్ భాస్కర్‌రావు, పక్కన చిత్రంలో చిన్నారుల నృత్యాలు

మాదాపూర్, న్యూస్‌టుడే: ప్రకృతిని ప్రేమిస్తూ జీవించే విధానం పిల్లల్లో చిన్నప్పటి నుంచే పెంపొందించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. చెరువులు, కుంటలను ఆక్రమిస్తూ మన భవిష్యత్తును మనమే దెబ్బతీసుకుంటున్నామని అభిప్రాయపడ్డారు. మూసీ నదిని చాలావరకు ఆక్రమించారు.. దాని పునరుజ్జీవం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్నది మంచి పనిగా తాను భావిస్తున్నట్లు చెప్పారు. ప్రఖ్యాత వైద్యులు కాకర్ల సుబ్బారావు శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆయన స్థాపించిన ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవాన్ని గురువారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో నిర్వహించారు. వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రముఖ ఆంకో రేడియాలజిస్ట్ డాక్టర్ వెంకటరావు దేవినేని, కిమ్స్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.భాస్కర్‌రావు, స్కూల్ జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్ కాకర్ల సుశ్రుత్, డైరెక్టర్ కాకర్ల శోభారాణి, ప్రిన్సిపల్ వి.లక్ష్మి పాల్గొన్నారు.

'ఉద్యోగ ఖాళీల భర్తీకి ప్రాధాన్యం'



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ప్రభుచరణ్, రాంప్రభు, హజారియా, రామారావు తదితరులు

కాచిగూడ, న్యూస్‌టుడే: తమ యూనియన్‌ను గెలిపిస్తే పాత పింఛన్ విధానం పునరుద్ధరణ, రైల్వే ఉద్యోగ ఖాళీల భర్తీ, కార్మికులపై పనిభారం తగ్గించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని రైల్ మజ్దూర్ యూనియన్ (ఆర్‌ఎంయూ) దక్షిణ మధ్య రైల్వే జోనల్ ప్రధాన కార్యదర్శి ప్రభుచరణ్ వెల్లడించారు. గురువారం ఎన్నికల నామినేషన్‌కు ముందు ఆర్‌ఎంయూ జోనల్ అధ్యక్షుడు రాంప్రభు, కోశాధికారి రామారావు, అదనపు ప్రధాన కార్యదర్శి హజారియా, ఉపాధ్యక్షుడు నర్సయ్యతో కలిసి మాట్లాడారు. నేతలు పుష్పరాజ్, అశోక్ పాల్గొన్నారు.

అంతిమ లక్ష్యం ఒలింపిక్ పతకం: నిఖత్ జరీన్



ఈనాడు, హైదరాబాద్: పారిస్ ఒలింపిక్స్‌లో పతకం గెలవలేకపోవడంతో కల చెదిరిందని భారత బాక్సింగ్ స్టార్ నిఖత్ జరీన్ వెల్లడించింది. రాష్ట్ర పోలీసు శాఖలో డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆమె గురువారం కంట్రీ క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడింది. "ఒలింపిక్స్ పతకం సాధించాలన్నది నా అంతిమ లక్ష్యం. మంచి ఫామ్, ఫిట్‌నెస్‌తో ఉండటంతో పారిస్‌లో పతకం గెలుస్తాననే అనుకున్నా. కానీ అది సాధ్యం కాలేదు. తిరిగి ఎలా పుంజుకోవాలో అర్థం కాలేదు. నా కెరీర్‌లో అదో పేలవ దశ. ప్రస్తుతం 2026 కామన్వెల్త్, ఆసియా క్రీడలపై దృష్టి సారించా. వచ్చే ఒలింపిక్స్‌లో పతకం గెలిచేందుకు ప్రయత్నిస్తా' ' అని రెండు సార్లు ప్రపంచ ఛాంపియన్ నిఖత్ తెలిపింది.

టూర్ టెన్నిస్ టోర్నీ క్వార్టర్స్‌లో శ్రీవల్లి



దిల్లీ: ఐటీఎఫ్ మహిళల ప్రపంచ టూర్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో శ్రీవల్లి 6-4, 6-1తో గాబ్రియెలా ఫిక్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించింది. డబుల్స్ క్వార్టర్స్‌లో శ్రీవల్లి- వైదేహి చౌదరి జోడీ 4-6, 6-7 (5)తో నాహో సాటో- యుకి నైటో (జపాన్) జంట చేతిలో ఓడింది.

స్కాన్ చేసుకో.. మొక్కల ప్రాధాన్యం తెలుసుకో..



ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్లు తప్పనిసరి అయిన నేపథ్యంలో నగరంలోని పార్కుల్లో కొన్ని అరుదైన మొక్కల ప్రాముఖ్యాన్ని తెలుసుకొనేందుకు క్యూఆర్ కోడ్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నారు. దానిని స్కాన్ చేస్తే ఆ మొక్కల వివరాలు ఫోన్‌లో ప్రత్యక్షం అవుతాయి. నెక్లెస్ రోడ్‌లోని లేక్ వ్యూ ఫ్రంట్ పార్కులో కనిపించిన దృశ్యమిది.

బీసీ కులాల అభ్యున్నతికి భాజపా కృషి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వినోద్ యాదవ్, రామోజీ, ఓబీసీ మోర్చా నేతలు

గోల్నాక, న్యూస్‌టుడే: బీసీ కులాల అభ్యున్నతి, సంక్షేమానికి కేంద్రంలోని భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వినోద్‌యాదవ్ తెలిపారు. జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకి దక్కుతుందన్నారు. గురువారం గోల్నాకలో భాజపా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను జిల్లా ఇన్‌ఛార్జి కాలేరు రామోజీ వంజరితో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. నేతలు రవీందర్‌గౌడ్, అచ్చిని రమేష్, వెంకటస్వామిగౌడ్ పాల్గొన్నారు.

బహుభాషా కోవిదుడు శేషేంద్రశర్మ



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటరావు, టి.గౌరీశంకర్, కళా జనార్దనమూర్తి, చక్రపాణి

గాంధీనగర్, న్యూస్‌టుడే: కవి, విమర్శకుడు, సాహితీవేత్త గుంటూరు శేషేంద్రశర్మ దార్శనికుడు, బహుభాషా కోవిదుడని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ టి.గౌరీశంకర్ అన్నారు. గురువారం త్యాగరాయగానసభ నిర్వహణలో 'గుంటూరు శేషేంద్రశర్మ యాదిలో'.. శీర్షికతో కళాసుబ్బారావు కళావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. శేషేంద్రశర్మ సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలలో ఉద్దండ పండితులని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు వెంకటరావు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో జిల్లా కోర్టుల రజతోత్సవం


భూమి పూజలో న్యాయమూర్తులు, న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: ఎల్బీనగర్‌లోని రంగారెడ్డిజిల్లా కోర్టుల ప్రధాన భవన సముదాయం నిర్మితమై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నవంబరులో రజతోత్సవాలను నిర్వహించాలని స్థానిక న్యాయవాదుల సంఘం కార్యవర్గం నిర్ణయించింది. దీనికిగానూ జిల్లాకోర్టుల ఆవరణలో హైకోర్టు అనుమతితో ఓ భారీ పైలాన్‌ను ఆవిష్కరించనున్నట్లు అధ్యక్షుడు వై.కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణ తెలిపారు. పైలాన్ నిర్మాణం కోసం గురువారం జిల్లాకోర్టుల ప్రధాన న్యాయమూర్తి ఎస్.శశిధర్‌రెడ్డి భూమి పూజ చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రాధాకృష్ణ, క్రీడా సాంస్కృతిక కార్యదర్శి అండేకార్ అశోక్, మహిళా ప్రతినిధి మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

జాతీయ రహదారిపై అడ్డంగా..



ఎల్బీనగర్, న్యూస్‌టుడే: విజయవాడ జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా హరిణవనస్థలి వద్ద చేపట్టిన కల్వర్టు పునరుద్ధరణ పనులు కొన్ని రోజులుగా నిలిచిపోయాయి. ప్రధాన రహదారిలో రోడ్డుకు అడ్డంగా ఇనుపబోర్డును ఏర్పాటు చేశారు. రాత్రి వేళ ఈ బోర్డు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు మధ్యలో గుంత ఉండటంతో వాహనదారులు అందులో పడే అవకాశం ఉంది. అధికారులు తక్షణం కల్వర్టు పునరుద్ధరణ పనులు పూర్తి చేసి బోర్డు తొలగించి, గుంతలు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సదస్సు 28న

నాగోలు, న్యూస్‌టుడే: బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర సదస్సు ఈ నెల 28న ఉదయం 10గంటలకు హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్లు సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. జన గణనలో కులగణన చేపట్టి చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంపు వంటి విషయాలపై చర్చించేందుకు ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, విశ్రాంత ఐఏఎస్ అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఉచిత వినికిడి వైద్య శిబిరం నేటి నుంచి

వనస్థలిపురం, న్యూస్‌టుడే: హియర్ వెల్ స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో ఉచిత వినికిడి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆడియాలజిస్ట్‌లు డా.నాగకిరణ్, డా.శ్రీలతలు తెలిపారు. వినికిడి, మాటల్లో లోపం ఉన్న ప్రతి ఒక్కరు ఉచితంగా శిబిరంలో పాల్గొనాలన్నారు. మలక్‌పేటలోని మెట్రోపిల్లర్ నెంబరు 1470 సమీపంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 97032 35513 నెంబరులో సంప్రదించాలని కోరారు.

శ్మశానవాటిక పనుల్లో వేగం పెంచాలి

హయత్‌నగర్: హయత్‌నగర్ బంజారా కాలనీ సమీపంలోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులను గురువారం అధికారులతో కలిసి కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి పరిశీలించారు. పనులలో నాణ్యత పాటిస్తూ వేగంగా పూర్తిచేయాలని సూచించారు. ఏఈ హేమునాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల న్యాయకళాశాలలో మహిళా ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు

దిల్‌సుఖ్‌నగర్, న్యూస్‌టుడే: చైతన్యపురిలోని గురుకుల న్యాయ కళాశాలలో మహిళా ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ మానస ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా గెస్టు ఫ్యాకల్టీ, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు ఎల్ఎల్ఎం, పీజీ లేదా నీట్, ఎస్ఈటీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులకు నవంబరు 4వ తేదీన రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు 96036 17134, 63007 13421 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'ఏకగ్రీవం పేరుతో మోసం చేశారు'

వనస్థలిపురం: వనస్థలిపురం నివాసుల సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక చెల్లదని, తమను సంప్రదించకుండానే ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని పలువురు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆరోపించారు. గురువారం వనస్థలిపురంలో ఉప్పు వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ.. కమిటీ ఏకగ్రీవం చేయాలని నిర్ణయించి, తనను పిలిచి ఫొటో తీసుకుని, సభ్యుడిగా తీసుకుంటామని మోసం చేశారని ఆరోపించారు. సంక్షేమ సంఘానికి ఎన్నికలు జరిపించాలని డిమాండ్ చేశారు. అశోక్‌కుమార్, అశీష్‌కుమార్ ఉన్నారు.

వివాహిత అదృశ్యం

హయత్‌నగర్: ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సూర్యాపేటకు చెందిన వివాహిత(24) దసరా పండగకు హయత్‌నగర్‌లోని సీఎస్ఆర్ కాలనీలో ఉంటున్న తల్లిదండ్రుల ఇంటికొచ్చింది. ఈనెల 22న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లింది. బంధువుల ఇళ్లలో ఆరాతీసిన ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వన్‌టైమ్.. మరో వారమే



- ఈనెల 31తో ముగియనున్న ఓటీఎస్
- ఎల్బీనగర్‌లో రూ.19 కోట్ల మేర నీటి బిల్లుల బకాయిలు

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: నల్లా బిల్లులు బకాయి ఉంటే వాటిపై ఉన్న వడ్డీ, జరిమానా లేకుండా చెల్లించేందుకు జలమండలి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీం (ఓటీఎస్)ను అందుబాటులోకి తెచ్చింది. ఈ స్కీంకు గడువు దగ్గర పడింది. అక్టోబర్ 31వ తేదీతో గడువు ముగియనుంది. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని 11వ సబ్ డివిజన్‌లో ఓటీఎస్ కింద మొత్తం సుమారు 14 వేల మంది నల్లా వినియోగదారులను అర్హులుగా తేల్చారు. వీరందరి బకాయిలు సెప్టెంబర్ నాటికి రూ.19.6 కోట్లకు పైగా ఉన్నాయి. రాయితీ పథకంలో భాగంగా బిల్లులు చెల్లించేందుకు వీరంతా ముందుకొస్తే సుమారు రూ. 5.6 కోట్లకు పైగా భారం తప్పనుంది. అదే సమయంలో జలమండలికి రూ.14కోట్ల మేర ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఇప్పటి వరకు బకాయిలున్న ఆయా క్యాన్‌నంబర్లకు సమాచారం చేరవేశామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జలమండలి అధికారులు ప్రచారం చేస్తున్నారు.

ప్రాంతం	ఓటీఎస్‌కు అర్హులైన నల్లాదారులు	సెప్టెంబర్ నాటికి బకాయిలు (సుమారు రూ. కోట్లలో)
ఆటోనగర్	4,281	6.1
బీఎన్‌రెడ్డినగర్	1,103	0.83
కమలానగర్	1,440	1.5
ఎల్బీనగర్	1,385	1.8
మన్సూరాబాద్	1,665	3.6
నాగోలు	2,305	2.9
ఎన్‌జీఓకాలనీ	8,54	0.76
వనస్థలిపురం	1,498	2.0

గతంలో విజయవంతం..

ఎల్బీనగర్ సబ్ డివిజన్ 11లో మొత్తం 14,531 నల్లా కనెక్షన్లను ఓటీఎస్‌లో అర్హులుగా ప్రకటించారు. వీరిలో కొందరు నెలల తరబడి, మరి కొందరు ఏడాదికి పైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. నల్లా బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో జలమండలి వారికి జరిమానా విధించింది. దీంతోపాటు జరిమానాపై వడ్డీ కూడా పడుతుంది. జరిమానా, వడ్డీ కలిపి భారీగా బకాయిలు పేరుకుపోవడంతో నల్లాదారులకు ఆర్థికంగా భారంగా మారింది. దీంతో పెనాల్టీ, వడ్డీని చెల్లించనవసరం లేకుండా కేవలం అసలు బిల్లు మాత్రమే చెల్లించేలా జలమండలి గత కొన్నేళ్లుగా ఓటీఎస్‌ను ప్రకటిస్తోంది. ఎంతోమంది ఈ రాయితీని సద్వినియోగం చేసుకోవడంతో గతంలో ఈ పథకం విజయవంతమైంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా బకాయిలు భారీగా పేరుకుపోవడంతో మరోసారి ఓటీఎస్‌ను జలమండలి ప్రకటించింది. ఈనెల 31 వరకు గడువు విధించింది. దీంతో మరో వారం రోజులు మాత్రమే ఉండడంతో బకాయిదారులు పథకాన్ని వినియోగించుకోవాలని అధికారులు ముమ్మరంగా అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అర్హులు పథకాన్ని వినియోగించుకోవాలి:

ఈ నెల 31తో వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం గడువు ముగుస్తుంది. ఇప్పటికే అర్హులైన నల్లా వినియోగదారులను గుర్తించాం. వారు చెల్లించాల్సిన బిల్లులకు సంబంధించి సమాచారం అందించాం. ఈ పథకంలో జరిమానా, వడ్డీపై పూర్తి రాయితీ లభిస్తుంది. నల్లా బిల్లులు చెల్లించి జలమండలికి సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నాం.

– శ్రీనివాస్‌రెడ్డి, జలమండలి జీఎం

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య
ఎల్బీనగర్: 76759 19030
మలక్‌పేట: 80085 73284
హయత్‌నగర్: 98336 64897
కర్మన్‌ఘాట్: 94400 32872
బండ్లగూడ: 96034 78579
మూసారాంబాగ్: 79933 00559

ఎల్బీనగర్, కర్మన్‌ఘాట్, సైదాబాద్, న్యూస్‌టుడే:

? మన్సూరాబాద్‌లోని సౌత్ ఎండ్ పార్క్ కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. – రాఘవులు, సౌత్ ఎండ్ పార్క్ కాలనీ

✓ సిబ్బందిని పంపించి కుక్కలను పట్టుకొని తరలించేలా చర్యలు తీసుకుంటాం. – యాదగిరి, వెటర్నరీ అధికారి.

? హస్తినాపురం డివిజన్ టీకేఆర్ రోడ్డు నుంచి కస్తూరి కాలనీ మార్గంలో గ్రీన్‌హిల్స్ కాలనీ రోడ్డు ముందు చెత్తను పారబోస్తున్నారు. – బాలు నాయి, భూపేష్‌గుప్తానగర్

✓ సమస్య మా దృష్టిలో ఉంది. పరిశీలించి చెత్తను తరలించేందుకు చర్యలు చేపడతాం. – శంకర్, జవాన్

? సరూర్‌నగర్-గడ్డిఅన్నారం మార్గంలోని సైదాబాద్ పరిధి చింత చెట్టు పరిసరాల్లో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. – చంద్రారెడ్డి, సైదాబాద్

✓ రద్దీవేళల్లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. – అశోక్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, మలక్‌పేట

మెరుగైన సేవలందించి మన్ననలు పొందాలి


సదరన్ ట్రావెల్స్ శాఖను ప్రారంభిస్తున్న ఎంపీ రఘువీర్. చిత్రంలో ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌గుప్తా

దిల్‌సుఖ్‌నగర్: దశాబ్దాలుగా సేవలందిస్తూ వినియోగదారుల మన్ననలు పొందుతున్న సదరన్ ట్రావెల్స్ దిల్‌సుఖ్‌నగర్‌లో నూతన శాఖను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని నల్గొండ ఎంపీ రఘువీర్ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లో నూతన శాఖను గురువారం సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆలపాటితో కలిసి ఎంపీ రఘువీర్ ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ.. దేశీయ, విదేశీ ప్రయాణికులకు సదరన్ ట్రావెల్స్ చేరువైందని కొనియాడారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా నమ్మకమైన సేవలందిస్తున్నట్లు తెలిపారు. టూరిజం సంస్థ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, శ్రీదత్త విద్యాసంస్థల ఛైర్మన్ పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో కూల్చివేతలు.. పసుపు నీళ్లతో శుద్ధి


కూల్చివేసిన చోట పసుపునీటితో శుద్ధి చేస్తున్న విద్యార్థులు, స్థానికులు

బండ్లగూడ, న్యూస్‌టుడే: బండ్లగూడలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కేటాయించిన స్థలంలో నిర్మాణాల కూల్చివేత అన్యాయమంటూ వరుసగా మూడో రోజు విద్యార్థులు, స్థానికులు నిరసన చేపట్టారు. గురువారం ప్రస్తుత పాఠశాల నుంచి అజయ్‌నగర్, కృషినగర్ మీదుగా కూల్చివేతల వద్దకు ప్లకార్డులు ప్రదర్శిస్తు ర్యాలీ నిర్వహించారు. పవిత్రమైన విద్యాలయం కూల్చివేతలతో అపవిత్రమైనందున పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేశారు. తమ కోసం కేటాయించిన స్థలాన్ని దక్కించుకునే వరకు ఆందోళనలు చేపడతామన్నారు. విలువైన స్థలం చేజారుతుంటే.. సంబంధిత అధికారులు ఇప్పటివరకు వచ్చి మాట్లాడలేదని.. గ్రామ పెద్దలు విమర్శిస్తున్నారు. 25 ఏళ్లగా స్థల వివాదం తేల్చకపోవడంతో గ్రామ పాఠశాలకు భవనం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు వివాదం 36/3 సర్వే నంబరుకు చెందినందున, బడికి కేటాయించిన దాని ప్రకారం సర్వే నంబర్-36/6లోని ఒక ఎకర స్థలం రెవెన్యూ అధికారులు అప్పగిస్తే వెంటనే చందాలు వేసుకొని పాఠశాల నిర్మిస్తామన్నారు.

ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, న్యూస్‌టుడే: ఆయుర్వేద వైద్యంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ గడ్డిఅన్నారం సంయుక్త ఆధ్వర్యంలో ఆయుర్వేద దినోత్సవం పురస్కరించుకొని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, మెడికల్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.పి.ప్రసాద్ ప్రారంభించారు.

'ఇసుకలారీల అడ్డాలోని ఉచిత పార్కింగ్‌పై టెండర్లను సహించం'


లారీ యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: ఆటోనగర్ ఇసుకలారీల అడ్డాలోని ఉచిత పార్కింగ్ స్థలంలో ప్రభుత్వం రుసుం వసూలు చేసేందుకు కుట్ర చేస్తుందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆటోనగర్‌లో ఇసుకలారీల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఆటోనగర్‌లో ప్రస్తుతం ఉన్న పార్కింగ్ స్థలాన్ని టెండరు వేసి రుసుం వసూలు చేసేందుకు టీజీఐఐసీ సిద్ధమవుతుందని పలువురు ఆయన దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇసుకలారీల అడ్డా గతంలో ఆటోనగర్ చౌరస్తాలో ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్న ఉద్దేశంతో నాటి ప్రభుత్వం స్పందించి ఆటోనగర్‌లో ఉచితంగా విశాలమైన స్థలం కేటాయించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత పార్కింగ్‌కు.. టెండర్లు వేయాలని చూస్తుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అది జరగనివ్వమని అన్నారు. భారాస నేత క్యామమల్లేష్, కొప్పుల విఠల్‌రెడ్డి, జక్కిడి మల్లారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

పాత పోచంపల్లి రోడ్డు పునరుద్ధరణకు చర్యలు


క్రీడా అధికారితో కార్పొరేటర్ నర్సింహారెడ్డి, సభ్యులు

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: మన్సూరాబాద్ నుంచి పాత పోచంపల్లికి రోడ్డును పునరుద్ధరించేందుకు ఎంపీ ఈటల రాజేందర్ కృషి చేస్తున్నారని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మన్సూరాబాద్‌కు చెందిన పలువురు నేతలు, స్థానికులతో కలిసి ఆయన ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులతో ఎంపీ ఫోన్‌లో మాట్లాడినట్లు నర్సింహారెడ్డి తెలిపారు. అటవీశాఖ అధికారులు రోడ్డు పునరుద్ధరణ చర్యల కోసం నెల రోజులు సమయమివ్వాలని సూచించారు. క్రీడా వ్యవసాయ క్షేత్రంలో హెచ్ఎండీఏ రేడియల్ రోడ్డు ఉండగా.. అడ్డంగా గోడను నిర్మించారన్నారు. అనంతరం క్రీడా డైరెక్టర్ వినోద్‌కుమార్‌కు ప్రహరీ తొలగించేందుకు ఎన్‌వోసి ఇవ్వాలని వినతిపత్రం అందించారు. రోడ్డు పునరుద్ధరణకు సంబంధించి దిల్లీలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో చర్యలు తీసుకుంటానని ఈటల రాజేందర్ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో రోడ్డు పునరుద్ధరణ కమిటీ సభ్యులు కొప్పుల ఉపేందర్‌రెడ్డి, అశోకప్ప, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెను వ్యభిచార కూపంలోకి నెట్టిన తల్లికి జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టులు: కుమార్తెను బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి దింపిన మహిళకు న్యాయస్థానం జీవితఖైదుతో పాటు పలు సెక్షన్ల కింద కలిపి మొత్తం రూ.2,96,000 జరిమానా విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళ (35) భర్త చనిపోవడంతో ఇద్దరు కుమార్తెలతో కలిసి ఉండేది. డబ్బు కోసం ఆమె వ్యభిచార వృత్తి ఎంచుకుంది. ఆమె పెద్ద కుమార్తె(21) ప్రేమ వివాహం చేసుకొని భర్తతో కలిసి హయత్‌నగర్‌లో స్థిరపడింది. రెండో కుమార్తె(16)ను డబ్బుల కోసం వ్యభిచారం చేయాలని తల్లి బలవంతం బాలికను ఖమ్మంలోనే వ్యభిచారం నిర్వహించే కుక్కల ఆశ(25)కు విక్రయించింది. చెర నుంచి తప్పించుకున్న బాలిక హయత్‌నగర్‌లో ఉండే అక్క ఇంటికి చేరుకుంది. బాలిక తల్లి, ఆశ మరికొందరు కలిసి హయత్‌నగర్‌కు వచ్చి బాలికను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు వారిద్దరిపై కేసు నమోదు చేశారు. కేసు విచారించిన రంగారెడ్డిజిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి హరీశ..బాలిక తల్లికి శిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. బాధితురాలికి రూ.12లక్షలు పరిహారం మంజూరు చేశారు. మొదటి నిందితురాలు ఆశ కోర్టుకు రానందున బెయిలుకు వీల్లేని వారెంటు జారీ చేస్తూ విచారణను ఈనెల 28కి వాయిదా వేశారు.

సైదాబాద్‌లో 'సదర్' ఉత్సవాలు 1న


సదర్ సమ్మేళనం ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న మహేందర్ యాదవ్, సభ ప్రతినిధులు

సైదాబాద్, న్యూస్‌టుడే: నవంబర్ 1న సైదాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగే సదర్ సమ్మేళనానికి తరలిరావాలని అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మైల్కోల్ మహేందర్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం సైదాబాద్ జైల్ గార్డెన్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సైదాబాద్ సదర్ సమ్మేళన స్వాగత వేదిక ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. వచ్చే నెల ఒకటో తేదీన ఉత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మధుసూదన్ యాదవ్, మహేందర్ యాదవ్, శ్రీశైలం యాదవ్, సుధాకర్ యాదవ్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యువతిపై అత్యాచారం.. దోషికి 20ఏళ్ల కారాగారం

రంగారెడ్డి జిల్లా కోర్టులు: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం ఇరవై ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధించింది. అదనపు పీపీ పి.మంజులాదేవి కథనం ప్రకారం.. మొయినాబాద్ మండలం నాగిరెడ్డిగూడ గ్రామానికి చెందిన జినికుంట కాశీ విశ్వనాథ్ (37) ఓ యువతి (24)ని ప్రేమిస్తున్నట్లు వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం పెళ్లి చేసుకోవాలని పెద్దలు నిలదీయడంతో నిరాకరించాడు. ఈ మేరకు మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు తరలించి అభియోగ పత్రం దాఖలు చేశారు. కేసు విచారించిన జిల్లా 13వ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వాణి గురువారం తీర్పునిచ్చారు. బాధిత యువతికి న్యాయమూర్తి రూ.3లక్షలు పరిహారాన్ని మంజూరు చేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు.. ఇద్దరి మృతి

మహేశ్వరం, న్యూస్‌టుడే: అమీర్‌పేట- మన్‌సాన్‌పల్లి చౌరస్తా రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పులిమక్త గ్రామానికి చెందిన పొంగువాల లక్ష్మయ్య(60) అమీర్‌పేటలో ఇస్త్రీ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అమీర్‌పేట గ్రామానికి చెందిన మాదరమోని చంద్రయ్య(58) మేస్త్రీ. వీరిద్దరూ స్నేహితులు. అమీర్‌పేటలో ఓ వివాహ వేడుకకు వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. గురువారం రాత్రి వీరి వాహనాన్ని వెనక నుంచి ఓ కారు ఢీకొట్టింది. లక్ష్మయ్య అక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన చంద్రయ్యను శంషాబాద్ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహేశ్వరం ఎస్సై మధుసూదన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడో అంతస్తు నుంచి పడి కార్మికుడి దుర్మరణం

నాగోలు, న్యూస్‌టుడే: భవనం మూడో అంతస్తు నుంచి పడిన ఓ కార్మికుడు మృతిచెందిన సంఘటన ఎల్బీనగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. యూపీలోని గోరఖ్‌పూర్‌కు చెందిన గణేష్(19) పెయింటరు. నాలుగు రోజులక్రితం నగరానికి వచ్చాడు. అఖిలేష్, అజిత్, మంజు అనే తోటి కార్మికులతో కలిసి ఎల్బీనగర్ సమీపంలోని ఎల్‌పీటీ మార్కెట్ వెనక ఉన్న సిల్క్ టవర్‌లో పెయింటింగ్ పనికి కుదిరాడు. ఆ భవనం మూడో అంతస్తులోనే వారంతా తలదాచుకుంటున్నారు. మంగళవారం రాత్రి వారంతా మద్యం సేవించారు. రాత్రి 1గంటల సమయంలో అఖిలేష్ నిద్రలేచి చూస్తే గణేష్ కనిపించలేదు. కిందకి వెళ్లాడేమోనని తిరిగి నిద్రించాడు. బుధవారం ఉదయం నిద్రలేచి చూస్తే మొదటి అంతస్తులో పడిపోయి తీవ్రగాయాలతో ఉన్న గణేష్ కనిపించాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

చైతన్యపురి: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వృద్ధుడికి తీవ్రగాయాలైన సంఘటన చైతన్యపురి ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. జైపురికాలనీకి చెందిన కాళిదాస్ (68) భార్య రమాదేవి (65) చైతన్యపురిలో బుధవారం రాత్రి మెట్రోరైల్ దిగి ఠాణా ముందు నుంచి సర్వీస్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్నారు. అపసవ్య దిశలో కొత్తపేట కూడలి వైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం కాళిదాస్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు చికిత్స కోసం గచ్చిబౌలిలోని ఆసుపత్రికి తరలించారు. అయితే కాళిదాస్ బ్రెయిన్‌డెడ్ అయి.. పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారని బాధితుడి భార్య రమాదేవి చైతన్యపురి పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బండి బయట పెట్టారో.. మాయమే!



- పది నెలల్లో 75 ద్విచక్ర వాహనాలు చోరీ
- హయత్‌నగర్‌లో హడలెత్తిస్తున్న దొంగలు


ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు 23 వరకూ..

నమోదైన బైక్ చోరీ కేసులు	75
ఛేదించినవి	40
స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాల సంఖ్య	40

హయత్‌నగర్, న్యూస్‌టుడే: అసలే శివారు ప్రాంతం.. ఆపై దొంగలు రెచ్చిపోతున్నారు. హయత్‌నగర్ ఠాణా పరిధిలో ఆరుబయట ద్విచక్ర వాహనాలు నిలిపితే చాలు.. ఇక అంతే సంగతులన్నట్లు తయారైంది. బస్తీలు, కాలనీలు, రాత్రి, పగలు అనే తేడాలేకుండా వాహనాలను ఎత్తుకెళుతున్నారు. వరుసగా జరుగుతున్న ఘటనలతో స్థానికులు, వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. మరోవైపు క్రైం ఇన్‌స్పెక్టర్(డిటెక్టివ్ ఆఫీసర్) లేక నెలల తరబడిగా పోలీసు ఠాణాలో ఖాళీ కుర్చీ దర్శనమిస్తోంది.

ఇవీ ఘటనలు..

- హయత్‌నగర్‌లోని అయ్యప్పకాలనీకి చెందిన నితిన్ రోజుమాదిరిగా ఈనెల ఒకటిన రాత్రి 9.30 గంటలకు ఇంటి ముందు తన ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. మరసటి రోజు ఉదయం నిద్రలేచి బయటకొచ్చి చూసేసరికి బైకు కనిపించలేదు.
- కొత్తగూడెంకు చెందిన ఓ వ్యక్తి ఈనెల 19న మధ్యాహ్నం లక్ష్మారెడ్డిపాలెంలోని ఓ లాడ్జీ రూమ్ అద్దెకు తీసుకుని ఉన్నాడు. తన మోటార్‌సైకిల్‌ను స్థానికంగా పార్కింగ్ చేసి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం రూమ్ నుంచి వచ్చి చూస్తే ద్విచక్ర వాహనం కనిపించలేదు. అక్కడే ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు బైకును ఎత్తుకెళ్తున్న దృశ్యాలు నిక్షిప్తమయ్యాయి.
- హయత్‌నగర్‌లోని గరుడానగర్ కాలనీ వసుంధర ఎన్‌క్లేవ్ సమీపంలో ఓ యువతి ఈనెల 6న తన యాక్టీవా స్కూటర్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేసి పనిమీద కల్వకుర్తికి వెళ్లింది. తిరిగి సాయంత్రం వచ్చేసరికి పార్కింగ్ చేసిన వాహనం కనిపించలేదు.


ఠాణాలో ఖాళీగా ఉన్న డీఐ కుర్చీ

జల్సాలు, చోరీల కోసమేనా..

జల్సాల కోసం కొందరు, సరదాగా తిరిగేందుకు మరి కొందరు బైక్ చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. చోరీ చేసిన బైకులు అమ్మేసి వచ్చిన డబ్బుతో గంజాయి, ఇతర మత్తుకు బానిసలై జల్సాలు చేస్తున్నట్లు చెబుతున్నారు. క్రైం పోలీసులు ఇకనైనా దృష్టి సారించి వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

నగరంలో కొట్టేసి.. పల్లెలో అమ్మకాలు

నగరంలోని పలు ప్రాంతాల్లో చోరీచేసి ఎత్తుకెళ్లిన ద్విచక్ర వాహనాలను సొంత గ్రామాలు, పల్లెలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. దీంతో కేసుల ఛేదనకు ఇబ్బందులు తలెత్తుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. గ్రామాల్లో చలానాలు విధించడం, తనిఖీలు ఉండవు కాబట్టి దర్జాగా రోడ్లపై తిరిగేస్తున్నాయి.

ఆర్టీసీ ప్రగతిలో ఉద్యోగుల పాత్ర కీలకం


అవార్డులు పొందిన ఉద్యోగులతో అధికారులు

బండ్లగూడ, న్యూస్‌టుడే: ఆర్టీసీ బండ్లగూడ డిపోలో సెప్టెంబర్ నెలకు సంబంధించి ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డుల పంపిణీ జరిగింది. గురువారం డిపోలో జరిగిన కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశం ముఖ్య అతిథిగా హాజరై ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లకు, అత్యధిక ఆదాయం సాధించిన కండక్టర్లకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అధికారులు శాలిని, బాలయోగేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

హయత్‌నగర్: ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర ఎంతో కీలకమని డిప్యూటీ రీజినల్ మేనేజర్ సుచరిత అన్నారు. హయత్‌నగర్-1 డిపోలో అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు, ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లకు ఆమె నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. డీఎం విజయ్, సహాయ మేనేజర్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోండి


ట్రాఫిక్ ఏసీపీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్

గోల్కొండ, న్యూస్‌టుడే: కార్వాన్ నియోజకవర్గంలోని కూడళ్ల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మిని కోరారు. ఎమ్మెల్యే ఏసీపీని గురువారం కలిసి నియోజకవర్గంలోని ట్రాఫిక్ ఇబ్బందులపై చర్చించారు. కూడళ్లలో అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. పురానాపూల్, టప్పాచబుత్రా, టోలిచౌకి, నానల్‌నగర్ జంక్షన్‌లలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్
• చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

రూ.10 నాణేలు చట్టబద్ధమైనవి


నాణేలు అందజేస్తున్న ధారాసింగ్ నాయక్

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చలామణిలోకి వచ్చిన రూ.10 నాణేలు చట్టబద్ధమైనవని, వాటిపై అపోహలు, అనుమానాలు అవసరం లేదని, వ్యాపార లావాదేవీల్లో విరివిగా వినియోగించాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ధారాసింగ్ నాయక్ సూచించారు. కోఠి బ్యాంకుస్ట్రీట్‌లోని సెంట్రల్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో గురువారం నాణేల చలామణిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం వ్యాపారుల నుంచి నోట్లు తీసుకొని రూ.10 నాణేలు అందజేశారు. బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ రామకృష్ణన్, డీజీఎం సురేష్ (హైదరాబాద్), ఏజీఎంలు సత్యవాణి, శ్రావ్యప్రభ, కనక్‌రాజ్, హైదరబాద్ ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

న్యూస్‌టుడే, ఆసిఫ్‌నగర్, కార్వాన్, కంచన్‌బాగ్

? ఆసిఫ్‌నగర్ సెక్షన్ పరిధిలోని పీర్‌పాషా కమాన్, రవీంద్రనగర్, అంగూర్‌బౌలి, సైతాన్‌గల్లీలో తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీనికితోడు లోవోల్టేజీ సమస్య వేధిస్తోంది.
– కాలనీవాసులు

✓ విద్యుత్తు మీటర్ల వారీగా సర్వే చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. అంతరాయం కలిగినప్పుడు మరమ్మతులు చేస్తున్నాం.
– సత్యనారాయణ, ఏఈ, ఆసిఫ్‌నగర్



? ఆలపాటినగర్, జీవన్‌కల్యాణ్‌నగర్, మురాద్‌నగర్ ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదు. మరికొన్ని చోట్ల చెట్లకొమ్మలు అడ్డుగా ఉండటంతో వెలుతురు కిందకి ప్రసరించడం లేదు.
– రాధిక, మురాద్‌నగర్

✓ చెట్ల కొమ్మలు తొలగిస్తాం. వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
– ముషారఫ్, ఏఈ

? రియాసత్‌నగర్ నుంచి సంతోష్‌నగర్‌కు వెళ్లే అంతర్గత మార్గంలో వ్యర్థాలు పేరుకుపోయాయి.
– ముబషీర్, రియాసత్‌నగర్

✓ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించి చర్యలు తీసుకుంటాం.
- సురేందర్, డీసీ, చాంద్రాయణగుట్ట

ఈ నిర్లక్ష్యాన్ని ఏమనాలా?

న్యూస్‌టుడే, గోషామహల్

గోషామహల్-దారుస్సలాం అంతర్రాష్ట్ర రోడ్డులో దశాబ్దాల క్రితం భారీ మురుగు నాలా నిర్మించారు. ఈ పురాతన నాలా ఏడాదిలో వేర్వేరు ప్రాంతాల్లో మూడు సార్లు కుప్పకూలింది. వ్యాపారులు, వాహనదారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి.


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్

ఎక్కడి నుంచి ఎక్కడికి..

మెహిదీపట్నం మొదలు ఆసిఫ్‌నగర్, మల్లేపల్లి, అఫ్జల్‌సాగర్, ఆగాపుర, దారుస్సలాం, గోషామహల్, చాక్నవాడీ, పోలీస్ క్వార్టర్స్, తోప్‌ఖానా మజీద్, బేగంబజార్ పాత పోలీస్‌స్టేషన్, ఉస్మాన్‌గంజ్, గౌలిగూడ గురుద్వారా మీదుగా మూసీ వరకు ఈ నాలా ఉంది. ఇది నిజాం కాలం నుంచి కొనసాగుతూ వస్తోంది. దారుస్సలాం జంక్షన్ నుంచి గోషామహల్ రోడ్డు దాటుతూ కుడివైపున చాక్నవాడీ వైపు మళ్లిన ఈ నాలా సుమారు 500 మీటర్ల వరకు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంది.


చాక్నవాడీలో కూలిన నాలా ఇదే

గోషామహల్‌లో మూడుసార్లు కుప్పకూలిన పైభాగం

ప్రమాదం జరిగినప్పుడే హడావుడి

చాక్నవాడీ నాలాకు సమాంతరంగా రెండు నాలాలు ఉన్నాయి. గతంలో చాక్నవాడీలో పైభాగం కూలి నాలాలో పడడంతో వాహనాలు, కూరగాయల బండ్లు అందులో పడిపోయాయి. ఆస్తి నష్టంతో పాటు పలువురికి గాయాలు అయ్యాయి. అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నిధులు మంజూరు చేశారు. నిర్మాణం పూర్తి కావడానికి తొమ్మిది నెలలు పట్టింది. జులై 28న ఇదే రోడ్డుపై ఓ భారీ వాహనం పల్టీ కొట్టింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే తేరుకున్న అధికారులు క్రేన్ల సాయంతో దాన్ని తొలగించారు. అక్కడ గుంతను మట్టితో తాత్కాలికంగా పూడ్చి చేతులు దులుపుకొన్నారు. బుధవారం తెల్లవారుజాము గోషామహల్ రోడ్డులోని చాక్నవాడీ నాలా పైభాగం కుప్పకూలింది. నాలాను పునర్ నిర్మించడమే సమస్యకు పరిష్కారమని పలువురు చెబుతున్నారు.

భారీ వాహనాల రాకపోకలు

గోషామహల్ ప్రాంతంలో రాత్రిపూట భారీ వాహనాల్లో సరకులు తీసుకురావడం కూడా నాలా కూలిపోవడానికి కారణమని స్థానికులు వాపోతున్నారు. ఇళ్ల మధ్య గోడౌన్లు ఏర్పాటు చేయడంతో రోజూ వందలకొద్దీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్లు దెబ్బతింటున్నాయి. ప్లైవుడ్ గోడౌన్లను ఇక్కడి నుంచి శివారు ప్రాంతాలకు తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నాలా ఆక్రమణలపై 'హైడ్రా' దృష్టి సారించాలని కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

వంకాయ కిలో రూ.40

మెహిదీపట్నం: రైతుబజార్‌లో (బుధవారం నాటి ధరలు, కిలో రూ.లో) టమాటా 35, వంకాయ 40, బెండకాయ 65, పచ్చిమిర్చి 35, కాకరకాయ 38, బీరకాయ 55, క్యాబేజీ 23, బీన్స్ 105, క్యారెట్ 45, దొండ 35, చిక్కుడు 80, గోకరకాయ 50, బీట్‌రూట్ 31, క్యాప్సికం 70, ఆలుగడ్డ 37, కీర 24, దోస 35, సొరకాయ 17, పొట్లకాయ 13, ఉల్లిగడ్డ 45, చామగడ్డ 40.

తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడికి సన్మానం



నారాయణగూడ: తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావును చిత్రకారుడు డి.అనంతయ్య గురువారం సన్మానించారు. చిత్రకారులను ఆదుకోవాలని కోరారు.

హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు

నారాయణగూడ: ముత్యాలమ్మ ఆలయం వద్ద లాఠీచార్జికి గురైన బాధితులు గురువారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. అకారణంగా కొందరు పోలీసులు తమపై లాఠీచార్జి చేశారని బాధితులు వెంకటేష్, సాయిలు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి చేసిన వారిని సస్పెండ్ చేయాలన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులివ్వండి

కార్వాన్: నియోజకవర్గంలోని ఆలయాలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్వాన్ ఇన్‌ఛార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్‌హాజ్రి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు గురువారం విన్నవించారు. అందుకు రూ.50 లక్షలు కేటాయించాలన్నారు.

కొనసాగుతున్న గ్రూప్-I మెయిన్స్ పరీక్షలు

సుల్తాన్‌బజార్: కోఠిలోని తెలంగాణ మహిళా వర్సిటీ, జాంబాగ్‌లోని వివేకవర్ధిని పరీక్షా కేంద్రాల్లో గురువారం గ్రూప్-1 మెయిన్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. టీఎంవీ కేంద్రం వింగ్-ఏలో 792 మందికి 726, వింగ్-బీలో 864 మందికి 777, వీవీ కళాశాల కేంద్రంలో 528 మంది అభ్యర్థులకు 446 మంది పరీక్షకు హాజరయ్యారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

కార్వాన్: కార్వాన్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు కార్పొరేటర్ స్వామియాదవ్, ఏఎంహెచ్‌ఓ మహ్మద్ ఇర్షద్ ఇక్బాల్ తెలిపారు. మూడు వారాల పాటు నిర్వహించనున్న చెత్త తొలగింపు కార్యక్రమాన్ని గురువారం కార్వాన్‌లో ప్రారంభించారు. ఏఈ జె.శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

బాలికలకు గ్లాసుల వితరణ

చాంద్రాయణగుట్ట: కాంగ్రెస్ నేత ఎస్.పాండురంగారావు వర్ధంతిని పురస్కరించుకుని మిత్రా యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం రాజన్నబావి ప్రాంతంలోని రెయిన్‌బో ఆశ్రమంలోని అనాథ బాలికలకు గ్లాసులు, బిస్కట్లు పంపిణీ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి, పాండురంగారావు తనయుడు ఎస్.పి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రికెట్ టోర్నీ

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: డీఆర్డీవో టౌన్‌షిప్‌లో సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నీ రసవత్తరంగా సాగుతోంది. శుక్రవారం ఏఎస్‌ఎల్ (తెలంగాణ), పీఎక్స్‌ఈ (ఒడిశా) జట్ల మధ్య ఫైనల్ జరగనుంది. గురువారం సెమీ-ఫైనల్స్‌లో ఆర్సీఐ (తెలంగాణ), పీఎక్స్‌ఈ (ఒడిశా) మధ్య, మరోమ్యాచ్ ఏఎస్‌ఎల్ (తెలంగాణ), డీఆర్డీఎల్ మధ్య జరిగాయి. ఏఎస్‌ఎల్‌కు చెందిన కమలేశ్ సాహు 3 ఓవర్లలో 4 వికెట్లు తీసుకున్నాడు.

వచన కవిత అధ్యయన శిబిరం వచ్చే నెల 24

నారాయణగూడ: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో వచ్చే నెల 24న వచన కవిత్వ అధ్యయన శిబిరం నిర్వహించనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. కవులు ఇప్పటివరకు వెలువరించిన కవితల వివరాలతో పాటు ఒక కవితను చరవాణి 9603727234కి వాట్సాప్ చేయాలని సూచించారు.

'నుమాయిష్'లో ఎస్సీలకు స్టాళ్లు కేటాయించాలి


ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోడ్ సంస్థ ప్రతినిధులు

జియాగూడ, న్యూస్‌టుడే: అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)లో భాగ్యరెడ్డివర్మ పేరిట పెవిలియన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ కాన్ఫడరేషన్ ఆఫ్ ఆర్గనైజ్డ్ దళిత ఎంటర్‌ప్రెన్యూర్స్ (కోడ్) రాష్ట్ర అధ్యక్షుడు సి.ఆర్.మునిస్వామి, అఖిల భారత అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వినయ్‌కుమార్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం వారు సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నుమాయిష్‌లో దళిత యువత, పారిశ్రామికవేత్తలకు ఉచితంగా స్టాళ్లు కేటాయించాలని కోరారు. దీనికి స్పీకర్ సానుకూలంగా స్పందించి మంత్రి శ్రీధర్‌బాబుకు లేఖ రాశారని వారు వెల్లడించారు. కోడ్ ఉపాధ్యక్షుడు వేదన్‌కుమార్, మహిళా పారిశ్రామికవేత్తల అధ్యక్షురాలు రత్నం పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్టు చేశామని బెదిరించి.. రూ.24 లక్షల మోసం



నారాయణగూడ, న్యూస్‌టుడే: బెదిరించి నగదు కాజేశారని బాధితుడు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన పరిశోధకుడి(74)కి 'ట్రాయ్' అధికారులమని ఫోన్ చేశారు. మనీలాండరింగ్‌లో మీరు నిందితుడిగా ఉన్నారని, ముంబయి సీబీఐ అధికారులు మాట్లాడతారని ఫోన్ కలిపాడు. అవతలి వ్యక్తి మీ ఆధార్ కార్డు ఉపయోగించి ముంబయిలో బ్యాంకు ఖాతా తెరిచారని.. రూ.కోట్లు లావాదేవీలు జరిగాయన్నాడు. ఇది మనీలాండరింగ్‌లో భాగమని హెచ్చరించాడు. మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేశామని బెదిరించాడు. ఇంటి నుంచి బయటకు రావడానికి, ఇతరులతో మాట్లాడటానికి వీలులేదని చెప్పాడు. కొద్దిసేపటికే బాధితుడికి వీడియో కాల్ వచ్చింది. అందులో పోలీసు దుస్తుల్లో ఓ వ్యక్తి కనిపించాడు. అరెస్ట్ వారెంట్ చూపించాడు. మిమ్మల్ని మీరు కాపాడుకోవాలంటే జరిగిన మోసంలో 25 శాతం అంటే కనీసం రూ.24 లక్షలు సీబీఐ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుందన్నాడు. కేసు దర్యాప్తు పూర్తి కాగానే తిరిగి మీ ఖాతాలో జమ చేస్తామన్నాడు. నిజమని నమ్మిన ఆయన నేరస్థుడు చెప్పిన ఖాతాకు నగదు బదిలీ చేశారు. ఆ తరువాత మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.

రుణం ఇప్పిస్తామని.. రూ.3.17 లక్షలు టోకరా

నారాయణగూడ, న్యూస్‌టుడే: వ్యాపారానికి రుణం ఇప్పిస్తామని నమ్మించి రూ.3.17 లక్షలు మోసం చేశారంటూ బాధితుడు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో గురువారం ఫిర్యాదు చేశారు.

గంజాయి తాగుతున్న నలుగురికి జైలు

గోల్కొండ: బహిరంగ ప్రదేశంలో గంజాయి తాగుతున్న గోల్కొండకు చెందిన మహ్మద్ అస్జద్(20), మహ్మద్ కరీమ్(20), కమ్రుల్ అన్సారీ(20), అర్షద్ అన్సారీ(25)లకు 12వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ రాజేంద్ర ప్రసాద్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

న్యూసెన్స్.. ఇద్దరు కటకటాలపాలు

ఆసిఫ్‌నగర్: మల్లేపల్లి ప్రాంతానికి చెందిన అబ్దుల్ రహమాన్(25), మహ్మద్ షా నవాజ్(22) సమోసా గ్రౌండ్ ప్రాంతంలో రోజూ న్యూసెన్సు సృష్టిస్తున్నారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు వారిని నాంపల్లిలోని 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చారు. నిందితులకు 15 రోజుల జైలు శిక్ష విధిస్తు న్యాయమూర్తి ఎం.స్వామి గురువారం తీర్పు ఇచ్చినట్లు హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదేశ్వర్ చెప్పారు.

నకిలీ పాన్ మసాలాల తయారీ

చాంద్రాయణగుట్ట న్యూస్‌టుడే: నకిలీ పాన్‌మసాలాలు, జర్దా, పొగాకు ఉత్పత్తులు తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరిని ఫలక్‌నుమా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఫాతిమానగర్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్(32), ఖాజీపురకు చెందిన మహ్మద్ జుబైర్(29)లు రహమత్‌నగర్ ప్రాంతంలో నకిలీ పాన్‌మసాలాలు, జర్దా పొగాకు ఉత్పత్తులు తయారు చేసి విక్రయిస్తున్నారు. దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫలక్‌నుమా పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేసి రూ.2.10లక్షల విలువైన వివిధ బ్రాండ్ల పేరిట ఉన్న నకిలీ పాన్‌మసాలాలు, జర్దాను, ప్యాకింగ్ మిషన్‌ను, మిక్సింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జంతు వ్యర్థాలతో నూనె..

ఆసిఫ్‌నగర్: జంతు వ్యర్థాలతో నూనె, నెయ్యి తయారు చేస్తున్న వ్యక్తిని హబీబ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాంబాబు కథనం ప్రకారం. . సుభాన్‌పురాలోని ఓ ఇంట్లో జంతు వ్యర్థాలతో నూనె, నెయ్యి తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఎస్సై మోనయ్య, క్రైం పోలీసుల బృందం దాడి చేశారు. పోలీసులను చూసి తయారీదారుడు మహ్మద్ ఫజల్ మదాని(36) పారిపోయేందుకు యత్నించగా.. పోలీసులు నిందితుడిని పట్టుకొని అరెస్టు చేశారు. ఎనిమిది డబ్బాల నూనె స్వాధీనం చేసుకున్నారు.

వాహనాల సైరన్లు తొలగింపు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ చెందిన ఎమ్మెల్యే, మరో మాజీ ఎమ్మెల్యేలకు సంబంధించిన వాహనాలకు సైరన్లను గురువారం జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. తనిఖీల్లో 22 వాహనాలకు సైరన్లు తొలగించారు.

శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం


మంజూరీ పత్రం అందజేస్తున్న నగేష్

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ శివాజీనగర్‌కు చెందిన పెయింటర్ పి.సురేష్‌రెడ్డి కొన్నాళ్ల క్రితం పనిచేస్తూ కింద పడిపోగా వెన్నెముక దగ్గర నరాలు దెబ్బతిన్నాయి. డాక్టర్లు శస్త్రచికిత్స చేయాలని చెప్పారు. అందుకు తగినంత డబ్బులేక పోవడంతో కొంతకాలంగా సురేష్‌రెడ్డి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ విషయాన్ని చాంద్రాయణగుట్ట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బోయ నగేష్‌కు చెప్పడంతో ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన మంత్రి రూ.2లక్షల ఆర్థికసాయం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన ఎల్ఓసీని బాధితుడికి గురువారం నగేష్ అందజేశారు.

పారదర్శకంగానే పదోన్నతులు: అదనపు కమిషనర్

ఈనాడు, హైదరాబాద్: దేవాదాయశాఖలో ఇటీవల చేపట్టిన ఈవోల పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని దేవాదాయశాఖ అదనపు కమిషనర్ కె.జ్యోతి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగదు లావాదేవీలు జరగలేదన్నారు. సర్వీసు నిబంధనల ప్రకారమే పదోన్నతుల ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు.

సుల్తాన్‌బజార్: దేవాదాయశాఖలో ఇటీవల జరిగిన ఈవోల పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని శాఖ అర్చక, ఉద్యోగ, దేవాదాయశాఖ కార్యనిర్వాహణ అధికారుల సంఘాలు గురువారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నాయి. నియామకాల్లో అవినీతి జరిగిందంటూ వచ్చిన ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నాయి.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వ్యతిరేకించడం తగదు


బషీర్‌బాగ్‌లో మాట్లాడుతున్న కరుణాకర్ రెడ్డి

బషీర్‌బాగ్: పార్లమెంటులో ఆమోదించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై కొంతమంది ఆక్రోశం వెళ్లగక్కడం మంచి పద్ధతి కాదని, రిజర్వేషన్లను వ్యతిరేకించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఓసీ సంక్షేమ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన బషీర్‌బాగ్‌లో విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఓసీలు విద్యా, ఉద్యోగ రంగాల్లో అనేక అవకాశాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఓసీలు ఏనాడు రిజర్వేషన్లను వ్యతిరేకించలేదని గుర్తు చేశారు. ఇతర సామాజిక వర్గాలకు నష్టం కలగకుండా అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లను కల్పిస్తే ఎందుకు జీర్ణించుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. రిజర్వేషన్లను సుప్రీంకోర్టు సమర్థించిందని గుర్తు చేశారు.

చార్మినార్‌లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి

చార్మినార్, న్యూస్‌టుడే: దీపావళి ప్రత్యేక పూజలకు చార్మినార్ భాగ్యలక్ష్మీ మాత ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని చార్మినార్ జడ్సీ వెంకన్నకు ఆలయ ట్రస్టీ సూర్యప్రకాశ్ శంభు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యవర్గ సభ్యుడు ప్యారసాని వెంకటేశ్ గురువారం వినతిపత్రం అందజేశారు. పూజల్లో పాల్గొనాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఉత్సవాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని డీఈ శ్రీధర్ పేర్కొన్నారు.

టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి

న్యూస్‌టుడే, చాంద్రాయణగుట్ట, చార్మినార్

రేపటి వరకు దరఖాస్తుల స్వీకరణ

దీపావళి వచ్చిందంటే బాణసంచాకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. పండగ రోజు చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ఆనందంతో వాటిని కాలుస్తుంటారు. కాకరవత్తుల వెలుగులు, ఆకాశంలో దూసుకుపోయే తారాజువ్వలు.. నేలపై తిరిగే భూచక్రాలు.. టపాసుల మోతలతో సందడి నెలకొంటుంది. ఆనందంతో జరుపుకొనే పండగలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఇప్పటికే పాతనగరంలో పోలీసులు ఉప్పుగూడ, పేట్లబురుజు ప్రాంతాల్లో టపాసుల స్టాళ్లు, దుకాణాల నిర్వాహకులతో సమావేశాలు ఏర్పాటు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

నిబంధనలు పాటించాలి

● టపాసుల స్టాళ్లను ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేయడానికి నిబంధనలు అనుమతించవు. స్టాళ్ల ఏర్పాటుకు నిర్వాహకులు అగ్నిమాపక శాఖ, పోలీసుల అనుమతి విధిగా తీసుకోవాలి.

● బహిరంగ ప్రదేశాలు, ఇళ్లలో, ఇరుకు గదుల్లో కాకుండా ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేయాలి.

● ఆసక్తి ఉన్న వ్యాపారుల నుంచి పోలీసు శాఖ ఈ నెల 26 వరకు దరఖాస్తులు స్వీకరిస్తోంది. ● స్టాల్ ఏర్పాటుకు డివిజనల్ ఫైర్ ఆఫీసర్ నుంచి ఎన్‌ఓసీ, ప్రభుత్వ స్థలం అయితే జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతి పత్రం, ప్రైవేటు స్థలం అయితే స్థల యజమాని నుంచి ఎన్‌ఓసీ, పక్కవారి నుంచి ఎన్‌ఓసీ, దుకాణం ప్లాన్ బ్లూప్రింట్, గతంలో జారీ చేసిన లైసెన్స్, ఎస్‌బీఐ ట్రెజరీలో రూ.600 చెల్లించిన రసీదు జత చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అందిన దరఖాస్తులను పరిశీలించి, డీసీపీ తాత్కాలిక లైసెన్స్ మంజూరు చేస్తారు.

గోదాముల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు

టపాసుల స్టాళ్లు, దుకాణాలు గోదాముల వద్ద అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆయా ప్రాంతాల్లో అగ్నిమాపక సాధనలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు సిగరెట్లు తాగడం, దీపాలు వెలిగించడం, టపాసులు కాల్చడం చేయరాదు. వీలయినంత మేరకు క్రీడామైదానాలు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.

పరిశీలించి.. లైసెన్స్‌లు జారీ



టపాసుల స్టాళ్ల ఏర్పాటుకు నిర్వాహకులు విధిగా తాత్కాలిక అనుమతి తీసుకోవాలి. అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి, లైసెన్స్ మంజూరు చేస్తాం. అనుమతి లేకుండా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. గతేడాది 26 టపాసుల స్టాళ్లకు అనుమతి ఇచ్చాం. ఈ సారి ఇప్పటివరకు 10 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటి పరిశీలన కొనసాగుతుంది.
- స్నేహామెహ్రా, డీసీపీ, దక్షిణ మండలం

పోగొట్టుకున్న రూ.11.55 లక్షలు అందజేత

నారాయణగూడ, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ఓ వ్యక్తి అనధికార లావాదేవీ కారణంగా రూ.11.55 లక్షలు నష్టపోయాడు. హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ ఠాణాకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. సైబర్ పోలీసులు వెంటనే బాధితుడితో మాట్లాడి, బ్యాంకు అధికారులతో మాట్లాడాలని చెప్పారు. ఈలోగా దర్యాప్తు మొదలుపెట్టిన సైబర్ పోలీసులు బాధితుడి బ్యాంకు ఖాతా నుంచి వెళ్లిన నగదును ఫ్రీజింగ్ చేయించారు. కోర్టు ఉత్తర్వు అవసరం లేకుండా బాధితుడి ఖాతాకు జమ చేయించారు. కానిస్టేబుళ్లు శ్రీకాంత్, జావీద్, క్రాంతిరెడ్డి, భార్గవిలను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

గతుకుల దారి



కంచన్‌బాగ్‌లోని డీఎంఆర్ఎల్ కూడలి నుంచి సంతోష్‌నగర్ వైపునకు వెళ్లే దారి అధ్వానంగా ఉంది. బల్దియా, సీఆర్ఎంపీ మధ్య సమన్వయ లోపంతో మరమ్మతులు సకాలంలో చేపట్టడం లేదు. – న్యూస్‌టుడే, కంచన్‌బాగ్

ఫుడ్ కోర్టు వ్యాపారాలకు ఇళ్లు కూల్చొద్దు: భాజపా


బాధితులతో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

చార్మినార్, న్యూస్‌టుడే: ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేసి డబ్బులు దండుకోవడానికి మూసీ పరివాహక ప్రాంతాల నివాసాలను కూల్చొద్దని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పేదల నివాసాలు నేలమట్టం చేయడానికి యత్నిస్తే పార్టీ అడ్డుకుంటుందన్నారు. గురువారం చార్మినార్ నియోజకవర్గంలోని పురానాపూల్ దర్వాజా, పేట్లబుర్జు, పూల్‌బాగ్ మూసీ పరివాహక ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన పేరిట కాంగ్రెస్ డబ్బులు దండుకోవడానికి యత్నిస్తోందని ఆరోపించారు. ఆ డబ్బులను మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లో ఎన్నికల ఖర్చులకు మళ్లించడానికి ఎత్తుగడ వేసిందని విమర్శించారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ధర్నాను విజయవంతం చేయాలన్నారు. బాధితులతో మాట్లాడారు. గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్, ప్రధాన కార్యదర్శి ఉమామహేంద్ర, ఉపాధ్యక్షుడు ఎం.కుమార్, కార్పొరేటరు శంకర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్, చార్మినార్ భాజపా కన్వీనర్ ప్రవీణ్, మాజీ కన్వీనర్ కె.సురేందర్, వాల్మీకి సమాజ్ అధ్యక్షుడు కిషన్‌లాల్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నిత్యాపారిక్, నేతలు ఉమేశ్‌సింగానియా, మేఘారాణి అగర్వాల్, కునాల్‌రావు, బల్వీందర్‌సింగ్ పాల్గొన్నారు.

చెత్తకుప్పల తొలగింపు



స్పందనకు వందనం

చాదర్‌ఘాట్ నుంచి కోఠి వెళ్లే దారి, బేగంబజార్ ఫీల్‌ఖానా కూడలిలో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. దుర్వాసనతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై 'సగం దారి.. వ్యర్థాలు చేరి' శీర్షికతో గురువారం 'ఈనాడు'లో చిత్ర వార్త ప్రచురితమైంది. జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించి కార్మికులతో శుభ్రం చేయించారు.

మ్యాన్‌హోళ్లు ధ్వంసం



మెహిదీపట్నం సర్కిల్ పరిధిలోని ఆసిఫ్‌నగర్ కుమ్మరివాడ-లోద బైటక్ దారిలో అధికారులు ఏడాది క్రితం పాత రహదారిని పూర్తిగా తొలగించి వీడీసీసీ రోడ్డు నిర్మించారు. నిర్మాణం పూర్తి అయినా ధ్వంసమైన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టలేదు. అవి నాలాలో కూరుకుపోతూ ప్రమాదకరంగా మారాయి. దాదాపు 100 మీటర్ల దూరంలో 30 ఉన్నాయి. వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే,

రాజేంద్రనగర్
•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

చెత్త శుద్ధి యూనిట్‌ను సందర్శించిన అధికారులు


నార్సింగి చెత్త శుద్ధి కేంద్రంలో పరిశీలిస్తున్న అధికారులు

నార్సింగి, న్యూస్‌టుడే: నార్సింగి మున్సిపాలిటీలోని చెత్త శుద్ధి యూనిట్‌ను 8 మున్సిపాలిటీలకు చెందిన కమిషనర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు గురువారం సందర్శించారు. తడి, పొడి చెత్త నుంచి హానికారక చెత్తను ఎలా వేరు చేస్తారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. సీడీఎంఏ నిర్దేశాల మేరకు చెత్త ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించిన అధికారులకు నార్సింగి మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగం అధికారులు చెత్త వేరుచేసే పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నార్సింగి డీఈ నరేష్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, మేనేజరు యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటలు ఆక్రమిస్తే కఠిన చర్యలు


ఆక్రమణలు తొలగిస్తున్న పొక్లెయిన్

కాటేదాన్: కాలిబాటలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ హెచ్చరించారు. మైలార్‌దేవుపల్లి డివిజన్ టీఎన్జీవోస్ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను రాజేంద్రనగర్ మండలాధికారులు ఒక్కొక్కటిగా తొలగిస్తుండగా ఫుట్‌ఫాత్‌లను ఆక్రమిస్తున్న వారిపై రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. మధుబన్ కాలనీలో ప్రధాన రహదారులు, కూడలి ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై అక్రమంగా వెలసిన 40 నిర్మాణాలను గురువారం తొలగించారు. ఈ తొలగింపులో సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

లివర్-ఫైబ్రో స్కాన్ వైద్య పరీక్షలు ఉచితం నేడు

మణికొండ: మణికొండ డా.ప్రభు లైఫ్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్స్, నర్సింగ్‌హోమ్‌లో శుక్రవారం లివర్-ఫైబ్రో స్కాన్ పరీక్షను ఉచితంగా చేస్తామని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు నెల చివరి వరకు షుగర్ పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సామాజిక తనిఖీపై ప్రజా వేదిక నేడు

కేశంపేట: ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీపై శుక్రవారం ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. కేశంపేటలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

పూర్వ విద్యార్థి.. అక్షర స్ఫూర్తి

◆ ఎమ్మెల్యే చొరవతో భారీగా విరాళాలు
◆ చదువుకున్న కళాశాలకు కొత్త సొబగులు

షాద్‌నగర్, న్యూస్‌టుడే

శాసనసభ్యుడి సంకల్పం.. పూర్వ విద్యార్థుల కృతజ్ఞతాభావం.. ఫలితంగా శిథిలావస్థలో ఉన్న కళాశాలకు కొత్త సొబగులు సమకూరనున్నాయి. షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అత్యాధునిక సదుపాయాలతో రూపుదిద్దుకోనుంది. ఇటీవలే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూర్వవిద్యార్థులతో కలిసి భూమిపూజకు శ్రీకారం చుట్టారు. ఈ కళాశాల చరిత్రను పరిశీలిస్తే..


షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

షాద్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల 1969లో ప్రారంభమైంది. స్వాతంత్ర సమరయోధుడు ఎన్‌కే రంగారావు, కాంగ్రెస్ సీనియర్‌నేత నాగిళ్ల గోపాల్‌గుప్తా తదితరుల చొరవతో మార్కెట్‌లో రైతుల నుంచి పావలా చొప్పున వసూలు చేసి నాడు ఈ కళాశాల నిర్మాణానికి పూనుకున్నారు. అప్పటి నుంచీ ఇప్పటివరకు ఎందరో ప్రముఖులు ఈ కళాశాలలో చదువుకున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా 10 కి.మీ దూరంలోని తన స్వగ్రామం నుంచి నడుచుకుంటూ వచ్చి ఇక్కడ విద్యనభ్యసించారు. కాలక్రమేణా ప్రైవేటు కళాశాలల జోరు పెరగడంతో ఈ కళాశాల కేవలం గ్రామీణ ప్రాంతాల, పేద విద్యార్థులకే పరిమితమైంది. సదుపాయాల గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరింది. తరగతి గదుల్లో పెచ్చులూడిపోవడం, సరైన పరికరాలు లేకపోవడం, తలుపులు, కిటికీలు విరిగిపోవడం, శౌచాలయాలు, తాగునీటి సమస్యలు, గదులు సరిపోకపోవడం వంటి సమస్యలతో దయనీయ స్థితికి చేరుకుంది. దీనిని బాగు చేయాలని విద్యార్థుల నుంచి వినతులు పెరిగాయి.

ఈ క్రమంలోనే కళాశాల నిర్మాణం అత్యవసరంగా చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ద్వారా వెళ్తే సమయం పట్టే అవకాశం ఉండడంతో స్థానిక శాసనసభ్యుడైన పూర్వ విద్యార్థి వీర్లపల్లి శంకర్ ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చారు. పూర్వ విద్యార్థులు, ప్రముఖుల సహకారంతో కళాశాల భవన నిర్మాణం చేపట్టాలని సంకల్పించారు. ఇందులో భాగంగా ఆగస్టు 15న కళాశాలలో సమావేశం ఏర్పాటు చేసి తన ఉద్దేశాన్ని ప్రకటించడంతో అక్కడికక్కడే రూ.25 లక్షలు పోగయ్యాయి. తర్వాతి కాలంలో రూ.కోటి వరకు చేతికి రావడం, మరో రూ.కోటికి పైగా హామీలు ఉండడంతో ధైర్యంగా భూమి పూజకు ఉపక్రమించారు. రూ.5 నుంచి 10 కోట్ల వ్యయంతో అత్యాధునికంగా కళాశాల నిర్మాణం చేపట్టబోతున్నారు. మొత్తానికి పూర్వవిద్యార్థుల కృషితో ఈ కళాశాల పునర్నిర్మాణం వైపు ముందడుగు వేయడం విద్యార్థులను సంతోషపెడుతోంది.

పునర్నిర్మాణం నా బాధ్యత..
– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే



కళాశాల నిర్మాణం కోసం పూర్వ విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, కాశీనాథ్‌రెడ్డి, సోమిరెడ్డి లాంటి వారు రూ.లక్షల్లో విరాళం అందించారు. అనుకున్న ప్రకారం రాజీ లేకుండా అత్యాధునికంగా నిర్మిస్తాం. అవసరమైతే సొంతంగా నిధులు సమకూర్చి వచ్చే విద్యాసంవత్సరం నాటికి సిద్ధం చేయిస్తా.

చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి పూర్తి చేయాలని వినతి


కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: షాద్‌నగర్ పురపాలిక పరిధిలోని చటాన్‌పల్లి వద్ద రైల్వేవంతెన పనులను ప్రారంభించి పూర్తి చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం రైల్ నిలయంలో నిర్వహించిన సమావేశంలో కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో ఏర్పడుతున్న ఇబ్బందులను వివరించానన్నారు. షాద్‌నగర్ నుంచి ఒక వైపు బెంగళూరు జాతీయ రహదారికి మరో వైపు కొత్తపేటకు వెళ్లేందుకు వంతెనను ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే కేంద్ర మంత్రి స్పందించి రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులు వస్తే పనులు ప్రారంభిస్తామని జీఎం చెప్పారని శ్రీవర్ధన్‌రెడ్డి వివరించారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలని విజ్ఞప్తి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న భాజపా నాయకులు

శంషాబాద్: శంషాబాద్‌లో పరాధీనమవుతున్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా.ప్రేమ్‌రాజ్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం శంషాబాద్ భాజపా నాయకులతో కలిసి తహసీల్దార్ రవీందర్ దత్‌కు వారు వినతిపత్రం అందజేశారు. రాళ్లగూడలో ఔటర్ సర్వీస్‌కు ఆనుకొని ఓ స్థిరాస్తి వ్యాపారి 30 ఎకరాల్లో భారీ వెంచర్ వేశారని, ఆ భూముకు ఆనుకొని ఉన్న సర్వే సంఖ్య 626లోని ప్రభుత్వ భూములను కబ్జాచేసి చదును చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ముగిసిన 'పీసీబీ డిజైన్' వర్క్‌షాప్


వర్క్‌షాపులో సాంకేతిక విషయాలను అధ్యయనం చేస్తున్న విద్యార్థులు

నార్సింగి: వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 'పీసీబీ డిజైన్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ గురువారం ముగిసింది. బీటెక్ ఈసీఈ విభాగం విద్యార్థులు 120 మంది హాజరయ్యారు. పాన్‌టెక్ ఈ-లెర్నింగ్ హైదరాబాద్ ఎండీ ఇంజినీర్ రామ్‌ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై సర్క్యూట్ బోర్డుల డిజైనింగ్, ప్రింటింగ్, ఫ్యాబ్రికేషన్లకు సంబంధించిన సాంకేతిక విషయాలను అందించారు. సర్క్యూట్ డిజైన్, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల తయారీలో విద్యార్థులకు వారి సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచడం వర్క్‌షాపు ముఖ్య ఉద్దేశమని ప్రిన్సిపాల్ డా.ఎ.నర్మద తెలిపారు. అకాడమిక్ డీన్ డా.కె.శివనాగిరెడ్డి, సమన్వయకర్తలు ప్రొ.డా.కె.సురేష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ దీపా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ వర్సిటీని అగ్రగామిగా నిలిపేందుకు కృషి: జానయ్య


మాట్లాడుతున్న ఉపకులపతి అల్దాస్ జానయ్య

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని జాతీయ స్థాయిలో అత్యుత్తమ పది సంస్థల్లో నిలపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య పిలుపునిచ్చారు. ప్రస్తుతం వర్సిటీ 37వ ర్యాంకులో ఉందని, రానున్న మూడేళ్లలో ఆ స్థానాన్ని మెరుగుపరచాలని సూచించారు. ఇటీవల ఉపకులపతి బాధ్యతలు స్వీకరించిన జానయ్య గురువారం వర్సిటీ ఆడిటోరియంలో ఉద్యోగులు, విద్యార్థులతో సమావేశమయ్యారు. సమష్టి కృషితో విశ్వవిద్యాలయాన్ని ముందుకు తీసుకెళ్దామన్నారు. సాంకేతిక అర్హతలు లేకపోయినా కొన్ని ప్రైవేటు సంస్థలు వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశాలు చేపట్టడం దురదృష్టకరమన్నారు. సామాన్యులకు వ్యవసాయ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక కోటా సీట్లు పెంచి, ఫీజులు సగానికి తగ్గించామని వివరించారు. విశ్వవిద్యాలయంలోని ఖాళీలను ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామని జానయ్య తెలిపారు. పూర్తి ప్రజాస్వామిక విధానాలను అనుసరిస్తూ నిర్ణయాలు తీసుకుంటామని వివరించారు. ఇదే మాదిరిగా విశ్వవిద్యాలయమని, త్వరలోనే విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని జానయ్య ప్రకటించారు. టాసా అధ్యక్షుడు ప్రొఫెసర్ బి.విద్యాసాగర్, బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి అఫ్జల్‌రెడ్డి, విద్యార్థి ప్రతినిధులు పూజ, బాలకోటి, పూర్వ విద్యార్థుల ప్రతినిధి కిరణ్‌కుమార్ ప్రసంగించారు.

కొత్తూరు, న్యూస్‌టుడే:

? కొత్తూరులోని ఎస్సీ వాడలో గృహోపకరణాల కోసం విద్యుత్తు స్తంభాలని పాతి ఏళ్ల గడుస్తున్నా తీగలు లాగడం లేదు. –కర్రోళ్ల రవీందర్, కాలనీవాసి

✓ క్షేత్రస్థాయి పర్యటించి విద్యుత్తు సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటాం –రవీందర్, ఏఈ విద్యుత్తుశాఖ

యువతిపై అత్యాచారం.. దోషికి 20 ఏళ్ల కారాగారం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: ప్రేమపేరుతో మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై అత్యాచారానికి పాల్పడి ఆపై మోసం చేసిన నిందితుడికి న్యాయస్థానం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధించింది. అదనపు పీపీ పి.మంజులాదేవి కథనం ప్రకారం.. మొయినాబాద్ మండలం నాగిరెడ్డిగూడ గ్రామానికి చెందిన జనికుంట కాశీ విశ్వనాథ్ ఓ యువతి(24)ని ప్రేమిస్తున్నట్లు వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం పెళ్లి చేసుకోవాలని పెద్దలు నిలదీయడంతో నిరాకరించాడు. ఈ మేరకు మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు తరలించారు. సమగ్ర దర్యాప్తు తర్వాత కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. కేసు విచారించిన జిల్లా 13వ అదనపు సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి వాణి గురువారం తీర్పునిచ్చారు. బాధిత యువతికి న్యాయమూర్తి రూ.3లక్షలు పరిహారాన్ని మంజూరు చేశారు.

భారాస శంకర్‌పల్లి మండల అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి



శంకర్‌పల్లి(చేవెళ్ల), న్యూస్‌టుడే: శంకర్‌పల్లి మండల భారాస పార్టీ అధ్యక్షుడిగా గండిచర్ల గోవర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని, మండలంలో పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన్ను నాయకులు మల్లారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు సన్మానించారు.

కొందుర్గు ఠాణాను సందర్శించిన ఏసీపీ

కొందుర్గు: కొందుర్గు పోలీస్‌స్టేషన్‌ను గురువారం షాద్‌నగర్ ఏసీపీ ఎన్‌సీహెచ్. రంగస్వామి సందర్శించారు. స్టేషన్ నిర్వహణ, కేసుల పురోగతిపై ఆరా తీయడంతో పాటు సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు చేశారు. ఆయనవెంట గ్రామీణ సీఐ నర్సయ్య ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

నందిగామ, న్యూస్‌టుడే: చిన్న పిల్లల్లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిమ్స్ ఆసుపత్రి వైద్యులు రమ్యకృష్ణ, భవ్య, విరాజ్ సూచించారు. గురువారం నందిగామ మండలం నర్సప్పగూడలో ఐసీడీఎస్ సహకారంతో చిన్న పిల్లల్లో వచ్చే వ్యాధులపై ముచ్చింతల జిమ్స్ కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారం, పరిశుభ్రత గురించి వివరించారు.

సదర్ సమ్మేళనంపై సన్నాహక సమావేశం

షాద్‌నగర్ పట్టణం: షాద్‌నగర్‌లో వచ్చే నెల 10న నిర్వహించే యాదవ సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని సింగిల్ విండో చైర్మన్, యాదవ సంఘం నేత బక్కన్నయాదవ్ కోరారు. సదర్ ఉత్సవానికి సంబంధించిన సన్నాహక సమావేశాన్ని గురువారం షాద్‌నగర్‌లో నిర్వహించారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా పట్టణ ముఖ్య కూడలిలో భారీ ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్దఎత్తున యాదవులు హాజరయ్యేలా నేతలు కృషి చేయాలని కోరారు.

మాలల ఆత్మగౌరవ సభ గోడపత్రిక విడుదల

షాబాద్: అక్టోబరు 27న నాగర్‌కర్నూల్‌లో నిర్వహించనున్న మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేద్దామని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చౌక్కంపేట అంజనేయులు అన్నారు. గురువారం ఆయన కేసారం, చర్లగూడ గ్రామాల్లో మాలల ఆత్మగౌరవ సభ గోడ పత్రికలను విడుదల చేశారు.



నగరంలోకి స్వాగత దారి.. ఇలాగేనా మరి

అది అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నగరంలోకి ప్రవేశించే ప్రధాన రహదారి. విదేశాల నుంచి నగరానికి వచ్చే ప్రతినిధులు ఆ దారిలోనే ప్రయాణిస్తారు. అలాంటివారికి నగరంపై మంచి అభిప్రాయం ఏర్పడాలంటే ఆ దారి ఎంత అందంగా ఉండాలి. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ మార్గంలో కొందరు భిక్షగాళ్లు, చిరువ్యాపారులు ఫైవంతెనల కింద చీరలతో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. ఆరాంఘర్ చౌరస్తాలో పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే కింద కనిపించిందీ దృశ్యం. అధికారులు స్పందించి పైవంతెనల కింద మొక్కలను పెంచి సుందరంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, రాజేంద్రనగర్

అసలే రద్దీ.. ఆర్టీసీ బస్సులకూ అదే మార్గమా?


చేవెళ్ల గ్రామంలోకి వెళ్లే రహదారిలో వాహనాల రద్దీ


బస్టాండు నుంచి రోడ్డు వేయడానికి చేసిన మార్కింగ్

చేవెళ్ల, న్యూస్‌టుడే: బీజాపూర్ రహదారి నుంచి చేవెళ్ల గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. తెలంగాణ ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు ఈ మార్గంలోనే వెళ్లాలి. రెండు సినిమా థియేటర్లు కూడా ఈ రహదారి పక్కనే ఉన్నాయి. ప్రతి గురువారం ఈ దారిలోనే సంత నిర్వహిస్తారు. ఇలా ప్రతిరోజు వేలాదిమంది రాకపోకలతో ఈ రోడ్డంతా రద్దీగా ఉంటుంది. ఇప్పటికే ట్రాఫిక్ ఇబ్బందులతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతుంటే.. కొత్తగా నిర్మిస్తున్న బస్‌స్టేషన్ నుంచి వెలుపలికి వచ్చే బస్సులను ఈ దారికే అనుసంధానిస్తున్నారు. వ్యాపారులు, గ్రామస్థులు చెప్పినా వినకుండా ఆర్టీసీ అధికారులు రోడ్డు పనులు మొదలుపెట్టడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్సు మార్గాన్ని ఈ రహదారి మీదుగా మళ్లించడం కారణంగా రద్దీ మరింత పెరగడంతోపాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భయపడుతున్నారు. కొత్త బస్‌స్టేషన్ నిర్మాణ సమయంలోనే ఈ ప్రతిపాదన తీసుకురాగా ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో డిజైన్ మార్చి గతంలో మాదిరిగానే బస్సుల రాకపోకలు సాగిస్తామని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. తీరా ఇప్పుడు యథావిధిగా పనులు కొనసాగిస్తుండడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్సుల రాకపోకలకు మరో మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అప్పుల బాధతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

నార్సింగి, న్యూస్‌టుడే: అప్పుల బాధతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం కోకాపేటలో చోటుచేసుకుంది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన నాగ ప్రభాకర్(27) గచ్చిబౌలిలోని వసతిగృహంలో ఉంటూ కోకాపేటలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొంత కాలంగా అప్పుల్లో కూరుకుపోయి ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలోనే కోకాపేటలోని విరూపాక్ష మెన్స్ హాస్టల్ 7వ అంతస్తుపై నుంచి కిందకు దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. నాగప్రభాకర్ కోకాపేటలోని ఈ హాస్టల్ భవనానికి ఎందుకు వచ్చాడో అంతుచిక్కని ప్రశ్నగా మారింది. సికింద్రాబాద్‌లో ఉంటున్న మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యాదాద్రిలో భక్తుడి హఠాన్మరణం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో దైవ దర్శనానికి గురువారం వచ్చిన భక్తుడు హఠాన్మరణం చెందారు. షాద్‌నగర్ నియోజకవర్గం మేకగూడ (జేపీ దర్గా)కు చెందిన పోచయ్య(55) శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకునేందుకు కుటుంబంతో కొండపైకి చేరుకున్నారు. ఈ క్రమంలో ఆయనకు శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది ఏర్పడింది. వెంటనే పోచయ్యను అక్కడి నుంచి దేవస్థానానికి చెందిన బ్యాటరీ వాహనం ద్వారా కొండ కింద ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మరణించినట్లు ప్రకటించారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

శంషాబాద్, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శంషాబాద్ మున్సిపల్ పరిధి తొండుపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(55-65) తొండుపల్లి ఔటర్ టోల్ ప్లాజా సమీపంలో అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఒంటిపై ఆకుపచ్చ రంగు గీతల షర్టు, నీలం రంగు ప్యాంటు ఉంది. మృతదేహాన్ని ఉస్మానియా శవాగారానికి తరలించారు.

కుక్కల దాడిలో 35 మేకలు మృత్యువాత

షాబాద్: కుక్కల దాడిలో 35 మేకలు మృతి చెందిన సంఘటన గురువారం పోతుగల్ గ్రామంలో చోటు చేసుకుంది. కార్ల శంకరయ్య మేకలు మేపుకొని జీవిస్తున్నాడు. గురువారం ఆయన మేకలను గ్రామ పొలిమేరలో వదిలి బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి వాటిపై వీధి కుక్కలు దాడి చేసి చంపేశాయి.

అక్రమ బదిలీలు ఆపండి: టీఎస్‌యూటీఎఫ్

ఈనాడు, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలోని సర్కార్ బడులకు ఇతర జిల్లాల నుంచి అక్రమంగా బదిలీపై వస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తర్వులు ఇవ్వకుండా నిలిపేయాలని రంగారెడ్డి జిల్లా టీఎస్‌యూటీఎఫ్ కమిటీ ప్రతినిధులు గోపాల్‌నాయక్, వెంకటప్పలు గురువారం ప్రభుత్వ ఉన్నతాధికారులను అభ్యర్థించారు. జిల్లాలో ఇప్పటికే ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారని, అదనంగా ఇక్కడికి వస్తున్న వారితో భవిష్యత్తులో నిరుద్యోగులకు కొలువులు రావని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై రాజకీయ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

డిప్యూటేషన్ రద్దు చేయాలని విద్యార్థుల ధర్నా

జిల్లేడు చౌదరిగూడెం: చౌదరిగూడెం పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత నేపథ్యంలో ఉపాధ్యాయురాలి డిప్యూటేషను రద్దు చేయాలని భాజపా చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్ మచ్చ సుధాకర్‌రావు, ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ కన్వీనర్ ఆకాష్ నాయక్‌లు డిమాండ్ చేశారు. గురువారం విద్యార్థులతో కలిసి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అదనంగా ఉపాధ్యాయులను కేటాయించాల్సిన ఎంఈవో డిప్యూటేషన్ను సమర్థించడం సరికాదంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, రమేష్, నరేందర్, కుమార్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

శంషాబాద్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేష్ కోరారు. గురువారం శంషాబాద్ మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులతో కలిసి ఆయన మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుష్మారెడ్డికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కార్మికులకు రూ.26 వేల కనీస వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాగేశ్, ప్రవీణ్, రవి, దశరథ్ పాల్గొన్నారు.

బాలుడి అపహరణ కలకలం


స్థానికులు చెట్టుకు కట్టేసిన యువకుడు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: పాఠశాల నుంచి ఇంటికి సైకిల్‌పై వస్తున్న బాలుడిని భయభ్రాంతులకు గురి చేసిన ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. రాజేంద్రనగర్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. . ఎర్రబోడకు చెందిన బాలుడు స్థానిక పాఠశాలలో చదువుతున్నాడు. బడికి ప్రతిరోజు సైకిల్‌పై వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం పాఠశాల నుంచి వస్తుండగా జనప్రియ వద్ద ఓ యువకుడు అడ్డగించి సైకిల్ ముందు భాగంలో కూర్చోవాలని, తాను నడిపిస్తానంటూ బలవంతంగా ఆ బాలుడిని తీసుకొని వెళ్లేందుకు యత్నించాడు. దీంతో ఆ బాలుడు రక్షించాలని కేకలు వేయడంతో స్థానికులు ఆ యువకుడిని పట్టుకొని స్తంభానికి కట్టేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా వారు అదుపులోకి తీసుకున్నారు. యువకుడు మద్యం మత్తులో ఉన్నాడని, విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు

'మోదీ పాలనతోనే అభివృద్ధి సాధ్యం'

చేవెళ్ల, న్యూస్‌టుడే: మోదీ సుపరిపాలనతోనే దేశంలో అభివృద్ధి సాధ్యమని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు గౌడ్ అన్నారు. గురువారం మల్కాపూర్‌లో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కార్యకర్తలతో సభ్యత్వాలు చేయించారు. కార్యక్రమంలో శర్వలింగం, ఇంద్రసేనారెడ్డి, కృష్ణ గౌడ్, శ్రీకాంత్, కృష్ణ, మాణిక్యం, వెంకటేష్, మల్లేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'భాజపాను విమర్శించడం తగదు'

షాద్‌నగర్‌న్యూటౌన్: షాద్‌నగర్ పురపాలిక ఏర్పడిన పదేళ్లలో కోట్ల రూపాయలు అభివృద్ధి నిమిత్తం ఇచ్చిన భాజపాను విమర్శించే హక్కు కాంగ్రెస్, భారాస నాయకులకు లేదని ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రిషికేష్ అన్నారు. పట్టణంలో కేంద్ర నిధులతో చేపట్టిన పనులను గురువారం పార్టీ యువనేతలతో కలిసి ఆయన పరిశీలించారు.

మినీ మార్కెట్‌కు స్థల పరిశీలన

ఆరుట్ల(మంచాల): ఆరుట్లలో మినీ కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు గురువారం మంచాల సహకార సంఘం ఛైర్మన్ హనుమంతు రెడ్డి, ఎంపీడీఓ బాలశంకర్, తహసీల్దార్ ప్రసాదరావు.. స్థలాన్ని పరిశీలించారు.

వాలీబాల్ విజేతలకు అభినందన

కందుకూరు, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి అండర్-17 బాలుర విభాగం వాలీబాల్‌లో మొదటి స్థానంలో నిలిచిన పులిమామిడి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాహుల్, తరుణ్, కార్తీక్‌లను ఉపాధ్యాయులు అభినందించారు. గురువారం పాఠశాలలో వారిని సత్కరించారు.



బహుమతి పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మహేశ్వరం

•మహేశ్వరం •ఇబ్రహీంపట్నం •కల్వకుర్తి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కడ్తాల్, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు అన్నారు. కడ్తాల్‌లోని పాఠశాల మైదానంలో గురువారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 68వ (ఎస్‌జీఎఫ్) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 14, 17 విద్యార్థులకు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లాలోని 27 మండలాలకు చెందిన కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, సేవ శివప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారిణులు

సంక్షిప్త సమాచారం



కసిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఆర్డీవో కార్యాలయం ఏర్పాటుకు వినతి

ఆమనగల్లు: ఆమనగల్లులో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక నేతలు కోరారు. ఈ మేరకు ఆమనగల్లు వైస్ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాబా, విజయ్‌రాథోడ్, రవీందర్ తదితరులు.. గురువారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ఆదిభట్ల: జిల్లాలోని అన్ని పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేయడానికి ఎంపీడీఓలు నాంది పలకాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. గురువారం కొంగరకలాన్‌లోని రంగారెడ్డి కలెక్టరేట్‌లో వ్యక్తిగత మరుగుదొడ్లు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా శశాంక మాట్లాడుతూ.. పల్లెలను బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్డీఓ శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, సీపీఓ సౌమ్య, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు ఇవ్వాలని డిమాండ్

తలకొండపల్లి: ఉపకార వేతనాల బకాయిలు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీఎస్ఎస్‌వో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మీసాల వంశీ గురువారం డిమాండ్ చేశారు. రూ.7.500 కోట్ల ఉపకార వేతనాలు విద్యార్థులకు రావాలని..వీటిని ప్రభుత్వం మంజూరు చేయాలని ఆయన కోరారు.

ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా అరుణ



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ సతీమణి మస్కు అరుణ ఐద్వా రాష్ట్ర కమిటి సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ నెల 23న భద్రాద్రి కొత్తగూడెంలో జరిగిన అఖిల భారత మహిళ సంఘం (ఐద్వా) 4వ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన నూతన కమిటిలో తనను రాష్ట్ర కమిటి సభ్యులుగా ఎన్నుకున్నట్లు గురువారం ఇబ్రహీంపట్నంలో మస్కు అరుణ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ సెక్షన్ అధికారి రాధాకు కార్మికులు వినతిపత్రం అందజేశారు.

పది నెలలైనా పట్టింపేది?

- కొలిక్కిరాని మార్కెట్ కమిటీ
- ఆశావహుల్లో పెరుగుతున్న ఉత్కంఠ



మహేశ్వరంలో కార్యాలయ భవనం

మహేశ్వరం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో కీలకమైన మహేశ్వరం మార్కెట్ కమిటీ పాలకవర్గ ఎన్నిక ఆ పార్టీలో కొత్త చిచ్చు రేపింది. ఈ కమిటీ అధ్యక్ష పదవి కోసం పార్టీలో తీవ్రమైన పోటీ నెలకొంది. కమిటీ అధ్యక్ష పదవి తమకంటే తమకంటూ కాంగ్రెస్‌లో రెండు వర్గాలు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మార్కెట్ కమిటీల పాలకవర్గాలు దశలవారీగా నియామకాలు పూర్తి చేసుకుంటే.. మహేశ్వరం మార్కెట్ కమిటీ పాలకవర్గ పంచాయితీ ఇప్పట్లో తేలేలా కనిపించట్లేదు.

ఎమ్మెల్యే తర్వాత ఈ పదవే కీలకం..

మహేశ్వరం మార్కెట్ కమిటీ పరిధిలో మహేశ్వరం, కందుకూరు మండలాలున్నాయి. ఎమ్మెల్యే పదవి తర్వాత ఈ కమిటీ అధ్యక్షుడికే అత్యంత గౌరవం దక్కుతుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినప్పటికీ పాలకవర్గం ఎన్నిక కొలిక్కిరావట్లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికల్లో ఓటమి చెందడంతో పాలకవర్గ నియామకంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. స్థానిక నాయకుల్లో నిరాశ ఎక్కువవుతోంది. ఈ విషయాన్ని కేఎల్ఆర్ దృష్టికి తీసుకెళ్లడానికి కాంగ్రెస్ శ్రేణులు జంకుతున్నారు. కమిటీ అధ్యక్ష పదవిని ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ పదవిని దక్కించుకునేందుకు పార్టీ నేతలు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. మార్కెట్ కమిటీ నియామకానికి నియోజకవర్గం కాంగ్రెస్ బాధ్యులు కేఎల్ఆర్.. గ్రీన్ సిగ్నల్ ఇస్తే 24 గంటల్లో పాలకవర్గం ఏర్పడుతుందని కొందరు నాయకులు చెబుతున్నారు. పాలకవర్గం జాబితాను సిద్ధం చేసి ఇన్‌ఛార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు పంపించాలని కోరుతున్నారు.

కేఎల్ఆర్ దృష్టి సారించాలి..

మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు మహేశ్వరం మండలానికి చెందిన ఓ యువ నేత తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈయనతోపాటు మరో ఇద్దరు పోటీ పడుతున్నారు. ఈ ముగ్గురిలో ఎవరో ఒకరి పేరు వెంటనే ప్రకటించాలని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు. ఎన్నిక ఆలస్యం కావడం పట్ల పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం పెరుగుతోందని వారు తెలిపారు. జాబితాను కేఎల్ఆర్ తయారు చేసి ఇన్‌ఛార్జి మంత్రికి పంపిస్తే ఈ సమస్య వెంటనే కొలిక్కి వస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమనగల్, కడ్తాల్ 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే:

? రాయపోల్ గ్రామంలో మ్యాన్‌హోల్ శిథిలమైంది. రోడ్డుపై మురుగు పారుతోంది. దుర్వాసన వస్తోంది. –నవీన్‌కుమార్, రాయపోల్

✓ వెంటనే బాగు చేయిస్తాం. –అలివేలు, పంచాయతీ కార్యదర్శి, రాయపోల్

? కమ్మగూడ 22వ వార్డు ప్రగతినగర్ ఫేజ్-2 కాలనీలో డ్రైనేజీకి ఔట్‌లెట్ లేక ఇళ్ల పక్కనే మురుగునీరు నిలుస్తోంది.–బాలస్వామి, స్థానికుడు

✓ పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. –ప్రవీణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, తుర్కయంజాల్

ఆర్కేపురం, బాలాపూర్, ఆదిభట్ల, మీర్‌పేట, కందుకూరు, న్యూస్‌టుడే:

? ఎన్టీఆర్ నగర్‌లోని శివపురి కాలనీ రోడ్డు నం-1లో మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగుతోంది. కంపు భరించలేకపోతున్నాం. –అశోక్, ఎన్టీఆర్‌నగర్

✓ వెంటనే మరమ్మతులు చేపడతాం – రాజు, జలమండలి మేనేజర్, ఆర్కేపురం

? నాదర్‌గుల్ ఏఎంఆర్ కాలనీలో విద్యుత్తు లైట్లు నిరంతరం వెలుగుతున్నాయి. కరెంటు వృథా అవుతోంది. ఆన్ ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేయాలి. – కృష్ణ, నాదర్‌గుల్

✓ సిబ్బందిని పంపించి స్విచ్ వెంటనే ఏర్పాటు చేయిస్తాం. –వినీల్‌గౌడ్, ఏఈ, బడంగ్‌పేట

? ఆదిభట్ల పురపాలిక పరిధిలోని మెట్రో సిటీలో దోమల బెడద ఎక్కువగా ఉంది. –విజయ్, మెట్రో సిటీ

✓ ఫాగింగ్ నిర్వహించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. – బాలకృష్ణ, కమిషనర్, ఆదిభట్ల

? మీర్‌పేట ప్రశాంతిహిల్స్ ఫేజ్2 కాలనీ రోడ్డు సుమారు అర కిలోమీటరు మేర అధ్వానంగా తయారైంది. రహదారికి మరమ్మతులు చేపట్టాలి. – టేకుల సుభాష్‌రెడ్డి, ప్రశాంతిహిల్స్ కాలనీ, మీర్‌పేట

✓ రహదారి మరమ్మతులకు ప్రతిపాదించాం. త్వరలోనే మరమ్మతులు చేస్తాం. – దుర్గదీప్‌లాల్, మేయర్, మీర్‌పేట

? కందుకూరు నుంచి దెబ్బడగూడ వెళ్లు రోడ్డు గుంతలతో నిండింది. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. – సుధాకర్ దెబ్బడగూడ

✓ నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు చేపడతాం.– సతీష్, ఏఈ, పీఆర్

అభివృద్ధి పనులు ఆపొద్దు: ఎమ్మెల్యే



రావిర్యాల చెరువు సుందరీకరణ పటాన్ని పరిశీలిస్తున్న సబితారెడ్డి

మహేశ్వరం, న్యూస్‌టుడే: తుక్కుగూడ పురపాలక పరిధిలోని రావిర్యాల పెద్దచెరువు సుందరీకరణ పనులను ఎమ్మెల్యే సబితారెడ్డి గురువారం పరిశీలించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను అడ్డుకోవద్దని ఆమె తెలిపారు. మంజూరైన నిధులు తక్షణమే కేటాయించి అభివృద్ధిని కొనసాగించాలని ఆమె కోరారు. తుక్కుగూడలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను సబితారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ బరిగెల హేమలత, వైస్‌ఛైర్మన్ వెంకట్‌రెడ్డి, కమిషనర్ వెంకట్రామ్, భారాస నాయకులు పాల్గొన్నారు.

జల్‌పల్లి, న్యూస్‌టుడే: జల్‌పల్లి పురపాలిక పరిధి వాసవీకాలనీలో నీటి ఎద్దడి నెలకొందని సమస్య పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డికి గురువారం స్థానికులు వినతిపత్రం అందజేశారు.

వంతెన నిర్మించండి



తలకొండపల్లిలో శిథిల కల్వర్టును చూపుతున్న ఉప్పల వెంకటేశ్

తలకొండపల్లి మండల కేంద్రానికి సమీపంలోని కడ్తాల్‌కు వెళ్లే రహదారిపై అటవీప్రాంతంలో వంతెన శిథిలమైందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ వంతెనను గురువారం ఆయన పరిశీలించారు. అధికారులు వంతెనను, రహదారిని నిర్మించాలని ఆయన కోరారు. -న్యూస్‌టుడే, తలకొండపల్లి

అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ తులసీ, ఎంపీడీఓ వెంకటమ్మ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సురేష్ మాట్లాడుతూ ఉద్యోగాలు, సినిమాలు, ప్రేమ పెళ్లిళ్ల పేరుతో అమ్మాయిలను కొందరు మోసం చేసి వారి జీవితాలు నాశనం చేస్తున్నారని..స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు.

అక్రమ బదిలీలు ఆపండి: టీఎస్‌యూటీఎఫ్

ఈనాడు, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలోని సర్కార్ బడులకు ఇతర జిల్లాల నుంచి అక్రమంగా బదిలీపై వస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తర్వులు ఇవ్వకుండా నిలిపేయాలని రంగారెడ్డి జిల్లా టీఎస్‌యూటీఎఫ్ కమిటీ ప్రతినిధులు గోపాల్‌నాయక్, వెంకటప్పలు గురువారం ప్రభుత్వ ఉన్నతాధికారులను అభ్యర్థించారు. జిల్లాలో ఇప్పటికే ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారని, అదనంగా ఇక్కడికి వస్తున్న వారితో భవిష్యత్తులో నిరుద్యోగులకు కొలువులు రావని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై రాజకీయ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

కులగణనపై శిక్షణ

మంచాల, న్యూస్‌టుడే: కులగణన త్వరలోనే ప్రారంభిస్తామని మంచాల ఎంపీడీఓ బాల శంకర్ తెలిపారు. మంచాల మండలంలో 11 వేల కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, కార్యదర్శులకు కులగణనపై శిక్షణ ఇచ్చినట్లు వివరించారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం: సీపీఎం

తలకొండపల్లి, న్యూస్‌టుడే: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సీపీఎం పోరాటం చేస్తోందని పార్టీ సీనియర్ నేత ఎం.యాదయ్య, కె.వెంకటయ్య పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో గురువారం నిర్వహించిన సీపీఎం పార్టీ మహాసభలకు వారు హాజరై మాట్లాడారు. అనంతరం పడకల్ సీపీఎం కార్యదర్శిగా జల్లెల పెంటయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కురుమయ్య, రమేశ్, పర్వతాలు, జంగయ్య, పోచయ్య, రాములమ్మ పాల్గొన్నారు.

బీఎస్పీ కార్యవర్గం ఏర్పాటు



ఇబ్రహీంపట్నంలో నూతన కమిటీ..

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: బీఎస్పీని నియోజకవర్గంలో బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గ్యార జగన్ నేతలకు సూచించారు. గురువారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా వంగాల కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షుడిగా గుండె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మచ్చ మహేందర్, కార్యదర్శిగా గోరేటి కుమార్, కోశాధికారిగా మహేందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఈసీ సభ్యులు అబ్రహం లింకన్, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జ్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రాములు, ఉపాధ్యక్షుడు రమేష్, కొండ్రు రఘుపతి పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

బాలాపూర్: అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఎ.వెంకట్‌రెడ్డి, బి.కృష్ణ, వై.శేఖర్‌యాదవ్, శ్రీనివాస్ తదితరులు అధికారులకు విన్నవించారు. వారు కలెక్టరేట్, హెచ్ఎండీఏ కార్యాలయంలో వినతిపత్రాలు అందించారు.

బస్సులు తక్కువ.. ప్రైవేటు వాహనాలే ఎక్కువ

- ప్రయాణికులకు తప్పని వ్యయప్రయాసలు
- ప్రజారవాణాపై దృష్టి పెట్టాలని వినతి



మీర్‌పేట బస్టాండ్‌లో ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు



నిర్మానుష్యంగా నందిహిల్స్ బస్టాండ్

మీర్‌పేట న్యూస్‌టుడే: మున్సిపల్ కార్పొరేషన్ స్థాయి.. లక్షన్నర జనాభా.. 156 కాలనీలు.. దాదాపు నగరంలో కలిసిపోయిన ప్రాంతం మీర్‌పేట. ఇక్కడి నుంచి నిత్యం వేల సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు నగరంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రజారవాణాలో భాగమైన ఆర్టీసీ బస్సులు తగినన్ని అందుబాటులో లేక ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఇదీ మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట కార్పొరేషన్‌లోని దుస్థితి. ప్రధాన రహదారులు మినహాయిస్తే సుమారు సగం కాలనీలకు బస్సు సౌకర్యం అందుబాటులో లేదు. దీంతో సొంత వాహనాలు, ఆటోలు, క్యాబ్‌లపైనే జనం ఎక్కువగా ఆధారపడి రాకపోకలు సాగిస్తున్నారు.

బస్సులు తిరిగే ప్రాంతాలు ఇవీ..

మీర్‌పేట పరిధిలో ప్రస్తుతం కోఠి ఉమెన్స్ కాలేజీ నుంచి గాయత్రినగర్, మందమల్లమ్మ చౌరస్తా, జిల్లెలగూడ చందనచెరువు కట్ట, అంబేడ్కర్‌నగర్, లలితానగర్, మీర్‌పేట, మీర్‌పేట పోలీస్‌స్టేషన్, ప్రశాంతిహిల్స్ చౌరస్తాల మీదుగా బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్ప వరకు బస్సులు తిరుగుతున్నాయి. కొన్ని బస్సులు కోఠి నుంచి కర్మన్‌ఘాట్ మీదుగా టీకేఆర్ కమాన్, నందనవనం, టీకేఆర్ కాలేజీ వరకు వచ్చి వెళ్తున్నాయి. రెండు మూడు ట్రిప్పులు నందిహిల్స్ చౌరస్తా వరకు నడిపిస్తున్నారు. మరికొన్ని బస్సులు కోఠి నుంచి ఓవైసీ హాస్పటల్, కంచన్‌బాగ్, బాలాపూర్ చౌరస్తా, లెనిన్‌నగర్ మీదుగా బడంగ్‌పేట, నాదర్‌గుల్, ఆదిభట్ల వరకు నడుస్తున్నాయి. ఈ మార్గాలకు అనుసంధానమై ఉన్న కాలనీలు మినహాయిస్తే మిగిలిన ప్రాంతాల ప్రజలకు ప్రజా రవాణా సౌకర్యం అందుబాటులో లేదు.

బస్సులు అందుబాటులో లేని ప్రాంతాలు..

కార్పొరేషన్‌లోని ప్రశాంతిహిల్స్, టీచర్స్‌కాలనీ, శివహిల్స్, సెవెన్‌హిల్స్, రాఘవనగర్, రాఘవేంద్రకాలనీ తదితర అనేక ప్రధాన ప్రాంతాల ప్రజలు బస్సు కోసం సుమారు ఒకటి నుంచి రెండు కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి ఉంది. మీర్‌పేట ప్రధాన చౌరస్తా చుట్టూ కాలనీలతో పాటు బాలాపూర్ చౌరస్తా, లెనిన్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సాగర్ రింగ్‌రోడ్డు, ఎల్బీనగర్, వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి నగర్ ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పదు. ఆ మార్గంలో కొన్నేళ్ల క్రితం బస్సులు తిరిగేవి.. ఆ తర్వాత నిలిపేశారు. జనప్రియ మహానగర్‌లోని 1200 ఫ్లాట్స్‌లో సుమారు 6వేల మంది పేద, మధ్య తరగతి ప్రజలు నివాసం ఉంటున్నారు. కరోనా తర్వాత ఈ ఫ్లాట్స్‌కు బస్సు సౌకర్యం నిలిపివేయడంతో స్థానికులకు కిలోమీటరు దూరంలోని బాలాపూర్ చౌరస్తాకు కాలినడక తప్పట్లేదు. ఆయా కాలనీలకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారులకు మరమ్మతులేవి?: భాజపా

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయని వాటికి తక్షణం మరమ్మతులు చేయించాలని భాజపా నేతలు కోరారు. కుత్బుల్లాపూర్ గ్రామంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కొత్త అశోక్‌గౌడ్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో భాజపా నేతలు బండిగారి విష్ణుగౌడ్, పోలోజు అరుణ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు విజ్ఞప్తి

బాలాపూర్, న్యూస్‌టుడే: బడంగ్‌పేట కార్పొరేషన్, గుర్రంగూడ, అల్మాస్‌గూడ రహదారి విస్తరణకు నిధులు కేటాయించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మేయర్ చిగురింత పారిజాత కోరారు. ఈ మేరకు ఆమె.. గురువారం మంత్రికి క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు చిగురింత నర్సింహారెడ్డి, బి.రాఘవేందర్‌రెడ్డి, డి.శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్లి వస్తూ ఇద్దరి దుర్మరణం

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు



లక్ష్మయ్య చంద్రయ్య

మహేశ్వరం: అమీర్‌పేట- మన్‌సాన్‌పల్లి చౌరస్తా రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పులిమక్త గ్రామానికి చెందిన పొంగువాల లక్ష్మయ్య(60) అమీర్‌పేటలో ఇస్త్రీ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అమీర్‌పేట గ్రామానికి చెందిన మాదరమోని చంద్రయ్య(58) మేస్త్రీ. వీరిద్దరూ స్నేహితులు. అమీర్‌పేటలో ఓ వివాహ వేడుకకు వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. గురువారం రాత్రి వీరి వాహనాన్ని వెనక నుంచి వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. లక్ష్మయ్య అక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన చంద్రయ్యను శంషాబాద్ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహేశ్వరం ఎస్సై మధుసూదన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేకలు, కోళ్లు మృతి

బాలాపూర్: పెంచుకుంటున్న 15 మేకలు, 50 కోళ్లు మృతిచెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితుల వివరాలు.. బాలాపూర్ లెనిన్‌నగర్‌కు చెందిన నర్సింహ మేకలు, కోళ్లను పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. ప్రస్తుతం అతని వద్ద 15 మేకలు, 50 కోళ్లు ఉన్నాయి. గురువారం ఉదయం నర్సింహ పశువుల పాకలో చూడగా.. 15 మేకలు, 20 కోళ్లు మృతిచెంది ఉన్నాయి. 30 కోళ్లు కన్పించలేదు. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూ.లక్షల్లో నష్టం జరిగిందని వాపోయాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కుక్కలు దాడి చేసి ఉండవచ్చని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

ఆస్తి పన్ను లక్ష్యాలు పూర్తిచేయాలి



సర్కిళ్ల అధికారులతో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యాలను అధిగమించాలని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్ల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి పన్ను వసూళ్లపై సూచనలు చేశారు. జోన్ పరిధిలో బకాయిలు చాలా ఉన్నాయన్నారు. గత ఏడాది వసూలైన పన్ను ప్రకారం ఈ ఏడాది ప్రతి అధికారికి లక్ష్యం ఉందని దాన్ని చేరుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. సమావేశంలో జోనల్ స్థాయి అధికారులు, ఉప కమిషనర్లు, వాల్యూయేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్

● ఖైరతాబాద్ ● జూబ్లీహిల్స్

శ్రీకృష్ణానగర్‌లో స్తంభించిన ట్రాఫిక్

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణానగర్ బీ-సీ-బ్లాకుల్లో గురువారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ స్తంభించింది. అంతర్గత వీధుల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తడం ఇదే మొదటిసారి. జూబ్లీహిల్స్ నుంచి వచ్చే వాహనదారులు, వెంకటగిరి జలమండలి కార్యాలయం, వెంకటగిరి మీదుగా పూర్ణా టిఫిన్ సెంటర్, సింధూ టిఫిన్ సెంటర్ వీధుల నుంచి వస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీనికితోడు ఓ వీధిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో వాహనాలన్నీ ఒకే వీధిలోకి రావడంతో సమస్య మరింత జఠిలమైంది.


బి-బ్లాకులో ఇలా..

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే:

? లక్ష్మీనరసింహనగర్ వీధులలో పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం వీధులను ఊడ్చకపోవడంతో వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోతుంది. తగిన చర్యలు తీసుకోవాలి. -సుదర్శన్, లక్ష్మీనరసింహనగర్.

✓ ప్రతిరోజు వీధులను ఊడ్చేలా చర్యలు తీసుకుంటాం. - సాల్మన్‌రాజ్, ఏఎంఓహెచ్, జీహెచ్ఎంసీ, సర్కిల్ నెం.19.

స్పందనకు వందనం

పంజాగుట్ట, న్యూస్‌టుడే: ద్వారకాపురికాలనీలో మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు పొంగుతూ రహదారిపై ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా..' దృష్టికి తీసుకురాగా, జలమండలి అధికారులు స్పందించారు. మురుగునీటి పైప్ లైన్ పనులు ప్రాంభించేందుకు పైపులను సిద్ధం చేశారు.

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్ రోడ్ నంబరు 11 ఉదయనగర్ బస్తీలోని వీధి నంబరు 3, 4లలో నెలకొన్న వీధి దీపాల సమస్యను స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా.. దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మున్సిపల్ ఏఈ (వీధి దీపాల విభాగం) సుష్మ బస్తీలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు. ఆయా సమస్యలు పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆరోగ్యానికి భరోసా..

విద్యకు ప్రోత్సాహం

● ఆపన్నులకు చేయూతనిస్తున్న 'హీల్'

పంజాగుట్ట, న్యూస్‌టుడే: సమాజంలో పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పంజాగుట్టలోని 'హీల్' సంస్థ ముందడుగు వేస్తోంది. ప్రజలకు ప్రాథమిక అవసరాలైన విద్య, వైద్య రంగంలో తన వంతు సేవలనందిస్తూ ఆదరణ పొందుతుంది. గత 30 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు ఉచిత విద్య, వసతి కల్పించడంతో పాటు నగరంలో ఏర్పాటు చేసే వైద్య శిబిరాల ద్వారా బస్తీల్లో, మురికివాడల ప్రజలకు సేవలందిస్తోంది.

30 ఏళ్ల క్రితం..

సమాజానికి తన వంతు ఏదైనా చేయాలనే ఆకాంక్షతో విజయవాడకు చెందిన కోనేరు సత్య ప్రసాద్ 30 సంవత్సరాల కిందట విజయవాడ సమీపంలోని గన్నవరంలో హీల్ సంస్థకు అంకురార్పణ చేశారు. సామాజిక రుగ్మతలకు ప్రత్యామ్నాయం అక్షరాస్యతను పెంచడమే అని నమ్మిన సత్యప్రసాద్ అందుకు పాఠశాలతో పాటు అనాథ శరణాలయాన్ని ఏర్పాటు చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు ఉచితంగా ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు విద్యను అందించడంతో పాటు అనాథలకు వసతి ఏర్పాట్లు చేశారు. ఇదే సమయంలో అందులోని విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేసి కొనసాగిస్తున్నారు. గన్నవరం కేంద్రంలో వెయ్యి మంది విద్యార్థులు ఉచిత విద్యనందిస్తుండటం గమనార్హం.

గన్నవరం నుంచి పంజాగుట్టకు..

హీల్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ కేంద్రం ద్వారా గన్నవరంలో కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలను 2023 ఫిబ్రవరిలో నగరానికి విస్తరించారు. పంజాగుట్ట ద్వారకాపురికాలనీలో హీల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వైద్య సేవలకు శ్రీకారం చుట్టారు. ఈ కేంద్రానికి వచ్చే ఎవరికైనా కేవలం 10 రూపాయలతోనే వైద్య సేవలను అందించడం ప్రారంభించారు.



పంజాగుట్టలోని కార్యాలయం

ఉచిత శిబిరాలు..

సంస్థ కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజల చెంతకే చేర్చే ఉద్దేశంతో బస్తీల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం ప్రారంభించారు. ప్రతీ ఆదివారం ఈ శిబిరాలను ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు మందులను ఉచితంగా అందజేస్తున్నారు. థైరాయిడ్, రక్తహీనత, మధుమేహం వంటి వ్యాధి పరీక్షలనూ ఉచితంగా చేస్తున్నారు. ఇదే సమయంలో పేదలకు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహిస్తూ అండగా ఉంటున్నారు.


సంస్థలో చదువుకుంటున్న విద్యార్థులు


ఓ బస్తీలో వైద్య శిబిరం

సినీ సాహిత్యానికి గౌరవం తెచ్చిన కవి గోపి


ఆకునూరి శారదను సత్కరించిన బుద్ధప్రసాద్, రేలంగి నరసింహారావు, వంశీ రామరాజు, సుచిత్ర, వెంకట్

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ఉన్నత విలువలతో గీతాలు రాసి సినీ పాటకు కావ్య గౌరవం కల్పించిన మహాకవి మైలవరపు గోపి అని ఏపీ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కొనియాడారు. గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో వంశీ ఇంటర్నేషనల్, ప్రముఖ గాయని శారద అకునూరి (అమెరికా) సంయుక్తంగా నాటి గీత రచయిత గోపికి స్వర నీరాజనం 'మనసా కవ్వించకే 'శీర్షికన సమర్పించారు. శారదతో పాటు గాయకులు రమణ, రాము వేణు శ్రీరంగం రామారావు పలు పాటలు ఆలపించారు. అనంతరం జరిగిన సభలో శారదను బుద్ధప్రసాద్ సత్కరించి మాట్లాడారు. దివి సీమ అనగానే ఠక్కున గుర్తుకొచ్చేది వేటూరి అని, అదే ప్రాంతంలో మరో కవి గోపి ఉండటం ఎంతో గౌరవంగా ఉందన్నారు. ఒకప్పుడు తెలుగు పాటకు జాతీయ అవార్డు వస్తేనే గొప్పగా చెప్పుకునే వాళ్లమని, తెలుగు సినీ పాటకు అంతర్జాతీయ స్థాయి గౌరవం సైతం చంద్రబోస్ వల్ల దక్కిందని గుర్తు చేశారు. గోపి పాటల కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లోనూ ఏర్పాటు చేస్తామన్నారు. నిర్వాహకులు వంశీ రామరాజు స్వాగతం పలికారు. సభలో నృత్య దర్శకురాలు సుచిత్ర చంద్ర బోస్, దర్శకులు రేలంగి నరసింహారావు, వెంకన్న మైలవరపు గోపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దుకాణంలో రూ.30వేలు మాయం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: దుకాణంలోని క్యాష్ కౌంటర్‌లోని రూ. 30 వేలు మాయమైన ఘటన మధురానగర్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్బర్ట్ కురేష్ అనే వ్యక్తి రహ్మత్‌నగర్‌లో కిరాణం, బియ్యం దుకాణం నడుపుతున్నాడు. ఈనెల 21న రాత్రి ఇద్దరు అపరిచిత వ్యక్తులు వచ్చి కిరాణా సరకులు కావాలని అడిగారు. అదే సమయంలో నీటి క్యాన్లు వేసే వ్యక్తి రావడంతో అతడితో కురేష్ మాటల్లో పడిపోయాడు. సరుకులు కొనడానికి వచ్చిన వ్యక్తులు మరలా వస్తామని వెళ్లిపోయారు. అనంతరం కురేష్ దుకాణంలోని క్యాష్ కౌంటర్‌ను చూడగా అందులోని రూ. 30 వేలు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగేళ్ల కుమార్తెతో తల్లి అదృశ్యం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: నాలుగేళ్ల కుమార్తెతో తల్లి అదృశ్యమైన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా ఖాన్‌పూర్‌కు చెందిన ఖాజా ఇలియాస్ అహ్మద్ ఈ నెల 21న తన సోదరి, ఆమె కుమార్తెను తీసుకొని బంజారాహిల్స్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. వాహనాన్ని పార్కింగ్ చేసి వచ్చాక సోదరికి ఫోన్ చేయగా వాష్ రూంలో ఉన్నానంటూ సందేశం వచ్చింది. ఖాజా అక్కడ ఎంతసేపు ఎదురుచూసినా ఆమె రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికురాలి మంగళసూత్రం గొలుసు అపహరణ

రెజిమెంటర్‌బజార్, న్యూస్‌టుడే: రైలులో ప్రయాణిరాలి మంగళ సూత్రం చోరీకి గురైంది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన సురేఖ సత్తెనపల్లి వెళ్లి తిరిగి సికింద్రాబాద్‌కు బయలుదేరింది. ప్రయాణ సమయంలో అందరూ విశ్రాంతి తీసుకుంటున్నారు. రైలు పగడిపల్లి రైల్వేస్టేషన్‌కు రాగా బోగీకి వచ్చిన ఆగంతకుడు ఆమె మెడలోని బంగారు 20 గ్రాముల మంగళసూత్రం గొలుసును లాక్కుని ఉడాయించాడు. రైలు సికింద్రాబాద్‌కు చేరుకున్న అనంతరం బాధితురాలు జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసును నల్గొండ జీఆర్పీ పోలీసులకు బదిలీ చేస్తున్నారు.

బ్లూకోర్ట్స్ సిబ్బందిపై దాడి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: బ్లూకోర్ట్స్ సిబ్బంది దాడికి పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలోని శాలివాహననగర్‌లో విధుల్లో ఉన్న బ్లూకోర్ట్స్ కానిస్టేబుల్ రాజు, హోంగార్డు శేఖర్, అర్ధరాత్రి 2 గంటల సమయంలో మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు గొడవ పడుతుండటాన్ని గమనించి ఇంటికి వెళ్లాలని సూచించారు. దీంతో ఒక్కసారిగా రెచ్చిపోయిన యువకులు సిబ్బందిని వాహనంపై నుంచి కిందకు లాగి తీవ్రంగా కొట్టారు. స్థానికులు అక్కడికి చేరుకోవడంతో అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. డీజే కార్తీక్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు అశోక్, మోహన్‌లుగా గుర్తించారు. బాధిత పోలీసు సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొదటి పటాలం ప్రాంగణంలో రక్తదాన శిబిరం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా యూసుఫ్‌గూడలోని మొదటిపటాలం ప్రాంగణంలోని యూనిట్ ఆసుపత్రిలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు సిబ్బంది రక్తదానం చేశారు. అదనపు కమాండెంట్ నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్లు రవిచంద్ర, రాంబాబు, ప్రసాద్, అప్పారాయ్, ఆర్ఐలు సాంబయ్య, శంకర్, ధర్మారావు, నర్సయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో ఉద్యోగుల నిరసన


బైఠాయించిన ఉద్యోగులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పది ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి(జేఎన్ఏఎఫ్ఏయూ) కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనకు దిగారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. ఐకాస ఛైర్‌పర్సన్ ప్రొ. పల్లవి కాబ్డే, కన్వీనర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ మహేష్ గౌడ్, జేఏసీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం సమకూరింది. హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్‌కి చెందిన కంచర్ల మంగారావు, జానకీ దంపతులు ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఏఈవో నటరాజారావు దాతను ప్రత్యేకంగా అభినందించి స్వామివారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రాన్ని అందజేశారు.

ఎన్నాళ్లు ఇలా?



ఎర్రగడ్డ డివిజన్ ఓల్డ్ సుల్తాన్‌నగర్ సామాజిక భవనం సమీప ఇండస్ట్రియల్ ఏరియా రహదారిలో చెత్త, వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన వస్తోందని, దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు వాపోతున్నారు. రోజులు తరబడి వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నా సంబంధిత సిబ్బంది పట్టించుకోవం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తొలగించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వెంగళ్‌రావునగర్

ఐక్యరాజ్యసమితి వ్యవస్థాపక దినోత్సవం



నారాయణగూడ బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో

నారాయణగూడ: ఐక్యరాజ్యసమితి వ్యవస్థాపక దినోత్సవాన్ని నారాయణగూడలోని బీజేఆర్ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ప్రొ.వెంకటరమణ కీలక ఉపన్యాసం చేశారు.

ఫిల్మ్‌నగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఐక్యరాజ్యసమితి నమూనా సదస్సు గురువారం ముగిసింది. ప్రిన్సిపల్ పి.కాంచనవల్లి, డైరెక్టర్ ఎం.వరలక్ష్మి పాల్గొన్నారు.

'జైనూర్ ఘటన ప్రభుత్వ వైఫల్యమే'

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఆసిఫాబాద్ ప్రాంతం జైనూర్‌లో మూకదాడి, దుకాణాల కాల్చివేత ప్రభుత్వ వైఫల్యంతోనే జరిగిందని పలువురు సామాజిక కార్యకర్తలు పేర్కొన్నారు. కుగ్రామంలో వందలాది మంది గుమిగూడుతున్న విషయాన్ని ప్రభుత్వ నిఘా సంస్థలు గుర్తించలేక పోయాయా? విషయం తెలిసినా వదిలేశారా? అని ప్రశ్నించారు. సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం సామాజిక కార్యకర్తలు ఖలీదా పర్వీన్, శారా మాథ్యూ, మహమ్మద్ అబ్దుల్ అజీజ్, డా.కుమార్ మాట్లాడుతూ.. జైనూర్‌లో దాడి చేసిన వారెవ్వరూ స్థానికులు కాదన్నారు. తెలంగాణ రాష్ట్రం సెక్యులర్‌గా ఉండాలని కోరుకుంటున్నామన్నారు.

వాహనాల సైరన్లు తొలగింపు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ చెందిన ఓ ఎమ్మెల్యే, మరో మాజీ ఎమ్మెల్యేలకు సంబంధించిన వాహనాలకు సైరన్లను గురువారం జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి పేరుతో స్టిక్కర్ ఉన్న వాహనం జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద ప్రయాణిస్తున్న క్రమంలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్సై గోపి వాహనాన్ని ఆపి సైరన్‌ను తొలగించారు. జూబ్లీహిల్స్‌లోని మరో ప్రాంతంలో కందుకూరుకు చెందిన మాజీ ఎమ్మెల్యే మహేందర్‌రెడ్డి వాహనాన్ని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సై నర్సింహ నిలువరించి సైరన్‌ను తొలగించారు. జూబ్లీహిల్స్‌లో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 22 వాహనాలకు సైరన్లను తొలగించామని, వాహనదారులకు రూ. 1000 చొప్పున చలానా విధించినట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

హబీబ్ ఫాతిమానగర్‌లో సెల్‌టవర్లు వద్దు

వెంగళ్‌రావునగర్: రహ్మత్‌నగర్ హబీబ్ ఫాతిమానగర్‌లో ఇళ్లపై సెల్ టవర్లు తొలగించాలని మానవ హక్కుల రక్షణ అసోసియేషన్ సౌత్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.నగేష్ జీహెచ్ఎంసీ సర్కిల్-19 పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ కృష్ణవేణిని కలిసి వినతిపత్రం అందజేశారు. గతేడాది తొలగిస్తామని చెప్పినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు.

పారదర్శకంగానే పదోన్నతులు

ఈనాడు, హైదరాబాద్, సుల్తాన్‌బజార్: దేవాదాయశాఖలో ఈవోల పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని దేవాదాయశాఖ అదనపు కమిషనర్ కె.జ్యోతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్వీసు నిబంధనల ప్రకారమే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. * ఈవోల పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని శాఖ అర్చక, ఉద్యోగ, దేవాదాయశాఖ కార్యనిర్వాహణ అధికారుల సంఘాలు గురువారం పేర్కొన్నాయి. నియామకాల్లో అవినీతి ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నాయి.

'గో-సంజీవని' పుస్తకావిష్కరణ 28న

పంజాగుట్ట: డా.ములగేటి శివరాం రచించిన గో-సంజీవని పుస్తకాన్ని ఈ నెల 28న రవీంద్ర భారతిలో ఆవిష్కరించనున్నట్లు రైతునేస్తం పబ్లికేషన్స్ అధినేత యడ్లపల్లి వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.



గోడను చీల్చి.. మానై పెరిగి

ఖైరతాబాద్‌లోని పాఠ్యపుస్తక ముద్రణాలయం యూనియన్ కార్యాలయం గోడపై మొలిచిన మొక్క గోడను చీల్చుకుంటూ వృక్షంగా ఎదిగింది. కార్యాలయ వర్గాలు పట్టించుకోకపోవడంతో గోడ బీటలువారి కూలిపోయే స్థితికి చేరింది. ఇలాగే వదిలేస్తే ఆ దారిలో వెళ్లే వారిపై గోడ కూలే ప్రమాదం ఉంది. – న్యూస్‌టుడే, ఖైరతాబాద్

కుట్రపూరితంగానే అంబేడ్కర్ విగ్రహం చుట్టూ గోడ

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వం కుట్ర పూరితంగానే ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం చుట్టూ గోడ నిర్మిస్తోందని మాల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ ఆరోపించారు. ఇదేమని ప్రశ్నిస్తే సుందరీకరణ పనుల పేరుతో తప్పుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో పలు అంబేడ్కర్ సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ అనిల్ వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వివిధ అంబేడ్కర్ సంఘాల నాయకులు ఉమాకాంత్, నర్సింహులు, దాసరి విశాల్, సత్యనారాయణ, మణిదీప్, దుబ్బాక నవీన్ తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చండి


బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్‌కు వినతి ఇస్తున్న శంకర్ ముదిరాజ్ తదితరులు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ముదిరాజ్ కులస్థులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డా.చొప్పరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌లకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు అందె బాలయ్య, వి.కె. మహేష్, ఈటెల భద్రయ్య, వెంకట్, సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సలేంద్ర శివయ్య, మద్దెల సంతోష్, నేతలు ఉన్నారు.

డివిజన్‌ను చెత్త రహితంగా చేస్తాం


ద్విచక్ర వాహనాలపై కార్పొరేటర్ మహాలక్ష్మి, జీహెచ్ఎంసీ అధికారిణి హేమలత, సిబ్బంది

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: హిమాయత్‌నగర్ డివిజన్‌ను చెత్త రహితంగా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి గౌడ్ అన్నారు. డివిజన్‌లో పేరుకుపోయిన చెత్త, మట్టిదిబ్బలపై గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జీహెచ్ఎంసీ వైద్యాధికారిణి హేమలత, సిబ్బందితో కలిసి ద్విచక్ర వాహనాలపై డివిజన్ మొత్తం చుట్టివచ్చారు. ఎక్కడెక్కడ సమస్యలున్నాయో తెలుసుకుని పరిష్కరించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ తిరుపతి, ఎస్ఎఫ్ఏలు శ్రీనివాస్, సతీష్, కామేష్, శ్రీధర్, అర్జున్, యాదగిరి, మధు, పూజ, కాంగ్రెస్ నాయకులు జి. రామన్ గౌడ్, మహేష్ కుమార్ ఉన్నారు.

జూబ్లీహిల్స్ సొసైటీ సభ్యత్వ నమోదుపై హైకోర్టు స్టే

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ చేపట్టిన సభ్యత్వ నమోదు ప్రక్రియను నిలిపివేస్తూ గురువారం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేదాకా సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపట్టరాదని పేర్కొంది. దీంతోపాటు గండిపేట మండలం మంచిరేవులలో జూబ్లీహిల్స్-4 పేరిట చేపట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపార ఒప్పందం అమలును కూడా కొనసాగించరాదంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ సొసైటీ అక్రమాలపై రెండుసార్లు ఫిర్యాదు చేసినా సహకార సంఘాల రిజిస్ట్రార్ చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ కె.జ్యోతిప్రసాద్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై జస్టిస్ టి.మాధవీదేవి గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ 800 మంది కొత్త సభ్యత్వాల నమోదు కోసం దరఖాస్తులను ఆహ్వానించారని, ఇది రిజిస్ట్రార్ ఉత్తర్వులకు విరుద్ధమని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా ఇప్పటికే ఒక వెంచర్ వేసి ప్లాట్లు కేటాయించిందని, ప్లాట్లు రావాల్సినవారు 1800 మంది ఉండగా, అదనంగా మరో 800 సభ్యత్వాలు ఇవ్వడానికి రంగం సిద్ధం చేసిందన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి సభ్యత్వాల నమోదు, రియల్ ఎస్టేట్ ఒప్పందాల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతివాదులైన సహకారశాఖ ముఖ్యకార్యదర్శి, సహకార సంఘాల రిజిస్ట్రార్, జూబ్లీహిల్స్ సొసైటీకి నోటీసుల జారీ చేస్తూ విచారణను నవంబరు 14కు వాయిదా వేశారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

బాలానగర్: నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన 15మందికి గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు బండి రమేశ్ సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. బాలానగర్ శోభన సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో రూ.5.9లక్షల చెక్కులు పంపిణీ చేశారు. నేతలు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.



కూకట్‌పల్లి

భాస్కర్‌రావు వర్ధంతి

బాలానగర్, న్యూస్‌టుడే: దివంగత సీపీఎం నేత ఎన్.వి.భాస్కర్‌రావు వర్ధంతి గురువారం బాలానగర్ శ్రీశ్రీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగింది. సీపీఎం నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సేవలను స్మరించారు. సీపీఎం మండల కార్యదర్శి రాజశేఖర్, వీరయ్య, సాంబశివరావు, సత్తెయ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నేతలు

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

అల్లాపూర్, న్యూస్‌టుడే: **సమయం:** ఉదయం10.30 గంటల నుంచి మధ్యాహ్నం1.30 వరకు. **ప్రాంతాలు:** కైత్లాపూర్ వంతెన, బ్యాంకు కాలనీ, ఆర్‌ఆర్‌ఆర్‌బార్ అండ్ రెస్టారెంట్, చంద్రాయణ తాండ కొంత భాగం. **సమయం:** మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5 గంటల వరకు. **ప్రాంతాలు:** గాయత్రీనగర్ పార్కు, హరిహర టెంపుల్, గాయత్రీనగర్ నాలా, లక్ష్మీనగర్

వైద్య శిబిరానికి స్పందన



ఫతేనగర్, న్యూస్‌టుడే: ఫతేనగర్ వార్డు కార్యాలయం ఆవరణలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ శిబిరాన్ని ప్రారంభించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మెడిస్టార్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 200మందికి పరీక్షలు నిర్వహించారు.

తాగునీటి కష్టాలు తీరినట్లే

బాలానగర్, న్యూస్‌టుడే: పైప్‌లైన్ వ్యవస్థ లేక పడిన కష్టాలకు తొందరలోనే తీరనున్నాయని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. బాలానగర్ డివిజన్ రాజుకాలనీ అంబేడ్కర్ భవనం వద్ద కొన్ని ఇళ్లకు పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతుండగా తన దృష్టికి రావడంతో కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. పనులు వేగంగా పూర్తిచేయాలని జలమండలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో భారాస నేతలు ఖాజా, పుష్పరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక




కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నాగోల్‌లో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ మొదటి ఏడాది విద్యార్థి గోపీచంద్ మొదటి స్థానంలో నిలిచాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ బి.వెంకటయ్య అభినందించారు.

కొనసాగుతున్న గ్రూప్-1 పరీక్షలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 598మందికి 360మంది పరీక్షకు హాజరయ్యారు. 238మంది గైర్హాజరయ్యారు. కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని దివ్యాంగుల పరీక్షా కేంద్రంలో 118మందికి 92మంది, అవినాష్ కామర్స్ కళాశాలలో 480మందికి 268మంది పరీక్ష రాశారు.

నియామకం



బాలానగర్, న్యూస్‌టుడే: బీసీ హక్కు సాధన సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా బాలానగర్ శ్రీశ్రీనగర్‌కు చెందిన జి.కృష్ణ ఎన్నికయ్యారు. బుధవారం కాప్రాలో జరిగిన బీసీ హక్కుల సాధన సమితి మహాసభలో సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

పర్వత్‌నగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

అల్లాపూర్: పర్వత్‌నగర్‌లో కార్పొరేటర్ సబిహాబేగం గురువారం పర్యటించారు. రోడ్డు పనులు పూర్తికాలేదని, డ్రైనేజీ పైపులు దెబ్బతిన్నాయని స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పర్వత్‌నగర్ అధ్యక్షుడు జావెద్ షరీఫ్‌బాబా, తదితరులున్నారు.

ఒప్పందంలో తప్పిదం.. అధికారుల నిర్వాకం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే

ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు సంస్థలకు లీజుకిచ్చే విషయంలో అప్రమత్తత అవసరం. లేకుంటే వాటిపై ప్రైవేటు పెత్తనం పెరగడమే కాకుండా.. వారికి కోర్టులకెళ్లే ఆస్కారం ఇచ్చినట్లవుతుంది. అసలు లీజుకిచ్చే ఆలోచన చేయకపోవడమే ఉత్తమం. తప్పనిసరైతే పక్కాగా నిబంధనలతో ఒప్పందం చేసుకోవాలి. ఇప్పటికే ఒకసారి జరిగిన తప్పిదం. . తాజాగా కేపీహెచ్‌బీకాలనీ నెక్సస్ మాల్ ముందు సిద్ధం చేసిన బహుళ క్రీడా సముదాయం అప్పగింతలో పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది.

కొత్త క్రీడా సముదాయం అప్పగింతలో జాగ్రత్తలు అవసరం



ఆరోఫేజ్‌లోని క్రీడా కాంప్లెక్స్‌లో ఇండోర్ ఈత కొలను



నెక్సస్ మాల్ ముందు క్రీడా సముదాయం

ఇదేం ఒప్పందం?

ఆరోఫేజ్‌లో రూ.6కోట్లకు పైగా వెచ్చించి నిర్మించిన జీహెచ్ఎంసీ క్రీడా కాంప్లెక్స్ భవనాన్ని గుత్తకిచ్చిన ఒప్పందంలో తప్పిదాలు దొర్లాయి. మూడేళ్ల క్రితం అప్పటి మూసాపేట సర్కిల్ ఇంజినీరింగ్ అధికారుల నిర్వాకం కారణంగా.. ఇక్కడ ధరల మోత మోగిస్తూ.. ప్రైవేటు వ్యక్తి సొమ్ము చేసుకుంటున్నాడు. ఒప్పందంలో జీహెచ్ఎంసీ ధరలకు మాత్రమే ఈత కొలను, షటిల్ కోర్టులు, వ్యాయామశాలను వినియోగించేలా నిబంధన ఎక్కడా లేదు. కేవలం మూడేళ్లకు ఒప్పందం కుదుర్చుకోవడంతో ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులు భవనానికి ఏర్పాటుచేసిన ధరల పట్టికను సైతం తొలగించి దానిపై మరో స్టిక్కరు అతికించడం గమనార్హం. భవనంలో కొన్ని మార్పులు చేయడం.. అధికారులు ప్రశ్నించినా.. ఖాతరు చేయకపోవడం.. ఒప్పందంలో తప్పిదాలే కారణమని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ ఒప్పందం ఇప్పటికే పూర్తయ్యింది. అధికారుల తప్పిదం కారణంగా.. సదరు వ్యక్తి కోర్టుకెళ్లి అదనంగా మరికొన్ని నెలలు నిర్వహణ హక్కులు సాధించాడు. ఇది ముమ్మాటికీ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమని చెప్పాలి. లేదా ఇంకేదైనా లాలూచీ వ్యవహారం ఉందా? అన్నది మాత్రం అప్పటి అధికారులు.. ఉన్నతాధికారులకే తెలియాలి.

ఆ తప్పిదం జరగకుండా చూడాలి

ప్రభుత్వ ఆస్తులు లీజుకిచ్చే ఒప్పందంలో ధరలు పక్కాగా పేర్కొనాలి. నిబంధనలు అతిక్రమిస్తే లీజు రద్దు చేసే అధికారం అధికారుల వద్ద పెట్టుకోవాలి. తాజాగా నెక్సస్ మాల్ ముందు వంతెన కింద రూ.70 లక్షలకు పైగా ఖర్చు చేసి సిద్ధం చేసిన బహుళ ప్రయోజన క్రీడా సముదాయాన్ని లీజుకిచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ తరుణంలో ఇందులో ఆరోఫేజ్‌లో చేసిన తప్పిదాలు జరగకుండా చూసుకోవాలి. లేదంటే సమస్యను కొని తెచ్చుకున్నట్లవుతుంది.

పక్కాగా నిబంధనలతోనే అప్పగిస్తాం

ధరలతో సహా అన్ని నిబంధనలు టెండర్‌లోనే స్పష్టం చేస్తున్నాం. దీని ప్రకారం నడవకపోతే ఒప్పందం రద్దు చేసే అధికారం ఉండేలా చూస్తాం. ఆరోఫేజ్‌లో జరిగిన తప్పిదం ఇక్కడ పునరావృతం కానివ్వం. **- శ్రీనివాస్, ఈఈ, మూసాపేట సర్కిల్**

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: 8008573418
కేపీహెచ్‌బీకాలనీ:8008573195, మూసాపేట:8008573423, అల్లాపూర్:9491124918

వీధి దీపాల పునరుద్ధరణ



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: బాలాజీనగర్ ఎంబీజీ 1 రోడ్డులో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రిళ్లు అంధకారం రాజ్యమేలుతుండగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. స్థానికులు ఇబ్బంది పడుతూ వస్తుండడంతో ఈ విషయాన్ని మూసాపేట సర్కిల్ ఎలక్ట్రికల్ అధికారుల దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా వారు స్పందించి సిబ్బందితో దీపాలకు మరమ్మతులు నిర్వహించి వెలుగులు పునరుద్ధరించి సమస్యను పరిష్కరించారు.

వ్యర్థాల తొలగింపు షురూ



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి రంగధాముని చెరువులో వ్యర్థాల తొలగింపు ప్రక్రియ మొదలైంది. ఇటీవల దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి విగ్రహాలు, అంతకుముందు బతుకమ్మల నిమజ్జనం జరిగింది. ఈ వ్యర్థాలను తొలగించడంలో జాప్యం చేస్తుండడంతో అక్కడ నెలకొన్న అపరిశుభ్రతను 'ఈనాడు' వెలుగులోకి తీసుకురావడంతో స్పందించిన అధికారులు పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. పొక్లెయిన్‌తో డీసీఎంలో వ్యర్థాలను తరలిస్తున్నారు.

ఆహ్లాదకరం.. స్ఫూర్తిమంతం







కేపీహెచ్‌బీ రాజీవ్ సర్కిల్ వద్ద వంతెన కింద వాలీబాల్ మినీ స్టేడియం ఏర్పాటు చేశారు. అక్కడికి వచ్చి ఆటలు ఆడేవారికి స్ఫూర్తిగా ఉండే విధంగా వంతెన పిల్లర్లకు బొమ్మలు తీర్చిదిద్దారు. వివిధ రకాల ఆటగాళ్లు ఆడుతున్న బొమ్మలు రంగురంగులతో వేస్తుండటంతో రాజీవ్ సర్కిల్ నుంచి జేఎన్‌టీయూ వరకు ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు కొత్తదనం ఆకట్టుకుంటుంది.



మేమూ నిబంధనలు పాటిస్తాం

రద్దీ రహదారుల్లో పాదచారుల పైవంతెనలున్నా.. ప్రజలు వాటిని వినియోగించకుండా రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం.. నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ పోలీసులు ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదు. కానీ, ఇక్కడ ఓ గంగిరెద్దు, దాని దూడ వాటి యజమానులు చెప్పినట్టుగా పాదచారుల పైవంతెన ఎక్కి రోడ్డు దాటుతూ నిబంధనలు పాటించాలని నొక్కి చెప్తున్నాయి.

రూ.10 నాణేలు చట్టబద్ధమైనవి



వ్యాపారికి నాణేలు అందజేస్తున్న ధారాసింగ్ నాయక్

సుల్తాన్‌బజార్: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చలామణిలోకి వచ్చిన రూ.10 నాణేలు చట్టబద్ధమైనవని, వాటిపై అపోహలు, అనుమానాలు అవసరం లేదని, వ్యాపార లావాదేవీల్లో విరివిగా వినియోగించాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ధారాసింగ్ నాయక్ సూచించారు. కోఠి బ్యాంకుస్ట్రీట్‌లోని సెంట్రల్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో గురువారం నాణేల చలామణిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం వ్యాపారుల నుంచి నోట్లు తీసుకొని రూ.10 నాణేలు అందజేశారు. బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ రామకృష్ణన్, డీజీఎం సురేష్ (హైదరాబాద్), ఏజీఎంలు సత్యవాణి, శ్రావ్యప్రభ, కనకరాజ్, హైదరాబాద్ ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో డయాలసిస్ కేంద్రం

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సేవలు అందించేందుకు వీలుగా పటాన్‌చెరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని ఆరోగ్య శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ సంగారెడ్డి తెలిపారు. గురువారం పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. రేడియాలజీ, స్కానింగ్, ఎక్స్‌రే కేంద్రాలు పరిశీలించారు. డెలివరీల వివరాలు తెలుసుకున్నారు. వైద్య బృందంతో సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి మాట్లాడుతూ..కిడ్నీ వ్యాధులున్న నిరుపేదలు పూర్తిస్థాయి డయాలసిస్ సేవలు పొందేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఏరియా ఆసుపత్రి రెండో అంతస్తులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా వైద్యుల నియామకం చేపట్టామన్నారు. అన్నివిభాగాల్లో పూర్తిస్థాయిలో సేవలందించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. నర్సుల కొరత ఉంటే ఇతర ప్రాంతాల నుంచి డిప్యూటేషన్‌పై తీసుకున్నామన్నారు. వైద్యుల విషయంలోనూ అదే పద్ధతి అనుసరించామన్నారు. పూర్తిస్థాయిలో సేవలు అందించడంతో కాన్పులు పెరిగాయని చెప్పారు. నెల రోజుల్లో 150 మందికిపైగా మహిళలు ఆసుపత్రి సేవలు వినియోగించుకున్నారని తెలిపారు. మొత్తం 5పడకలతో రోజుకు 20 మంది డయాలసిస్ సేవలు పొందవచ్చని వెల్లడించారు. ఆరోగ్య శ్రీ కార్డు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డీసీఎంఎస్ సంగారెడ్డి

చికిత్స పొందుతూ మహిళ మృతి

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఎస్సై సుమన్ వివరాల ప్రకారం..జగద్గిరిగుట్ట పరిధి గాంధీనగర్‌కు చెందిన మహమూద్ షంశుద్దీన్-సుల్తాన్ బీ దంపతులు గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో హౌస్‌కీపింగ్ చేస్తుంటారు. ఈ నెల 21న ఇంటి నుంచి ఉదయం 11 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై కంపెనీకి బయలుదేరారు. జేఎన్‌టీయూ రోడ్డులో గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టి వెళ్లిపోయింది షంశుద్దీన్‌కు స్వల్ప గాయాలవగా.. తీవ్రంగా గాయపడిన సుల్తాన్ బీ(44)ని ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న ఆమె బుధవారం అర్ధరాత్రి ప్రాణాలు కోల్పోయింది. షంశుద్దీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వ్యతిరేకించడం తగదు'

బషీర్‌బాగ్: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై కొంతమంది ఆక్రోశం వెళ్లగక్కడం పద్ధతి కాదని, రిజర్వేషన్లను వ్యతిరేకించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఓసీ సంక్షేమ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన బషీర్‌బాగ్‌లో విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఓసీలు విద్యా, ఉద్యోగ రంగాల్లో అనేక అవకాశాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇతర సామాజిక వర్గాలకు నష్టంకలగకుండా అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లను కల్పిస్తే ఎందుకు జీర్ణించుకోలేకపోతున్నారని ప్రశ్నించారు.

వచన కవిత అధ్యయన శిబిరం వచ్చే నెల 24న

నారాయణగూడ: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో వచ్చే నెల 24న వచన కవిత్వ అధ్యయన శిబిరం నిర్వహించనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. కవులు ఇప్పటివరకు వెలువరించిన కవితల వివరాలతోపాటు ఒక కవితను చరవాణి 96037 27234కి వాట్సాప్ చేయాలని సూచించారు.

పట్టించుకోక.. పనిచేయక



ఫిరోజ్ గూడ వద్ద పనిచేయని లిఫ్ట్



తెగిపోయిన విద్యుత్తు కనెక్షన్

నియోజకవర్గంలోని పలుచోట్ల రూ.లక్షలు ఖర్చు చేసి పాదచారుల వంతెనలు నిర్మించారు. జీహెచ్ఎంసీ అధికారులు వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో లిఫ్టులు పనిచేయకుండా, విద్యుత్ తీగల కనెక్షన్ తెగిపోయి అలంకారప్రాయంగా మారాయి. మూసాపేట వద్ద ఉన్న వంతెన లిఫ్ట్ నిర్మాణంలోనే వదిలేశారు. దీంతో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. బాలానగర్‌లోని ఫిరోజ్‌గూడలో ఏర్పాటు చేసిన పాదచారుల వంతెన వద్ద లిఫ్ట్ పనిచేయడం లేదు. అక్కడి మెట్ల మార్గం వద్ద బండలు పగిలిపోయి చెట్లు పెరుగుతున్నాయి.



మెట్ల మార్గం వద్ద పగిలిన బండలు



మూసాపేట వద్ద అసంపూర్తిగా పాదచారుల వంతెన

రేపు విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక

కేపీహెచ్‌బీకాలనీ: వసంతనగర్ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో సమస్యల పరిష్కార వేదిక ఈ నెల 26న నిర్వహించనున్నట్లు డీఈ యాదగిరి తెలిపారు. దీర్ఘకాలిక విద్యుత్తు సమస్యల్లో భాగంగా బిల్లుల హెచ్చుతగ్గులు, విద్యుత్తు సరఫరా తదితర సమస్యలు విన్నవించుకునేందుకు ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. చందానగర్‌లోని సబ్ డివిజన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వేదిక ఉంటుందన్నారు.

ఇంకుడు గుంత లేకుంటే ఇక్కట్లే

మూసాపేట, న్యూస్‌టుడే

కాంక్రీటు జంగిల్‌గా మారిన నగరంలో భూగర్భ జలాలను పెంపొందించడంలో 'ఇంకుడు గుంత'ల పాత్ర కీలకమైంది. జీవో నంబరు 350 ప్రకారం..300 చదరపు అడుగుల విస్తీర్ణానికి మించి ఉండే ఇల్లు, అపార్ట్‌మెంట్‌ల్లో ఇంకుడు గుంతను తప్పనిసరిగా నిర్మించాలనే నిబంధన ఉంది. కానీ, కొందరు యజమానులు దీనికి తిలోదకాలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం ఆశించిన స్థాయిలో నెరవేరడం లేదు. ఈ అంశంపై జలమండలి అధికారులు ఇటీవల మరోసారి దృష్టి సారించారు. ఇంకుడు గుంత లేని ఇంటి యజమానులు, అపార్ట్‌మెంట్ నిర్వాహకులకు నోటీసులు జారీకి శ్రీకారం చుట్టారు.

వినియోగదారులకు నోటీసులు జారీ చేస్తున్న అధికారులు

టోల్‌ఫ్రీ నంబరు: 155313



మూసాపేట ఆంజనేయనగర్‌లోని ఇంకుడు గుంత

గతేడాది సర్వే ప్రకారం

గతేడాది డిసెంబరులో జీహెచ్ఎంసీ, జలమండలి సంయుక్తాధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టారు. అప్పట్లో ఏయే ఇల్లు, అపార్ట్‌మెంట్లలో ఇంకుడు గుంతలున్నాయి? ఎక్కడెక్కడ లేవు? అనే గణాంకాలను అధికారులు సేకరించారు. దాని ప్రకారం ఇంకుడు గుంతలు లేని నివాస సముదాయాలకు జలమండలి అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. మూసాపేట పరిధిలోని ఆంజనేయనగర్, ప్రగతినగర్, శివశక్తినగర్, హబీబ్‌నగర్, పవర్‌నగర్, శ్రీహరినగర్ ప్రాంతాల్లోని 29 మందికి నోటీసులు అందజేయడం గమనార్హం. మిగతా ప్రాంతాల్లో సైతం నోటీసులు జారీచేయడానికి అధికారులు సమాయత్తమవుతున్నారు.

'డయల్ యువర్ ట్యాంకర్' ధర రెట్టింపు

అధికారులు అందజేసిన నోటీసుల ప్రకారం ఆయా ఇల్లు లేదా అపార్ట్‌మెంట్లలో ఈ ఏడాది డిసెంబరులోపు ఇంకుడు గుంతను తప్పనిసరిగా నిర్మించుకోవాలి. లేనిపక్షంలో జనవరి నుంచి 'డయల్ యువర్ ట్యాంకర్' ధరలు రెట్టింపు వసూలు చేస్తారు. ఉదాహరణకు ప్రస్తుతం 10,000 లీటర్ల ట్యాంకరుకు రూ.1,300 తీసుకుంటారు. ఇంకుడు గుంతను నిర్మించుకోని వారికి మాత్రం రూ.2,600లు వసూలు చేస్తారు. సాధారణంగా జనవరి నుంచి నీటి ఎద్దడి ఆరంభమవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ మెలిక పెట్టినట్లు తెలుస్తోంది. అవసరమైతే ఆయా నివాసాల నుంచి విడుదలయ్యే మురుగు విషయంలోనూ ఆంక్షలు విధించే అవకాశాలున్నాయని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

సంప్రదిస్తే సలహాలిస్తారు

ఇంకుడు గుంత విషయంలో నోటీసులు అందుకున్న నివాసితులతోపాటు ఇతర ఔత్సాహికులు ఎవరైనా ప్రాంతీయ జలమండలి కార్యాలయంలో సంప్రదించాలి. వారి అభ్యర్థన మేరకు అధికారుల బృందం నివాసానికి వచ్చి పర్యవేక్షిస్తారు. వారికున్న స్థలానికి అనుగుణంగా ఎంతమేర గుంత ఉండాలి? ఎక్కడ నిర్మించాలి? ఖర్చు ఎంత? వంటి అంశాలపై అధికారులే సూచనలిస్తారు. ఇందుకోసం సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగం పనిచేస్తుంది.

- సలోమి, జలమండలి మూసాపేట సెక్షన్ మేనేజర్

గడువు దాటిన టపాసులు స్వాధీనం



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: గడువు దాటిన టపాసులను కేపీహెచ్‌బీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీలత వివరాల ప్రకారం..హైదర్‌నగర్ పరిధి మెట్రో పిల్లర్ నంబరు 658 సమీపంలో గడువు దాటిన టపాసులు నిల్వ ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు గురువారం సాయంత్రం శ్రీలక్ష్మి క్రాకర్స్ దుకాణంపై దాడి చేశారు. రానున్న దీపావళి పండగ నేపథ్యంలో దుకాణ నిర్వాహకుడు ముఖేశ్‌కుమార్ అగర్వాల్ గడువు దాటిన టపాసులను బేగంబజార్‌లో కొనుగోలు చేసి ఇక్కడ అధిక ధరలకు విక్రయించేందుకు పథకం వేశాడు. పోలీసులు రూ.1,71,407 విలువ గల టపాసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

మెటీరియల్ అడిగినందుకు వ్యక్తిపై మహిళ దాడి

బాలానగర్, న్యూస్‌టుడే: ఆర్డరిచ్చిన మెటీరియల్ ఇవ్వకపోగా రాత్రి సమయంలో మహిళ ఇద్దరిని తీసుకెళ్లి ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా కొట్టిన ఘటన బాలానగర్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నవజీవన్‌నగర్‌కు చెందిన ప్రియాంకారాయ్(32) జింకలవాడలో ఫ్యాన్ల ముడి సరుకు సరఫరా చేసే షాపు నడుపుతుంది. ఆదర్శనగర్‌కు చెందిన ఫ్యాన్ల తయారీ కంపెనీ నిర్వాహకుడు రామకృష్ణ(40) వారం క్రితం ముడి సరుకు కోసం ప్రియాంకారాయ్‌కు రూ.2లక్షలు ఇచ్చాడు. ఆమె మెటీరియల్ పంపకుండా కాలయాపన చేస్తుండడంతో డబ్బులు తిరిగి ఇచ్చేయాలని రామకృష్ణ అడిగాడు. నిర్లక్ష్యంగా సమాధానమిస్తుండడంతో ఆమెపై ఒత్తిడి తీసుకురాసాగాడు. దీంతో ప్రియాంకారాయ్ తన షాపులో పనిచేసే ఇద్దరు కార్మికులను తీసుకొని బుధవారం రామకృష్ణ ఇంటికెళ్లి దౌర్జన్యంగా లోపలికి ప్రవేశించింది. లోపల భార్యాపిల్లలతో ఉన్న రామకృష్ణను కొడుతూ, కార్మికులతో కొట్టిస్తూ. . వీరంగం చేసింది. అడ్డొచ్చిన భార్య, పిల్లలను పక్కకు నెట్టి మరి చేతులు, ఇంట్లో ఉన్న పూలతొట్టితో రామకృష్ణను ఇష్టానుసారం కొట్టి, చేతిగోళ్లతో ఒంటిపై గీకి బెదిరించి వెళ్లిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ అరెస్టు చేశామని బెదిరించి.. రూ.24 లక్షల మోసం

నారాయణగూడ, న్యూస్‌టుడే: బెదిరించి నగదు కాజేశారని బాధితుడు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం..నగరానికి చెందిన పరిశోధకుడి(74)కి 'ట్రాయ్' అధికారులమని ఫోన్ చేశారు. మనీలాండరింగ్‌లో మీరు నిందితుడిగా ఉన్నారని, ముంబయి సీబీఐ అధికారులు మాట్లాడతారని ఫోన్ కలిపాడు. అవతలి వ్యక్తి మీ ఆధార్‌కార్డుతో ముంబయిలో బ్యాంకు ఖాతా తెరిచారని.. రూ.కోట్లు లావాదేవీలు జరిగాయన్నాడు. ఇది మనీలాండరింగ్‌లో భాగమని హెచ్చరించాడు. మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేశామని బెదిరించాడు. ఇంటినుంచి బయటకు రావడానికి, ఇతరులతో మాట్లాడటానికి వీలులేదని చెప్పాడు. పోలీసు దుస్తుల్లో ఉన్న వ్యక్తి వీడియోకాల్ చేసి అరెస్ట్ వారెంట్ చూపించాడు. మిమ్మల్ని కాపాడుకోవాలంటే జరిగిన మోసంలో 25శాతం అంటే రూ.24 లక్షలు సీబీఐ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుందన్నాడు. దర్యాప్తు పూర్తి కాగానే తిరిగి మీ ఖాతాలో జమ చేస్తామన్నాడు. ఆయన నేరస్థుడు చెప్పిన ఖాతాకు నగదు బదిలీ చేశారు. ఆ తరువాత మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.

శేరిలింగంపల్లి

●శేరిలింగంపల్లి ● పటాన్‌చెరు

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలని వినతి

హిమాయత్‌నగర్: ముదిరాజ్ కులస్థులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డా.చొప్పరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడారు. ముదిరాజ్‌ల సామాజిక, ఆర్థిక, స్థితిగతులను అర్థం చేసుకుని 2009లో అప్పటి సీఎం బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చుతూ జీవో నెం 15ను విడుదల చేయగా కొన్ని బీసీ కులాలు కోర్టుకు వెళ్లడంతో అది నిలిచిపోయిందన్నారు. ఆరు అంశాలను హైకోర్టు, సుప్రీంకోర్టు ఏకీభవించగా ఒక అంశంపై మాత్రం బీసీ కమీషన్ నివేదికను కోరాయని తెలిపారు. ఈ విషయంపై చర్చించి ముదిరాజ్‌లకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

జూబ్లీహిల్స్ సొసైటీ సభ్యత్వ నమోదుపై హైకోర్టు స్టే

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ చేపట్టిన సభ్యత్వ నమోదు ప్రక్రియను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. గండిపేట మండలం మంచిరేవులలో జూబ్లీహిల్స్-4 పేరిట చేపట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపార ఒప్పందం అమలును కూడా కొనసాగించరాదంటూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ సొసైటీ అక్రమాలపై ఫిర్యాదు చేసినా సహకార సంఘాల రిజిస్ట్రార్ చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ కె.జ్యోతిప్రసాద్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ టి.మాధవీదేవి గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ 800 మంది కొత్త సభ్యత్వాల నమోదు కోసం దరఖాస్తులు ఆహ్వానించారని, ఇది రిజిస్ట్రార్ ఉత్తర్వులకు విరుద్ధమని తెలిపారు. వాదనలను విన్న న్యాయమూర్తి సభ్యత్వ నమోదు నిలిపివేస్తూ విచారణను నవంబరు 14కు వాయిదా వేశారు.

అప్పులతో గ్రామాల విలీనం

పెండింగ్‌లో పలు బిల్లులు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: పాలనాపరమైన సౌలభ్యం కోసం గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసే ప్రక్రియ ముగిసింది. అప్పులతో పంచాయతీ బాధ్యతలు అప్పగించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్, పటాన్‌చెరు మండలాలకు చెందిన 11 గ్రామాలను అమీన్‌పూర్, తెల్లాపూర్ పురపాలక సంఘాల్లోకి విలీనం చేశారు. పంచాయతీ పాలకమండళ్ల దిగే సమయానికి ఎటువంటి నిధులు లేకుండా చేశారు. పంచాయతీ ఖాతాల్లో డబ్బులు లేకపోయినా చేయబోయే అభివృద్ధి పనులకు తీర్మానాలు చేసి నిధులు కేటాయించారు.

మిగులు నిధులు లేవు..

తెల్లాపూర్ మున్సిపాలిటీలోకి విలీనమైన పాటి, ఘన్‌పూర్, పోచారం, ముత్తంగి, కర్ధనూరు గ్రామాల్లో ఎటువంటి మిగులు నిధులులేవు. కర్ధనూరులో చేసిన అభివృద్ధి పనులకు రూ.50లక్షల బిల్లులు పెండింగ్ పెట్టారు.

● పాటి పంచాయతీ ఖాతాలో ఒక నెల పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించేందుకు మాత్రమే ఉంది.

● ఘన్‌పూర్, పోచారం, ముత్తంగిలలో ప్రారంభ నెల నుంచే పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించుకోవాల్సి వచ్చింది.

పన్నులపై ఆధారం..

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, సుల్తాన్‌పూర్, దాయర, ఐలాపూర్, ఐలాపూర్ తండా సైతం అప్పులతో మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. దాయర, ఐలాపూర్, ఐలాపూర్ తండాలలో ఎటువంటి ఆదాయం వనరులు లేక ఇంటి పన్నులపై ఆధారపడ్డారు.

● సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్క్ విషయంలో దాయర, సుల్తాన్‌పూర్ గ్రామాల మధ్య సరిహద్దు వివాదం నెలకొనడంతో పరిశ్రమల అధికారులు పన్నులు చెల్లింపులు ఆపేశారు. మున్సిపాలిటీలో విలీనం కావడం వల్ల సరిహద్దు వివాదం సద్దుమణిగింది. ఐదేళ్ల పన్నులు చెల్లించాలంటూ టీజీఐఐసీ జోనల్ మేనేజర్‌కు మున్సిపల్ అధికారులు లేఖ రాశారు. పరిశ్రమల నుంచి రూ.1.5కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని సమాచారం.

● పటేల్‌గూడ పంచాయతీ కార్యాలయంలో విలీనానికి ఒకరోజు ముందు రూ.72లక్షల విలువైన చెక్కులు జారీచేశారు. ఐలాపూర్‌లో రూ.14లక్షలు బకాయి చూపించారు. ఐలాపూర్ తండాలో రూ.8.5లక్షల బిల్లులు చెల్లించాలంటూ లెక్కల్లో చూపించారు. దాయర, సుల్తాన్‌పూర్ గ్రామపంచాయతీల్లో రూ.85లక్షలు బకాయిలు చూపించారు.

అభివృద్ధి పనులు చేపడుతున్నాం:

– సంగారెడ్డి, జ్యోతిరెడ్డి తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్లు

గ్రామాల విలీన ప్రక్రియ ముగిసినందున అభివృద్ధి పనులు మున్సిపాలిటీతో సమాంతరంగా చేపడుతున్నాం. ప్రాథమికంగా మురుగు సమస్య లేకుండా చేస్తున్నాం. అన్ని రకాల వ్యర్థాలు తొలగిస్తున్నాం. ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పేలా చేస్తున్నాం.



పాటి గ్రామపంచాయతీ కార్యాలయం భవనంపై మున్సిపాలిటీ బోర్డు ఏర్పాటు

మురుగు పారి.. బతుకు దుర్భరంగా మారి

తూతూమంత్రంగా చర్యలు..

◆ తరచూ వాంబే గృహాల్లోని 5 బ్లాక్ నుంచి 12 బ్లాక్ మీదగా శివాలయం వరకు, పీజేఆర్‌నగర్ బ్లాక్ నంబర్ 19, 24, 48, నుంచి 102వరకు నివాసితులు అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందన కరవైందని స్థానికులు వాపోతున్నారు. కొన్నిసార్లు తూతూమంత్రంగా మురుగు కాలువలను శుభ్రం చేసి వదిలేస్తుండటంతో పరిస్థితి మళ్లీ మొదటికొస్తుందన్నారు.

◆ గత వారం పీజేఆర్‌నగర్‌లో సెప్టిక్ ట్యాంక్ పొంగి కాలనీలోని బ్లాక్‌నంబర్ 19, 21, 22, 25, 26, 27ల మధ్య మురుగు నీరు నిలిచి మూడు రోజులపాటు స్థానికులు అవస్థలు పడ్డారు. బుధవారం ఉదయం సెప్టిక్ ట్యాంక్ నుంచి మురుగు పొంగింది.



పీజేఆర్‌నగర్‌లో ఇటీవల పొంగిన సెప్టిక్ ట్యాంక్

ఆల్విన్‌కాలనీ, న్యూస్‌టుడే: వర్షాకాలం, ఎండాకాలం అనే తేడా లేకుండా కొన్ని కాలనీల్లో ఏళ్ల నుంచి మురుగు సమస్యలు ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. డ్రైనేజీలు పొంగి, రోడ్లపైకి, ఇళ్ల ముందుకు చేరుతోంది. ఎప్పటికప్పుడు మురుగు కాలువల్లో వ్యర్థాలు తరలించక కొన్నిచోట్ల సమస్య ఎదురవుతుంటే... మరి కొన్ని చోట్ల పారుదల సామర్థ్యం సరిపోవడం లేదు.

సామర్థ్యం చాలక..

● పీజేఆర్‌నగర్, వాంబే గృహాల్లో అప్పటి జనాభా అవసరాల మేరకు 8 అంగుళాల డ్రైనేజీ పైపులైన్లు వేశారు. అది ప్రస్తుతం జనాభాకు సరిపోవడం లేదు. ● పీజేఆర్‌నగర్ కాలనీలో బ్లాక్‌ల మధ్య, గురుగోవింద్ సిక్‌కాలనీ, వాంబేగృహాలు, ఎల్లమ్మబండలోని బస్తీలకు చెందిన డ్రైనేజీ పైపులైన్‌లు వాంబే లైన్‌కు కలిసి ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ వ్యవస్థ ప్రజల అవసరాలు తీర్చలేకపోతుంది. కాలం చెల్లిన పైపులైన్లపై ఒత్తిడి పెరిగి మురుగు పొంగి ప్రవహిస్తోంది.



వాంబే కాలనీలో రోడ్డుపై ..



సాయిచరణ్‌కాలనీలో..

వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం: ఝాన్సీ, జలమండలి మేనేజరు, భాగ్యనగర్‌కాలనీ

ప్రస్తుతం నగర వ్యాప్తంగా ప్రతీ కాలనీలో డ్రైనేజీ లైన్ల పరిశీలన జరుగుతోంది. అవసరమైన చోట విస్తరిస్తున్నారు. పీజేఆర్‌నగర్‌లో సెప్టిక్ ట్యాంక్ వద్ద స్థానికులు వ్యర్థాలు వేయడం, మ్యాన్‌హోళ్లపై నిర్మాణాలు చేయడంతో వ్యర్థాలను తొలగించే వీల్లేకుండా ఉంది. వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా

శేరిలింగంపల్లి: 8008573411 మాదాపూర్: 8008573414
మియాపూర్- 7569067467 ఆల్విన్‌కాలనీ -9154945201
రాయదుర్గం - 9848990352,
పటాన్‌చెరు(రూ) - 8008573228

రామచంద్రాపురం రూరల్, శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే:

? తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి పాటి కూడలి నుంచి గ్రామం వరకు వీధి దీపాలు లేక ఇబ్బందిపడుతున్నాం. **– రామకృష్ణ, పాటి**

✓ వీధి దీపాల ఏర్పాటుకు ప్రత్యేకంగా బడ్జెట్ లేదు. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంది. అధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. **– సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ తెల్లాపూర్**

? ఖాజాగూడ దిల్లీ పబ్లిక్ స్కూల్ సమీప రహదారిలో చెత్త పేరుకుపోయింది. **–గడ్డం భాస్కర్‌రెడ్డి, ఖాజాగూడ**

✓ చెత్త ఉన్న ప్రాంతం టీజీఐఐసీ పరిధిలోకి వస్తుంది. సమస్యను ఆ శాఖ అధికారులు దృష్టికి తీసుకెళ్తాం.

–శ్రీకాంత్ రెడ్డి, సహాయ వైద్యాధికారి, శేరిలింగంపల్లి

పటాన్‌చెరులో డయాలసిస్ కేంద్రం

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సేవలు అందించేందుకు వీలుగా పటాన్‌చెరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని ఆరోగ్య శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ సంగారెడ్డి తెలిపారు. గురువారం పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. రేడియాలజీ, స్కానింగ్, ఎక్స్ రే కేంద్రాలు పరిశీలించారు. రోజువారీగా ఎన్ని డెలివరీలు చేస్తున్నారనే వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వైద్య బృందంతో సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి మాట్లాడుతూ.. కిడ్నీ సంబంధిత వ్యాధులున్న నిరుపేదలు పూర్తిస్థాయి డయాలసిస్ సేవలు పొందేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఏరియా ఆసుపత్రి రెండో అంతస్తులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు ప్రత్యేకంగా వైద్యుల నియామకం చేపట్టామన్నారు. అన్ని విభాగాల్లో వైద్యులు పూర్తిస్థాయిలో సేవలందించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. నర్సుల కొరత ఉంటే ఇతర ప్రాంతాల నుంచి డిప్యూటేషన్‌పై తీసుకున్నామన్నారు. వైద్యుల విషయంలోనూ అదే పద్ధతి అనుసరించామన్నారు. పూర్తిస్థాయిలో సేవలు అందించడంతో కాన్పులు పెరిగాయని చెప్పారు. ఒక్క నెల రోజుల్లో 150మందికిపైగా మహిళలు ఆసుపత్రి సేవలు వినియోగించుకున్నారని తెలిపారు. మొత్త 5 పడకలతో రోజుకు 20 మంది డయాలసిస్ సేవలు పొందవచ్చని అధికారులు వెల్లడించారు. ఆరోగ్య శ్రీ కార్డు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.



ఏరియా ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీసీఎంఎస్ సంగారెడ్డి

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు గృహిణుల ఆత్మహత్య

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: వేర్వేరు ఘటనల్లో అమీన్‌పూర్ ఠాణా పరిధిలో ఇద్దరు గృహిణులు ఆత్మహత్య చేసుకున్నారు. అమీన్‌పూర్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వివాహిత(27) భర్తతో కలిసి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి కిష్టారెడ్డిపేటలో ఉంటుంది. కొన్ని నెలలుగా ఆమె వీడియో కాల్‌లో సాయిచరణ్ అనే వ్యక్తితో మాట్లాడుతుండగా భర్త ఆమె తల్లికి చెప్పాడు. ఆమె కుమార్తెను నిలదీసింది. బుధవారం సాయంత్రం సమయంలో సాయి చరణ్‌తో వీడియో కాల్‌లో మాట్లాడుతూ ఊయల కొక్కేనికి చీర తగిలించి ఆత్మహత్య చేసుకుంది. తన కుమార్తె తిరస్కరించినా సాయిచరణ్ అనే వ్యక్తి పదేపదే వీడియో కాల్స్ చేశాడని, ఆమె మృతికి అతనే కారకుడంటూ తల్లి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

భర్త వివాహేతర సంబంధాన్ని తట్టుకోలేక..

పటాన్‌చెరు: భర్త వివాహేతర సంబంధాన్ని తట్టుకోలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. అమీన్‌పూర్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం. . పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్ మండలానికి చెందిన సునీత(44) భర్త అశోక్‌తో కలిసి పదేళ్లుగా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి ఐలాపూర్ గ్రామంలో ఉంటోంది. అశోక్ సివిల్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. అశోక్‌కు ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉందంటూ సునీత మదనపడుతోంది. దీనిపై తరచూ గొడవలు జరిగాయి. మంగళవారం అతను ఇంటికి రాకపోవడంతో సదరు మహిళతో ఉండొచ్చని సునీత మనోవేదనకు గురై ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తుతెలియని యాచకురాలి మృతి

శేరిలింగంపల్లి: చందానగర్ ఠాణా పరిధిలో గుర్తుతెలియని యాచకురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగండ్ల రైల్ ఓవర్ వంతెన కింద గుర్తు తెలియని(65) యాచకురాలు అపస్మారక స్థితిలో ఉంది. ఈ క్రమంలో పెట్రోలింగ్ పోలీసులు గురువారం ఉదయం పరిశీలించగా ఆమె మృతి చెందినట్లు నిర్ధారణకు వచ్చారు. సరైన ఆహారం లేక అనారోగ్యంతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికురాలి బ్యాగులో నగల చోరీ

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రైల్లో ప్రయాణికుల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా బీరంగూడ అమీన్‌పూర్‌కు చెందిన సియాద్రి జ్యోతి బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు నర్సీపట్నం వెళ్లింది. ఈనెల 22న గరీబరథ్ రైల్లో సికింద్రాబాద్‌కు వచ్చేందుకు బయలుదేరింది. ప్రయాణంలో నిద్రపోయింది. 23న రైలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. రైలు దిగి బస్సులో ఇంటికి వెళ్లాక హ్యాండ్‌బ్యాగులో చూసుకోగా.. అందులోని 85 గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. దీంతో సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని అమీన్‌పూర్ పోలీసులకు బదిలీ చేస్తున్నారు.

50 కిలోల ఎండు గంజాయి పట్టివేత

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: అక్రమంగా రవాణా చేస్తున్న 50 కిలోల ఎండు గంజాయిని బీడీఎల్ పోలీసులు పట్టుకున్నారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి పటాన్‌చెరు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కర్ణాటకలోని బీదర్ జిల్లా బాల్కి తాలూకా బాల్కి తండాకు చెందిన మల్లేష్ జాదవ్ రాజేంద్రనగర్‌లోని బుద్ధవిహార్ కాలనీలో ఉంటూ టిఫిన్ సెంటర్లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం ఒడిశాలోని మల్కాన్‌గిరి ప్రాంతంలో 50 కిలోల ఎండు గంజాయి కొన్నాడు. గంజాయిని 25 ప్యాకెట్లుగా చేసి కారులో బాల్కి గ్రామానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పటాన్‌చెరు మండలం కర్ధనూరు అవుటర్ వంతెన వద్ద బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పదంగా కారు నడుపుతూ ముందుకెళ్లబోతున్న సమయంలో పోలీసులు ఆపి తనిఖీ చేశారు. 25 ఎండు గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని మల్లేష్ జాదవ్‌ను విచారించారు. ఎండు గంజాయిని కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన దాదాపాటిల్, బీదన్, ప్రవీణ్ విక్రయించనున్నట్లు తెలిపాడు. ఎండు గంజాయితోపాటు కారు, ఇంటి వద్ద ఉన్న మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మల్లేష్ జాదవ్, దాదా పాటిల్, బీదన్, ప్రవీణ్‌పై కేసు నమోదు చేశారు. మల్లేష్ జాదవ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

అక్రమ బదిలీలు ఆపండి: టీఎస్‌యూటీఎఫ్

ఈనాడు, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలోని సర్కార్ బడులకు ఇతర జిల్లాల నుంచి అక్రమంగా బదిలీపై వస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తర్వులు ఇవ్వకుండా నిలిపేయాలని రంగారెడ్డి జిల్లా టీఎస్‌యూటీఎఫ్ కమిటీ ప్రతినిధులు గోపాల్‌నాయక్, వెంకటప్పలు గురువారం ఉన్నతాధికారులను అభ్యర్థించారు. జిల్లాలో ఇప్పటికే ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారని, అదనంగా ఇక్కడికి వస్తున్న వారితో భవిష్యత్తులో నిరుద్యోగులకు కొలువులు రావని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై రాజకీయ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్ లేని నియోజకవర్గంగా మార్చండి

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ట్రాఫిక్ లేని ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కోరారు. శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన పలు శాఖల అధికారుల సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. అడిషనల్ డీసీపీ జయరాంరెడ్డి హాజరైన ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం, సమష్టి కృషితో పనిచేసి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిలోకి తీసుకెళ్లాలని కోరారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లు పెట్టి ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించడంతోపాటు, ఆక్రమణలదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన జంక్షన్లను విస్తరించి సుందరంగా తీర్చిదిద్దాలని, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని చెప్పారు. సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి అధిక మొత్తంలో నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. మంచినీటి సమస్యలు తలెత్తకుండా చూడడం, మురుగు రోడ్లపై ప్రవహించకుండా డ్రైనేజీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని జలమండలి అధికారులకు సూచించారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు, వీధి దీపాల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. విద్యుత్ స్తంభాల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేయాలని చెప్పారు. ఉపకమిషనర్లు ముకుందరెడ్డి, మోహన్‌రెడ్డి, సురేష్, సుల్తానా, ఇంజినీరింగ్, జలమండలి, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ట్రాఫిక్ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ. పక్కన జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ జయరాంరెడ్డి

వంతెన ప్రతిపాదనలు సిద్ధం చేయండి

వివేకానందనగర్‌కాలనీ: ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రగతినగర్ రోడ్డు నుంచి జేఎన్‌టీయూ వరకు వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే గాంధీ కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ చౌహాన్‌ను కోరారు. గురువారం ఆయన్ని కలిసి కూకట్‌పల్లి, వివేకానందనగర్‌కాలనీ, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్, కొత్త ప్రతిపాదనలపై చర్చించారు. ఉషాముళ్లపూడి ఆసుపత్రికి వెళ్లే రోడ్డు విస్తరించాలన్నారు. చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు.

మట్టి రవాణా అడ్డగింత

రామచంద్రాపురం రూరల్: మట్టి రవాణాను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. తెల్లాపూర్ పురపాలక పరిధి వెలిమెల గ్రామంలో బుధవారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో అక్రమంగా ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వి టిప్పర్‌లో రవాణా చేస్తుండగా తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్ఐ శ్రీకాంత్ రాథోడ్ పట్టుకున్నారు. బీడీఎల్ పోలీసులకు అప్పగించారు.

లక్ష్యంమేర పనులు పూర్తి చేయాలి

చందానగర్: జలమండలి విభాగం సీవరేజీ వ్యవస్థ 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ పనులు కొనసాగుతున్నాయి. గురువారం హఫీజ్‌పేట్ నుంచి హుడాకాలనీ వరకు మురుగునీటి వ్యవస్థ బృందం చేపడుతున్న పనులను డీజీఎం వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. లక్ష్యం మేర పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

భాస్కర్‌రావుకు నివాళి

భాగ్యనగర్‌కాలనీ: దివంగత సీపీఎం నేత ఎన్.వి.భాస్కర్‌రావు వర్ధంతి సమతానగర్‌లో జరిగింది. కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్, శివప్రసాద్, ధర్మారావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మురుగు సమస్యల పరిష్కారానికి వినతి

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: కాలనీల్లో మురుగు సమస్యలు పరిష్కరించడానికి వీలుగా ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ పుష్ప కోరారు. గురువారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని హైదరాబాద్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సాయిజ్యోతినగర్, శ్రీనివాస్‌నగర్, మల్లికార్జుననగర్, మయూరినగర్, శ్రీసాయిననగర్, మల్లికార్జుననగర్, అశోక్‌నగర్, జ్యోతినగర్, కానుకుంట కాలనీల్లో మురుగు సమస్యలు ఉన్నాయని తెలిపారు. వీటికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు.

భద్రతపై అవగాహన ఉండాలి

పటాన్‌చెరు: భద్రతాపరమైన అంశాల్లో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆస్ట్రేలియాకు చెందిన మోట్ మెక్ డోనాల్డ్ అనే సంస్థ డైరెక్టర్ రోషన్ నాయర్ అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సొరంగ-భద్రత రూపకల్పన, సుస్థిరత, స్థిరత్వం, డిజిటలైజేషన్, కృత్రిమ మేధ అనే అంశాలపై సదస్సు నిర్వహించారు. డైరెక్టర్ సీతారామయ్య, ఆచార్యుడు శ్రీనివాస్ తదితరులున్నారు.

పచ్చదనం కోల్పోయి.. బోసిపోయి



బయోడైవర్సిటీ చౌరస్తాలో అందవిహీనంగా పైవంతెన స్తంభం


రాయదుర్గం బయోడైవర్సిటీ పై వంతెన స్తంభాలపై ఏర్పాటు చేసిన వర్టికల్ గార్డెన్ బోసిపోయింది. వంతెన కింద విభాగిని, స్తంభాల అందాలను తీర్చిదిద్దేందుకు అధికారులు సుందరీకరణ చేపట్టారు. విభాగినిలో అలంకార, పూల మొక్కలు నాటి ఆకట్టుకునేలా రూపొందించారు. స్తంభాల అందాలనూ మెరుగుపరిచేందుకు పలు స్తంభాలకు నిలువుగా పచ్చదనం పెంచేందుకు వర్టికల్ గార్డెన్ అభివృద్ధిపరిచారు. మొదట్లో ఆ వర్టికల్ గార్డెనింగ్ కుండీల్లో మొక్కలు నాటగా స్తంభాలు పచ్చదనంతో కళకళలాడాయి. క్రమంగా నిర్వహణ కరవై మొక్కలు మాయమై కుండీలు మాత్రమే మిగిలాయి. దీంతో ఆ స్తంభాలు అందవిహీనంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్టికల్ గార్డెనింగ్‌ను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, రాయదుర్గం**



కూడలి చెంత కళావిహీనంగా ఇలా..

అల్లుకున్న నిర్లక్ష్యం


ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్ పరిధులలో పలుచోట్ల కరెంటు స్తంభాలు, నియంత్రికలు, తీగలపైకి తీగ జాతి మొక్కలు ఎగబాకి ప్రమాదకరంగా మారాయి. పచ్చని తీగలు అల్లుకోవడంతో.. వాటి బరువుకు తీగలు కిందికి వేలాడుతున్నాయి. పలు చోట్ల విద్యుత్తు దీపాలకు చుట్టేయడంతో వీధులు చీకటిమయంగా మారాయి. ఈ తీగజాతి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉన్నా.. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్న వర్షం వచ్చినా.. ఈదురుగాలులు వీచినా.. విద్యుత్తు తీగలు తెగి కరెంటు సరఫరాలో అంతరాయం కలుగుతోందని వాపోతున్నారు. **– న్యూస్‌టుడే, ఆల్విన్‌కాలనీ**



హెచ్‌ఎంటీహిల్స్ రామాలయం నుంచి ప్రగతినగర్ రోడ్డులో..



సాయిచరణ్ కాలనీ నుంచి హెచ్‌ఎంటీ హిల్స్ వెళ్లే దారిలో..



శ్రీనివాస కాలనీలో నియంత్రికను చుట్టేసి..

పోలీసు అవుట్‌పోస్ట్.. ఆకతాయిల తిష్ఠ

హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్ సమీపంలో సైబరాబాద్ పోలీసులు ఏర్పాటు చేసిన పోలీసు అవుట్‌పోస్ట్ ఇది... ఓ ప్రైవేటు సంస్థ సీఎస్ఆర్ నిధులతో దీన్ని నిర్మించింది. కొంతకాలంపాటు ఇక్కడ పోలీసుల పికెట్ ఉండేది. తర్వాత దీన్ని పట్టించుకునేవారే కరవయ్యారు. ఫలితంగా అవుట్‌పోస్ట్ షెడ్ అధ్వానంగా తయారై ఖాళీగా పడి ఉంది. దీంతో మందుబాబులు, ఆకతాయిలు తిష్ఠ వేస్తున్నారు. రెండేళ్ల క్రితం ఓ మహిళను హత్య చేసి ఇదే అవుట్‌పోస్ట్‌లో పడేశారు. అయినా సరే పోలీసులు దీని నిర్వహణను పట్టించుకోవడం లేదు. కనీసం లోపలికి ఎవరు వెళ్లకుండా తలుపులకు తాళాలు కూడా వేయలేదు. **– న్యూస్‌టుడే, మాదాపూర్**





కుత్బుల్లాపూర్

పవిత్రోత్సవాలు ప్రారంభం



పేట్‌బషీరాబాద్: జీడిమెట్ల డివిజన్ పరిధి గోదావరి హోమ్స్ కాలనీలోని వేంకటేశ్వరాలయంలో గురువారం భక్తి శ్రద్ధలతో పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ నేతృత్వంలో నిత్య సహస్రనామ పారాయణం, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ చేశారు. వేద పండితులు శ్లోకగానం ఉత్సవాలను ప్రారంభించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని గోదాదేవి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ, సంక్షేమ సంఘం నేతలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

రూ.10 నాణేలు చట్టబద్ధమైనవి

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చలామణిలోకి వచ్చిన రూ.10 నాణేలు చట్టబద్ధమైనవని, వాటిపై అపోహలు అవసరంలేదని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ధారాసింగ్ నాయక్ సూచించారు. కోఠిలోని సెంట్రల్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయ ఆవరణలో గురువారం నాణేల చలామణిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. అనంతరం వ్యాపారుల నుంచి నోట్లు తీసుకొని రూ.10 నాణేలు అందజేశారు. బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ రామకృష్ణన్, డీజీఎం సురేష్(హైదరాబాద్), ఏజీఎంలు సత్యనాథ్, శ్రావ్యప్రభ, కనక్‌రాజ్, హైదరాబాద్ ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.



నాణేలు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ఉచితంగా స్టాళ్లు కేటాయించాలి

జియాగూడ, న్యూస్‌టుడే: అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(నుమాయిష్)లో ప్రభుత్వం భాగ్యరెడ్డివర్మ పేరిట పెవిలియన్ ఏర్పాటుచేయాలని తెలంగాణ కార్పొరేషన్ ఆఫ్ ఆర్గనైజ్డ్ దళిత ఎంటర్‌ప్రెన్యూర్స్(కోడ్) రాష్ట్ర అధ్యక్షుడు సి.ఆర్. మునిస్వామి, అఖిలభారత అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వినయ్‌కుమార్‌లు కోరారు. గురువారం వారు సభాపతి గడ్డం ప్రసాదకుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నుమాయిష్‌లో దళిత యువత, పారిశ్రామికవేత్తలకు ఉచితంగా స్టాళ్లు కేటాయించాలని కోరారు. స్పీకర్ సానుకూలంగా స్పందించి మంత్రి శ్రీధర్‌బాబుకు లేఖరాశారని వెల్లడించారు. కోడ్ ఉపాధ్యక్షుడు వేదన్‌కుమార్, మహిళా పారిశ్రామికవేత్తల అధ్యక్షురాలు రత్న తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వ్యతిరేకించడం తగదు

బషీర్‌బాగ్: పార్లమెంటులో ఆమోదించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కొంతమంది వ్యతిరేకించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన బషీర్‌బాగ్‌లో విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఓసీలు విద్యా, ఉద్యోగ రంగాల్లో అనేక అవకాశాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర సామాజిక వర్గాలకు నష్టం కలగకుండా అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లను కల్పిస్తే ఎందుకు జీర్ణం చుకోలేకపోతున్నారని ప్రశ్నించారు.

నిజాంపేటలో ప్రయాణం.. ప్రయాసే నిత్యం



ప్రగతినగర్ ఏనుగు బొమ్మల చౌరస్తా సమీపంలో కోతకు గురైన రోడ్డు

నిజాంపేట, న్యూస్‌టుడే

నిజాంపేట నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులు పూర్తిగా రాళ్లు తేలాయి. అడుగడుగునా రోడ్లు ధ్వంసమైనా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. నిత్యం వాహనదారులు ప్రమాదకరమైన పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. దీర్ఘకాలికంగా ఇదే దుస్థితి కొనసాగుతుండటంపై పురప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వర్షాకాలానికి ముందే రోడ్లకు మరమ్మతులు చేయాల్సినా పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం పరిస్థితి మరింత జటిలంగా మారింది.

ఎక్కడ చూసినా గుంతలే..

● ప్రగతినగర్ ఏనుగు బొమ్మల చౌరస్తా నుంచి కోతి బొమ్మల వైపు వచ్చే మార్గంలో పల్లంగా ఉన్నచోట రహదారి భారీగా కోతకు గురైంది. సమీపంలోకి వచ్చేవరకు సమస్య తెలిసేలా లేకపోవడంతో వాహనదారులు పల్లం దిగేప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు.

ప్రమాదకరంగా మారిన రహదారులు

● గోదావరి కట్స్ చౌరస్తా వద్ద రోడ్డు 200 అడుగుల వెడల్పుతో ధ్వంసమైంది. అక్కడ అధికారులు తాత్కాలిక చర్యల్లో భాగంగా వ్యర్థాలను పోసి చదును చేశారు. దాన్ని దాటే క్రమంలో ట్రాఫిక్ స్తంభిస్తోంది. అదే చౌరస్తా దాటి విజేత సూపర్ మార్కెట్ వైపు వెళ్లే మార్గంలో సైతం గుంతలు ఏర్పడ్డాయి.

● ఎలిప్ చౌరస్తాలో నాలుగు వైపులా రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. గుంతలతో వాహనాల రాకపోకలకు తీవ్ర అవరోధం కలుగుతోంది.

● బాచుపల్లి కమాన్ సమీపంలోని రోడ్డులో ఇరువైపులా రహదారి జల్లెడలా మారి ప్రమాదకరంగా ఉంది.

● నిజాంపేట కమ్మ సంఘం ఎదురుగా ఉన్న యూటర్న్ వద్ద రోడ్డు పెద్దఎత్తున ధ్వంసమైంది. దీంతో కొందరు వ్యర్థాలను డంపింగ్ చేశారు. ఈ కుప్పలను దాటే క్రమంలో ట్రాఫిక్ స్తంభిస్తోంది.

● నిజాంపేట బస్టాండు చౌరస్తా నుంచి బాటా



బాచుపల్లి రాజీవ్‌గాంధీ నగర్‌లో ధ్వంసమై..



నిజాంపేట బాటా సమీపంలో దారి మధ్యలో ఇలా..

షోరూం దాటాక జేఎన్‌టీయూ వైపు వచ్చే మార్గంలో ఏర్పడిన గుంతతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

● బాచుపల్లి రాజీవ్‌గాంధీ నగర్ వద్ద పూజిత ఎన్‌క్లేవ్ ఎదురుగా ఉన్న రోడ్డు ఒక్కసారిగా ఎత్తు పెరగడంతో దాటే క్రమంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

త్వరలోనే అభివృద్ధి పనులు: సత్యనారాయణ, నిజాంపేట నగర పాలక సంస్థ ఈఈ

ప్రగతినగర్ ప్రధాన రహదారి అభివృద్ధికి రూ.1.08 కోట్లతో అంచనాలు రూపొందించాం. తారురోడ్డు వేయడానికి రూ.70 లక్షలు కేటాయించాం. ఎలిప్ చౌరస్తాను సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి రూ.38 లక్షలతో అంచనాలు తయారుచేశాం. ఈ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. ఇక నిజాంపేట-బాచుపల్లి ప్రధాన రహదారిలోని గుంతలు పూడ్చడానికి రూ.10 లక్షలు కేటాయించాం

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ -80085 73403, | పేట్‌బషీరాబాద్: 8008573405
దుండిగల్ - 80085 73410 | నిజాంపేట: 8008573423,
షాపూర్‌నగర్: 8008573404, | జీడిమెట్ల: 8008574405

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే

? గాజులరామారం డివిజన్ పరిధి చిత్తారమ్మదేవి నగర్‌లో నాలావద్ద రోడ్డుపై చెత్త వేస్తున్నారు. రాకపోకలు సాగించేవారు దుర్గంధంతో ఇబ్బందులు పడాల్సివస్తోంది. –జాఫర్, చిత్తారమ్మదేవినగర్

✓ వెంటనే చెత్తను అక్కడినుంచి తరలిస్తాం. మరోసారి వేయకుండా స్థానికులకు కౌన్సిలింగ్ నిర్వహించి నోటీసు బోర్డు ఏర్పాటుచేయిస్తాం. –డాక్టర్ మమత, జీహెచ్ఎంసి వైద్యాధికారి

పార్కులో పిచ్చిమొక్కల తొలగింపు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారంలోని ప్రాణవాయు పార్కులో దారికి అడ్డంగా పెరిగిన పిచ్చిమొక్కలను ఎట్టకేలకు తొలగించారు. పార్కు నిర్వహణ బాధ్యతలను ఎవరూ పట్టించుకోకపోవడంతో వర్షాకాలంలో కురిసిన వర్షాలకు కాలిబాటకు ఇరువైపులా దారికి అడ్డంగా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. పది అడుగుల విస్తీర్ణంతో ఉన్న కాలిబాట ఐదడుగులకు కుంచించుకుపోయి ఉదయపు నడకకు వచ్చేవారికి ఇబ్బంది కలుగుతోంది. ఈ పరిస్థితిపై ఈనెల 16న.. 'ఇలాగుంటే... వెళ్లేదెలా' శీర్షికతో 'ఈనాడు'లో ఇచ్చిన కథనానికి ఉద్యాన విభాగం అధికారులు స్పందించారు. రెండు రోజులుగా దారికి అడ్డంగా ఉన్న పిచ్చిమొక్కలను తొలగింపు చేపట్టి కాలిబాటను బాగు చేస్తున్నారు.

ఈనాడు కథనానికి స్పందన



ఏపుగా పెరిగిన మొక్కలు



తొలగించిన తర్వాత..

నేరాల నియంత్రణపై సీపీ ఆరా

దుండిగల్, న్యూస్‌టుడే: దుండిగల్ పోలీస్ స్టేషన్‌ను గురువారం సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఠాణాలోని రికార్డులను పరిశీలించారు. పరిధిలో నమోదైన కేసుల వివరాలను, పెండింగ్ కేసులు, పెట్రోలింగ్, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, బాధితులు సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబరు 1930 కి వెంటనే సమాచారం అందిస్తే నగదు పోకుండా అడ్డుకోవచ్చని చెప్పారు. మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి, అదనపు డీసీపీ పురుషోత్తం, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, దుండిగల్ సీఐ పి.సతీష్, డీఐ బి.సతీష్, తదితరులు పాల్గొన్నారు.



ఠాణా ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న సీపీ అవినాష్ మహంతి

బస్సు సర్వీసులు పెంచాలని వినతి

జీడిమెట్ల, పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీ నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసుల సంఖ్యను పెంచాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంజయ్యగౌడ్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కరోనా సమయంలో పూర్తిగా బస్సు సర్వీసులను రద్దు చేశారు. గతంలో 20 సర్వీసులు ఉండగా, ఇప్పుడు ఆరు మాత్రమే కొనసాగిస్తున్నారు. దీంతో ఇక్కడి నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే చిరుద్యోగులు, కార్మికులు ప్రైవేటు వాహనాల్ని ఆశ్రయించాల్సి వస్తోందని వినతిపత్రంలో తెలిపారు. ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి మళ్లీ పూర్తి స్థాయిలో నడిపేలా చొరవ తీసుకోవాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, ప్రతినిధులు సత్యం, యు.అంజయ్యలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రమిస్తున్న సంఘం నేతలు

మేడాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

గుమ్మడిదల: నల్లవల్లి అటవీ ప్రాంతంలో మేడాలమ్మ తల్లిని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద దర్శించుకున్నారు. గురువారం ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ వ్యవస్థాపకులు సంజీవరెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట నాయకులు గోవర్దన్ రెడ్డి, నర్సింహరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, యాదగిరి, రాంబాబులు ఉన్నారు.

పటాన్‌చెరులో డయాలసిస్ కేంద్రం

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సేవలు అందించేందుకు వీలుగా పటాన్‌చెరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని ఆరోగ్య శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ సంగారెడ్డి తెలిపారు. గురువారం పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. రేడియాలజీ, స్కానింగ్, ఎక్స్ రే కేంద్రాలు పరిశీలించారు. రోజువారీగా ఎన్ని డెలివరీలు చేస్తున్నారనే వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వైద్య బృందంతో సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి మాట్లాడుతూ.. కిడ్నీ సంబంధిత వ్యాధులున్న నిరుపేదలు పూర్తిస్థాయి డయాలసిస్ సేవలు పొందేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఏరియా ఆసుపత్రి రెండో అంతస్తులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు ప్రత్యేకంగా వైద్యుల నియామకం చేపట్టామన్నారు. నర్సుల కొరత ఉంటే ఇతర ప్రాంతాల నుంచి డిప్యూటేషన్‌పై తీసుకున్నామన్నారు. మొత్త 5 పడకలతో రోజుకు 20 మంది డయాలసిస్ సేవలు పొందవచ్చని అధికారులు వెల్లడించారు. ఆరోగ్య శ్రీ కార్డు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.



పటాన్‌చెరు ఆసుపత్రిలో వివరాలు తెలుసుకుంటున్న డీసీఎంఎస్ సంగారెడ్డి

వారాంతపు సంతల్లో ట్రాఫిక్ కట్టడికి చర్యలు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: వారాంతపు సంతల్లో ట్రాఫిక్ కట్టడికి పోలీసులు చర్యలు చేపట్టారు. రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఇటీవల పలు ప్రాంతాల్లో వారాంతపు సంతలు ఏర్పాటుచేస్తున్నారు. చాలా కాలనీల్లో రోడ్లు ఇరుకుగా ఉండగా, రోడ్డుపైకి తోపుడు బండ్లను నిలపడం, వినియోగదారులు వాహనాలను నిలుపుతుండటంతో రాకపోకలు స్తంభిస్తున్నాయి. గాజులరామారం కూడలి, హెచ్ఎఎల్‌కాలనీ, సంజయ్‌గాంధీనగర్, మల్లారెడ్డినగర్, ఉషోదయాకాలనీ, రోడామిస్త్రీ నగర్, ఇందిరానగర్‌లతో పాటు పలు ప్రధాన రహదారుల్లో వారాంతపు సంతల కారణంగా వాహనదారులు గంటలపాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేస్తున్నా, ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. దీంతో గురువారం గాజులరామారం బాలాజీ లేఅవుట్‌లో ట్రాఫిక్ పోలీసులు కార్యాచరణకు దిగారు. రోడ్డుపై హద్దులను ఏర్పాటుచేయడంతో పాటు దుకాణ సముదాయాలు, అపార్టుమెంట్లను ఆనుకుని రెండు మూడు అడుగుల లోపు మాత్రమే దుకాణాలుండాలని ఆదేశించారు. రోడ్డుపైకి వచ్చిన వ్యాపారులకు మొదటి హెచ్చరికగా రూ.100 చలానా విధించారు. రెండోసారి రోడ్డుపైకి వస్తే జరిమానా రెట్టింపు చేస్తామని హెచ్చరించారు



తోపుడుబండిపై చలానా విధిస్తున్న ట్రాఫిక్ అధికారి

కుత్బుల్లాపూర్‌లో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ తనిఖీ

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ మధుసూదన్‌రెడ్డి సందర్శించారు. వక్ఫ్‌బోర్డు భూములున్నాయనే కారణంతో ఆగస్టు నుంచి కుత్బుల్లాపూర్‌లోని సర్వే నంబర్లు 55 నుంచి 226 వరకు 176 ఎకరాల్లో రిజిస్ట్రేషన్లను నిలిపివేశారు. ఈ స్థల వివాదం కొలిక్కివచ్చేవరకు రిజిస్ట్రేషన్లు చేయవద్దని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాష్ ఆగస్టు 27న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో భూలావాదేవీల్లో ప్రతిష్టంభన ఏర్పడి 50కి పైగా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య సగానికి పడిపోయి ప్రభుత్వ ఆదాయానికి గండిపడింది. 2024లోనే ఇక్కడ ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్‌లు బదిలీ అయ్యారు. పదిరోజుల కిందట బాధ్యతలు తీసుకున్న సబ్‌రిజిస్ట్రార్ అశోక్ ఒకరోజు విధులు నిర్వహించి సెలవుపై వెళ్లారు. దీంతో నిత్యం ఏదోఒక సబ్‌రిజిస్ట్రార్ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాఖ డీఐజీ ఆకస్మికంగా తనిఖీచేసి ఇక్కడి పరిస్థితిని సమీక్షించారు. సిబ్బందితో మాట్లాడి రిజిస్ట్రేషన్ల తీరుపై వివరాలను సేకరించారు. కొన్ని దస్త్రాలను వెంట తీసుకెళ్లినట్లు సమాచారం. సంబంధిత అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపిస్తామని ఆయన తెలిపారు. మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయంలో లావాదేవీలను పరిశీలిస్తున్న డీఐజీ మధుసూదన్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఎస్సై సుమన్ వివరాల ప్రకారం..జగద్గిరిగుట్ట పరిధి గాంధీనగర్‌కు చెందిన మహమూద్ షంషుద్దీన్-సుల్తాన్ బీ దంపతులు గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో హౌస్‌కీపింగ్ చేస్తుంటారు. ఈ నెల 21న ఇంటి నుంచి ఉదయం 11 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై కంపెనీకి బయలుదేరారు. జేఎన్‌టీయూ రోడ్డులో గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టి వెళ్లిపోయింది షంషుద్దీన్‌కు స్వల్ప గాయాలవగా.. తీవ్రంగా గాయపడిన సుల్తాన్ బీ(44)ని ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న ఆమె బుధవారం అర్ధరాత్రి ప్రాణాలు కోల్పోయింది. షంషుద్దీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రైవేటులోనూ నిర్వహణ అధ్వానమే

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: కుత్బుల్లాపూర్ పట్టణానికి ఒక అందాన్ని తీసుకురావాల్సిన ప్రధాన రహదారులు నిర్మాణ వ్యర్థాలు, చెత్తా చెదారంతో అధ్వానంగా మారుతున్నాయి. సీఆర్ఎంపీ(సమగ్ర రహదారుల నిర్వహణ కార్యక్రమం) కింద ప్రధాన రహదారుల ఐదేళ్ల నిర్వహణ కాంట్రాక్టును ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించిన విషయం విదితమే. ఆ ఏజెన్సీ కాంట్రాక్టు కాలపరిమితి ఈ ఏడాది డిసెంబరుతో ముగియనున్నా ఆశించిన మేరకు రహదారులు అభివృద్ధి చెందలేదు. కనీసం రోడ్ల పక్కన నిల్వచేరి భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తను కూడా వారు తొలగించడంలేదు. గాంధీనగర్ పారిశ్రామిక వాడలోని ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన వ్యర్థాలే అందుకు నిదర్శనం. అధికారులు, ఏజెన్సీవారు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.



గాంధీనగర్ సీఆర్ఎంపీ రహదారి పక్కన కుప్పగా వ్యర్థాలు

ఆలయం దారిలో జర భద్రం!


నిజాంపేట, న్యూస్‌టుడే: నిజాంపేట మెయిన్ రోడ్డులోని బస్టాండు చౌరస్తా పక్కన కనకదుర్గా దేవి ఆలయం ఉంది. ఆలయం ముందు నుంచి పాత పంచాయతీ వరకు ఇటీవల తాగునీటి పైపులైన్ విస్తరణ పనులు జరిగాయి. అందులో భాగంగా ఆలయ ప్రధాన గేటు ముందు రోడ్డుపై మ్యాన్‌హోల్ ఏర్పాటుచేశారు. ఇటీవల అది పూర్తిగా ధ్వంసమైంది. ఆలయానికి వచ్చే భక్తులు ఈ మ్యాన్‌హోల్ పక్క నుంచే లోపలికి వెళ్లాలి. మూత ధ్వంసమైన ఈ మ్యాన్‌హోల్ లోతుగా ఉంది. ఇటుగా వెళ్లేవారు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఇందులో పడిపోవడం ఖాయం. వారం రోజులుగా ఈ పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. సత్వరమే స్పందించి మరమ్మతులు చేయించాలని పరిసర వాసులు కోరుతున్నారు.



గేటు ఎదురుగా మ్యాన్‌హోల్ దుస్థితి

కారడవి కాదు.. క్రీడా ప్రాంగణమే

దుండిగల్ పుర పాలక సంఘం మున్సిపల్ కార్యాలయం రోడ్డులో ఉన్న తెలంగాణ క్రీడా ప్రాంగణం దుస్థితి ఇది. ఇటీవల వర్షాలకు ఆవరణంతా పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తోంది. వాహనాలు కూడా వెళ్లలేని రీతిలో పూర్తిగా రోడ్డును కమ్మేశాయి. దీంతో రూ.లక్షలు ఖర్చు చేసి భూమిని చదును చేసి క్రీడాకారుల కోసం ఏర్పాటుచేసిన ప్రాంగణం ఇలా నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి క్రీడల సాధనకు అనుగుణంగా మళ్లీ తయారుచేయాల్సిన అవసరముంది.



బంగారానికి మెరుగుపెడతామని మోసం

త్రిపురారం, న్యూస్‌టుడే: బంగారానికి మెరుగుపెడతాం, పూసలు అల్లుతామంటూ ఇద్దరు వ్యక్తులు ఓ గ్రామంలో తిరుగుతూ.. మోసానికి పాల్పడిన ఘటన ఇది. బాధితుల వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా త్రిపురారం మండలం లక్ష్మీపురలో గురువారం హైదరాబాద్‌లోని కార్మికనగర్‌కు చెందిన 60ఏళ్ల వయస్సు పైబడిన పత్తిపాటి నాగరాజు, బొబ్బ వెంకట్‌రెడ్డి తిరిగారు. గ్రామానికి చెందిన కొంగరి సునీత వారితో పూసలు అల్లించుకున్నారు. బంగారానికి మెరుగుపెడతామనే సరికి తన రెండు తులాల పుస్తెలతాడును వారికి ఇచ్చారు. పుస్తెల తాడును ద్రావణంలో కరగబెట్టడంతో రాగి రంగులోకి వచ్చింది. బరువు సైతం తగ్గింది. ఇది గమనించే లోపే.. నిందితులు గ్రామంనుంచి పరారయ్యారు. బాధితురాలు గ్రామస్థులకు తెలియజేయడంతో స్థానిక యువకులు పరిసర గ్రామాల్లో ఆచూకీ కోసం బైక్‌లపై వెళ్లారు. కంపసాగర్ పరిధిలో పట్టుకొని నిలదీయగా నిజం ఒప్పుకున్నారు. తిరిగి గ్రామానికి తీసుకెళ్లి బంగారాన్ని కరగబెట్టగా 20 గ్రాములకుగాను 17నుంచి 18 గ్రాములే వచ్చింది. గ్రామస్థులు వారిద్దరిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులుకేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ పాన్ మసాలాల తయారీ.. ఇద్దరి అరెస్టు

చాంద్రాయణగుట్ట: నకిలీ పాన్‌మసాలాలు, జర్దా, పొగాకు ఉత్పత్తులు తయారుచేసి విక్రయిస్తున్న ఇద్దరిని ఫలక్‌నుమా పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి వివరాల ప్రకారం.. ఫాతిమానగర్‌కు చెందిన ఇమ్రాన్(32), ఖాజీపురకు చెందిన జుబైర్(29)లు రహమత్‌నగర్‌లో నకిలీ పాన్‌మసాలాలు, జర్దా పొగాకు ఉత్పత్తులు తయారు చేసి విక్రయిస్తున్నారు. దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్, ఫలక్‌నుమా పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేసి రూ.2.10లక్షల విలువైన వివిధ బ్రాండ్ల పేరిట ఉన్న నకిలీ పాన్‌మసాలాలు, జర్దాను, ప్యాకింగ్ మిషన్‌ను, మిక్సింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

చిత్తశుద్ధి లేదు.. చెత్త తొలగదు!



జీడిమెట్ల డిపో వద్ద కాలిబాటపై పడిఉన్న చెత్త డబ్బాలు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే

జంట సర్కిళ్లలో ప్రధాన రహదారుల పక్కన ఏర్పాటుచేసిన తడిపొడి చెత్త డబ్బాల నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. సంబంధిత డబ్బాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో బరువుకు పలుచోట్ల అవి ఛిద్రమవుతుండగా, మరి కొన్నిచోట్ల చిల్లర దొంగలు తస్కరించుకుపోతున్నారు. ఫలితం.. స్వచ్ఛత లక్ష్యం నెరవేరని పరిస్థితి ఏర్పడుతోంది...

మూడున్నరేళ్లలో మూడు సార్లు..

కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలో మూడున్నరేళ్ల కిందట రూ.1.5 లక్షలతో ప్రధాన రహదారులు, మార్కెట్లు, పార్కుల్లో సుమారు 65 వరకు రెండు రకాల(తడి, పొడి) చెత్తడబ్బాలను ఏర్పాటుచేశారు. నిర్వహణ వైఫల్యంతో కొన్ని నెలలకే పలుచోట్ల అవి పూర్తిగా ధ్వంసం కాగా మరి కొన్ని చోరీకి గురయ్యాయి. దీంతో రెండేళ్ల కిందట మరో రూ. 2 లక్షలు వెచ్చించి కొత వాటిని పెట్టారు. మరి కొన్ని చోట్ల మూడు రకాల డబ్బాలు(తడి, పొడి, హానికర వ్యర్థాలకు) ఏర్పాటుచేశారు. వీటిలో మళ్లీ 80 శాతం డబ్బాలు కనుమరుగయ్యాయి. గత ఏడాది ఏప్రిల్‌లో మరోసారి రూ.4 లక్షలతో ప్రతి 300 మీటర్లకు మూడేసి చెత్తడబ్బాలను ఏర్పాటుచేశారు. నిర్వహణ వైఫల్యంతో కొన్ని రోజులకే ఇవి కూడా ధ్వంసమయ్యాయి.

మూన్నాళ్లకే ధ్వంసమవుతున్న డబ్బాలు

ఛార్జీలు తప్పించుకోవడానికి..

ప్రధాన రహదారుల పక్కన ఉన్న వివిధ కాలనీలు, బస్తీలకు చెందినవారు తమ ఇళ్లలో వెలువడే చెత్తను స్వచ్ఛ ఆటో టిప్పర్ల నిర్వాహకులకు ఇవ్వడంలేదు. నెలకు రూ. 50-70 ఛార్జీలు చెల్లించాల్సి ఉండటంతో వాటిని తప్పించుకోవడానికి చెత్తను ప్లాస్టిక్ సంచుల్లో మూట కట్టి ఈ డబ్బాల్లో వేస్తున్నారు. వీటిలో వ్యర్థాలను రోజుకు రెండుసార్లు ఖాళీ చేయాల్సిన బాధ్యత బల్దియా సిబ్బందిపై ఉన్నా రోజుల తరబడి నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో వ్యర్థాల బరువుకు కొన్నిచోట్ల అవి కిందపడి ఛిద్రమవుతుండగా, మరి కొన్నిచోట్ల దుకాణాల ముందు ఏర్పాటుచేసిన డబ్బాలను వ్యాపారులు తొలగించి పక్కన పడేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చెత్త డబ్బాల పకడ్బందీ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సర్కిళ్ల ప్రజలు కోరుతున్నారు.



సూరారం రోడ్డు పక్కన ఓ ప్రహరీ లోపల పడేసిన డబ్బాలు

ఆన్‌లైన్ మోసం.. పోలీసులకు ఫిర్యాదు

దుండిగల్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్‌లో ఓ యువకుడు ల్యాప్‌టాప్‌ను కొనుగోలు చేస్తే.. పార్సిల్‌లో రాయి, పగిలిపోయిన కీబోర్డ్ వచ్చిన ఘటన దుండిగల్‌లో చోటుచేసుకుంది. స్థానిక యువకుడు బి.ప్రణయ్ ఈనెల 21న ఓ ఈ కామర్స్ సంస్థలో ఆన్‌లైన్ ద్వారా రూ.47 వేలు చెల్లించి ల్యాప్‌టాప్‌ను కొనుగోలు చేశాడు. గురువారం సంబంధిత పార్సిల్ వచ్చింది. వచ్చిన ప్యాక్‌లో ల్యాప్‌టాప్‌కు బదులు రాయి, పగిలిపోయిన కీబోర్డు కనిపించాయి. దీంతో కంగుతిన్న బాధిత యువకుడు దుండిగల్ పోలీసులను ఆశ్రయించాడు. బిల్లు, ఇతర సరైన ఆధారాలతో వెంటనే సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదుచేయాలని పోలీసులు అతడికి సూచించారు.